UNIVERSAL
LIBRARY
OU_204223
UNIVERSAL
LIBRARY

# టాల్ స్టాయ్ కథలు

(ఆంధ్రానువాదము.)

అనువాదకుఁడు:

హొసూరు నంజుండరావు, బి. ఎ.

సర్వస్వామ్య సంకలితము.

వెల 0–8–0.

సాధన ముద్రాశాల
అనంతపురము.

1936

# భూమిక

ప్రపంచమునం దొకొకప్పుడు జనులలో శ్రీమంతులు బలాఢ్యులునైనవారు తమ ప్రాబల్యమదముచే నీతి విదూరులై జనసామాన్యమును పీడించి పిండి పిప్పి జేసి తుదకు వారు దమపై తిరుగుబా టొనరించునట్లు చేసికొనెదరని లోకచరిత్రము సువ్యక్తము చేయుచున్నది. లోకమున ధర్మగ్లాని సంభవించినపుడు, అనగా సమాజదృఢత్వము సడలినపుడు, పరమాత్ముడు ధర్మరక్షణార్థమై తన మహావిభూతులచే గొందఱను సృష్టించి, వారిమూలమున సంఘమును సువ్యవస్థకు దెచ్చును. ఇట్టి మహావ్యక్తులలో కౌంట్ లియో టాల్‌స్టాయ్ అను రష్యాదేశస్థు డొకడు. ఈ మహాపురుషుడు క్రీ. శ. 1828 వ సంవత్సరమున ప్రభువర్గములో నొక శ్రీమంతుని వంశమున జన్మించెను. బాల్య యౌవనములందంతయు నతడు తన చుట్టుపట్టనుండు వారివలెనే విషయ సుఖములలో గడపివైచెను. అప్పుడప్పు డించుక విచారము మనస్సున సంచరించినను, లోకాభిప్రాయము నెదురింప ధైర్యములేక, మఱచి నట్లుండిపోయెను. తత్త్వ చింతాపర చిత్తవృత్తిగల టాల్‌స్టాయ్, మధ్య వయస్సు దాటిన పిదప, దృఢ సంకల్పుడై యెవ్వరేమనినను సరకుగొనక, యప్రతిమ సాహస ధైర్యములతో

దన నూతన మానవజీవన తత్త్వములను బ్రపంచమునకుఁ జాటెను. శేషించిన జీవితకాలము నంతయు నతఁడు లోకసేవలోనే గడపెను. ఇతఁడు సుప్రసిద్ధ కవిపుంగవుఁ డౌటచేఁ దన కవిత్వపటిమ నంతయు నీజీవన తత్త్వములను బ్రతిపాదించుటకై వినియోగించెను. అతఁడు రచించిన నవలలు, నాటకములు, కథలు, వ్యాసములు మున్నగునవి రష్యా దేశమునందే గాక, ప్రపంచమునం దెల్లెడలను బహు భాషలలోఁ బ్రకటింపఁబడి పఠింపఁబడు చున్నవి. ఆతని ప్రబోధము లిప్పుడు లోకమునం దంతటను నొక విధమైన సంచలనమును గలిగించినవి.

టాల్‌స్టాయ్ మహామహుని బోధనల నర్థము జేసికొన వలయునన్న నాతని కాలమున నుండిన రష్యా దేశపుస్థితి నెఱుంగుట యత్యవసరము. రష్యాదేశము నం దప్పుడు లక్షలకొలఁది యెకరముల భూములు, కొందఱు భూస్వాముల యధీనములై, బీదజనులకు నిరుపయోగములై యుండెను. బీద లాభూములలో నడుగు నయితము బెట్టకూడదు. తెలిసియో తెలియకయో యెవ్వరైన నభాగ్యులు గడ్డికాని కట్టెలుకాని సేకరించినచో వారిని గఠిన శిక్షలకు గుఱిసేయు చుండిరి. ఇందునకుఁ దోడు వేలకొలఁది యెకరములు భూస్వాములు వేటాడుటకై ప్రత్యేకింపఁబడి యతి జాగరూకతతో

రక్షింపఁబడు చుండెను. సారాంశమేమన, కర్షకులకు భూములు లేవు; కర్మకారులకు బరిశ్రమలులేవు; పన్నులధికము; పేదలకుఁ దినుట కన్నమునుఁ గట్టు గుడ్డలును లేవు. ఇఁక శ్రీమంతు లన్ననో, స్వసుఖపరాయణులై జన సామాన్యమును నిరసనభావముతోఁ గాంచుచు దమ సేవా నిమిత్తమైయే వారిని దేవుఁడు సృష్టించినట్లు తలంచు చుండిరి. ఒక వైపు బహు సంఖ్యాకులైన ప్రజలు పశువులకంటె హీనులై గర్భదారిద్ర్యవస్థలో నకనకపడుచుండుటయు, నింకొకయెడ నల్ప సంఖ్యాకులైన శ్రీమంతులు భోగలాలసులై బంగరు తూగుటుయ్యేలలలోఁ దూగుచుండుటయు టాల్‌స్టాయ్ గ్రహించి యత్యంత ఖేదమనస్కుఁడై యీ యవ్యవస్థను సరిదిద్ద సమకట్టెను. మానవ జన్మమెత్తిన ప్రతి ధృఢకాయుఁడును కాయకష్టపడినగాని తన గ్రాసమున కర్హుఁడు కాఁడనియు, బరస్పర విశ్వాసముతోఁ బ్రతిమానవుఁడును తనతోడి వారికి సాయపడుచుండ వలెననియు, నివియే దైవ నియమములనియు టాల్‌స్టాయ్ ప్రపంచమునకు జాటెను. ఈ తత్త్వములను బ్రతిపాదించుటలో నతఁడు తన సమకాలికులును దనకంటె నించుక వెనుక నుండిన వారునునైన "గోగోల్" "డాస్టాయ్ ఎవ్‌స్కి" "టర్గనియాఫ్" మున్నగు రష్యాదేశపు ప్రబోధకుల ననుసరించెను. ఏ విధమైన మూలధనమును వ్యక్తులు కూడబెట్టరాదనియు, నిత్య వ్యవహారములలో మనస్తాపము లంకు

రించి నపుడు వాని నన్యోన్య సౌహార్ద్ర భావములతో పరిసిద్ధుగొన వలయుచేగాని ప్రభుత్వపు న్యాయస్థానములకెక్కి తన్మూలమున ద్వేషానలమును బ్రజ్వలింపఁ జేయరాదనియు, దుష్టులను నయితము సౌమ్యమార్గమున శిష్టులుగమార్చ యత్నింప వలయునేగాని పశుబలము నుపయోగించి వారిని శిక్షలకు గుఱిసేయ రాదనియు, నధికార బలముపై నాధారపడిన ప్రభుత్వపు టునికియే యొక విధమైన దౌర్జన్య మనియు (violence), టాల్‌స్టాయ్ బోధించు చుండెను. బోధించుటయే కాదు! తన జీవనమునం దాచరణలో నుంచి తదితరులకును జూపెను. ఈ మహాత్మునికి దైవ నియమములలోని గాఢవిశ్వాసమే యీ సిద్ధాంతములకు మూలకంనము. పరమాత్ముఁడు ప్రతి జీవాత్మయందును నడఁగి యున్నాఁడనియు, నా పరమాత్ముఁడు తన్ను సాక్షాత్కరించుకొనుటకే మానవ రూపమునందె ననియు, ప్రతి వ్యక్తియు నా పరమాత్మునిపై భారమువైచి విశ్వప్రేమమును జూపుచుఁ దోడి మానవులకుఁ దోడునీడై మెలంగు చుండవలసిన దనియు, టాల్‌స్టాయ్ నొక్కిచెప్పు చుండెను. బైబిల్‌లోని ముఖ్య వాక్కులకు జనసామాన్యము పెడర్థము నిచ్చుచున్నదనియు, తాఁ జెప్పునదే సరియైన యర్థమనియు సారెసారెకు బోధించు చుండెను. ఈ మహాత్ముఁ డాగర్భ శ్రీమంతుండై నను నహంకార మమకారములను విడనాడి, ప్రాపంచిక వ్యామోహములనుండి

తప్పించుకొని, వైరాగ్య శిఖామణియై, పిత్రార్జితము లైన తన వందలకొలఁది యెకరముల భూములను కర్షకులకుఁ బంచిపెట్టి వారితోఁ దానును పరమదైన్యముతో నిశ్చల నిర్మల మనస్కుఁడై పనిచేయు చుండెను. ఇట్లు తోడి మానవుల సేవలోఁ దన జీవితకాలము నంతయు ధారవోసి, క్రీ. శ. 1910 వ సంవత్సరమున నీ పుణ్యపురుషుఁడు పరమపద మందెను. ఇం దనువదింపఁబడి యుండు కథలలో నీతని తత్త్వము లతి మనోహరముగ నిరూపింపఁబడి యున్నవి.

టాల్‌స్టాయ్ చేసిన ప్రబోధములు కొంతవఱకు జనుల కలవడెను. ఇట్లుండ క్రీ. శ. 1914 వ సంవత్సరమున ఘోర సంగ్రామము ప్రారంభ మాయెను. రష్యాకూడ అందుఁ బాల్గొనెను. అప్పుడు రష్యాలో నుండిన ప్రజా ప్రముఖులు కొందఱదివర కుండిన నిరంకుశ చక్రవర్తి పరిపాలనము నంత మొందించి దాని స్థానమునఁ బ్రభుత్వ సమష్టి పద్ధతిని స్థాపించిరి. భూములన్నియు భూస్వాములనుండి లాగుకొనఁబడి కర్షకుల కియ్యఁబడెను. బీడు భూములన్నియు సాగుబడిలోనికిఁ దేఁబడెను. రష్యాదేశమం దిప్పుడు ప్రజల స్థానిక కూటముల మూలమున (Rule by Soviets) ప్రభుత్వము నడుపఁబడు చున్నదఁట. టాల్‌స్టాయ్ చేసిన బోధనలలో ముఖ్య సూత్రములైన అహింసా తత్త్వ

మును ఆస్తికత్వమును రష్యాలో నిష్ఫ డమగంటినదని వినికి. ఆతని యార్థిక సిద్ధాంతములలోఁ గొన్ని ప్రబలి యుండినను అవి దుస్సాధ్యములనియు, పట్టి నీటివ్రాతే యనియు బహుజనాభిప్రాయము.

నే నిదివరలో రచియించిన 'కుబేరపతనము' అను నాటకమును మైసూరు విశ్వవిద్యాలయమువా రనుగ్రహించి ప్రవేశ పరీక్షకుఁ బఠనీయ గ్రంథముగ నుంచి నన్నుఁ బ్రోత్సహించి నందులకై వారికి నేను గృతజ్ఞతా పూర్వకములైన వందన సహస్రముల నర్పించుచున్నాఁడను. దీని యెడలను నట్టి యాదరమునేచూపి నాకుత్తేజము నొసంగ వలయునని వేడుచున్నాఁడను.

12 ఈస్టురోడ్<br>బసవనగుడి పోస్టు<br>బెంగుళూరు. 1-12-36.

ఇట్లు విన్నవించు,<br>విద్వజ్జన పాదధూళి,<br>హెచ్. నంజుండరావు.

# మున్నుడి

'టాల్‌స్టాయి' గొప్పకథకుఁడు. ఈతఁడు రచించిన కథలు ప్రపంచవిఖ్యాతిఁ గాంచినవి. ప్రపంచమందలి నాగరిక భాషలన్నిటిలోనికి ఇవి యనువదింపఁ బడినవి.

'టాల్‌స్టాయి' తనకథలమూలమునఁ దన దేశమగు రష్యాలో గొప్పమానసిక సంచలనమును గలిగించి నాఁడు. పేదల కష్టజీవనము నాతఁ డతిసులభమగు, కలానిబద్ధమగు మాటలతీరుతోఁ జిత్రించి మంచువలె గడ్డకట్టి కొఱఁబాఱిన హృదయములఁ గరఁగించి రష్యాదేశము మరలఁ జైతన్యముతోఁ దలయెత్తి పాఱాడ జవసత్త్వములఁ గల్పించినాఁడు.

'టాల్‌స్టాయి' కథలనుగూర్చి యింగ్లీషు చదువుకొనినవారికి మాత్రము తెలిసియుండును. ఇటీవలఁ గొందఱు వానిని తెనుఁగునవ్రాయుచున్నారు. వారిలో హెచ్. నంజుండరావుగా రొకరు. వీరిభాష సులభముగను కథాకథనమున కనుకూలముగను నున్నది. ఈ సంపుటమున మూఁడుకథలు మాత్రమున్నవి. నంజుండరావుగారింకను నిట్టికథల ననేకములనువ్రాసి తెనుఁగువారి మన్ననలకుఁ బాత్రులగుదురు గాకయని కోరుచున్నాను.

అనంతపురము
22—12—1936

చిలుకూరి నారాయణరావు.

# విషయ సూచిక


| | పుట |
|---|---|
| 1 మానవజీవన మూలకందము<br>(What men live by) | 1-66 |
| 2 డొల్లు ఢక్క<br>(The empty drum) | 67-88 |
| 3 దయయే దైవము<br>(God is love) | 89-120. |

# మానవజీవన మూలకందము

I

తొల్లి రష్యాదేశంబున నొక చిన్న పట్టణంబున సైమన్ అను గోడగరవాఁ డొక డుండెను. అతఁడు కడు బీదవాఁడు. పెద్ద కుటుంబి. సొంతపు టిల్లుగాని భూమిగాని యెద్దియును నతని కుండలేదు. కలిమిగల యొక కృషీవలుని సదనమును బాడుగకుఁ గైకొని యుం దతఁడు కాపురము సేయుచుండెను. జీవనోపాధికై యతఁడు తన చర్మకార వృత్తిమీఁదనే యాధారపడి యహరహమును గాలక్షేపము సేయుచుండెను. ధాన్యము ప్రియము; కూలి చవుక. దానంజేసి యతఁ డార్జించిన పైకమంతయు నుదరంభరణమునకే సరిపోవుచుండెను.

రష్యా స్వాభావికముగ శీతలదేశము. అందునను జలికాలమున నందలి జనులు, సీతునకోర్వలేక, మేష చర్మకృతమైన గొంగళి నిలువుటంగులను ధరింతురు. సైమన్ మార్తా దంపతుల కిరువురకును జేరి యొకటే నిలువుటంగి యుండెను. అదియును జాల ప్రాఁతవడి చినిగి యుండెను. ఏటేటను వారు చలికాల మాసన్నమయినపుడు క్రొత్త నిలువుటంగిని గుట్టింపఁ బ్రయత్నించు చుండిరి

గాని బీదవారి కోరికలు సులభముగ నీడేరునా? వీరి కోరికయు నుత్తమాటలయందే పరిసమాప్తి నొందు చుండెను. సంసారపుఁ దొసఁగు లెన్నియుండినను నీసారి వారు నిలువుటంగీ నెట్లైనను గొన నిశ్చయించు కొనిరి. సంసార నిర్వాహకమున మార్త మితవ్యయ మొనరించి, డబ్బును సేకరించి, మైదు రూపాయల వఱకుఁ జేర్చి, దానిని భద్రముగ బెట్టెలో దాచియుంచి యుం డెను. అందునకుం దోడు పరిక్కుపల్లెలో నిద్దఱు గృహ స్థులు సైమనున కైదు రూప్యముల కూలిడబ్బు నీయ వలసిన వారైరి. దానిని బోగుచేసి, మొత్తము పది రూప్యములకు నొక గొంగళి నిలువుటంగిని గుట్టింప నతఁడు నిశ్చయించెను.

సైమనొక సంతనాడు వేకువ జాముననే లేచి, ప్రాత ర్విధులను ముగించుకొని, యల్పాహారమును గైకొని, మార్తయంగిని లోపల ధరియించి, పైనఁ జినిగిన నిలువు టంగిని దొడిగి, యూఁతకోలను హస్తమునంబట్టి, దానిని ముందు వెనుకల కాడించుచు, నిజజాయను డాసి పైకము నిమ్మని యడిగెను. అంత నాసాధ్వి, పెట్టెమూఁతఁ దీసి తన ప్రాణసమానముగ నెంచి దాఁచియుంచిన యైదు రూప్యముల నాతని జేతిలోఁబెట్టి "భద్రముగ నుంచు కొనుము; మోసపోకుము; తినఁబడు నన్నములోఁ

దక్కవచేసి సంతరించిన కాసులివి" అని, నాథుని హెచ్చరించి, చెంత నిలఁబడెను. సైమన్ పైకమును నిలువుటంగి జేబులోనుంచి, పైన, నిందుకదట్టి, యత్యంత సమ్మోదముతో బయలు దేఱెను. చేరువ నుండిన గ్రామమున కరిగి పైక మీయవలసిన పెద్ద మనుష్యుని యింటికేగెను. అతఁ డింట నుండఁడాయె. అతని యిల్లాలు, భర్తను వచ్చువారమునఁ దప్పక పైకముతోఁ బంపుదునని వాగ్దత్తము జేసెను. ఆవల సైమన్ ఇంకొక సంపన్నుని గృహమున కరిగెను. అతఁ డింట నుండెనుగాని చేతఁ బైకము లేదనెను. తన యుద్దేశమును సైమన్ అతని కెఱుకపఱచి, యప్పుగా నిలచియుండు కూలిడబ్బు నిచ్చివేసిన జాల దోడ్పడినట్లగునని సవినయముగ విన్నవించెను. అందుల కా గృహస్థుఁ డానపెట్టి లేదని నుడివి, యొకజత పాతఁత పాదరక్షలను సైమనున కిచ్చి దానిని బాగుచేసి తెమ్మని నడివెను. సైమన్ అందున కియ్యకొని యాతని యిల్లువదలి ముందునకు నడచెను. అనుకొనినట్లు ద్రవ్యము రానందున, సైమన్ చింతాకుల చిత్తుఁడై సంతన్నైపు మరలు చుండఁగా, నపరిచితుఁ డొకఁ డతనిచేఁ దన చెప్పులను సరిచేయించుకొని రెండణాల డబ్బు నతనికిఁ గూలిగా నొసంగి వెడలిపోయెను.

సైమన్ తనకుఁ బొసఁగిన దొసఁగునకు మిగుల వగచుచు సంతఁ జేరెను. మేష చర్మముల నమ్మె

తావునకుఁ జనెను. తనవలె నెందఱో యటఁ గొన వచ్చి యుండిరి. అత్యుత్కృష్టములైనవి మొదలుకొని సామాన్యములైనవి తుదిగాఁగల నిలువు టంగులమర్పఁబడి యుండెను. కొందఱు, మంచివే కొందమనిరి. మఱికొందఱు, ద్రవ్యాభావముచే సాధారణములైనవే చాలుననిరి. సైమనునకు, పాపము! నికృష్టమయినదయినఁ గొన వలను పడదాయె. అతఁ డత్యంత ఖిన్నుఁడై, తొక్కులాడుచు, నా వణిజుని మ్రోల నిలచి, “మహాస్వామీ! నాయొద్ద యర్ధ మూల్యము మాత్రమున్నది. దాని నిప్పుడు గైకొని, తక్కిన యర్ధ క్రయము నప్పుగా భావించి, నిలువుటంగి నిచ్చినఁ జాల కృతజ్ఞుఁడుగా నుండెదను. అప్పును దప్పక వచ్చువారమే యిచ్చివేయుదు” నని, వినయ పూర్వకముగ నడిగెను. అందుల కతఁడు పెడచెవిఁబెట్టి “అప్పుల నిచ్చుటయనిన నేమో నాకుఁ జాల బాగుగ దెలియును. ఇట్టి బేరములిందు బొసఁగవు. సంపూర్ణమూల్య ముండిన మాటలాడుము; లేనిచో వచ్చిన త్రోవఁబట్టి గిక్కురుమనక వెడలి పొమ్ము” అని గద్దించెను. తానిఁకఁ బీడించిన ఫలములేదని సైమను గ్రహించి, దొరకొనిన కార్యము కుంటువడెఁగదా యని మనంబున ఖేదిల్లి, వెనుకకు మఱలెను. రెండణాల కూలిపైకమును, జక్కజేయు నిమిత్తమై యీయఁబడిన యొకజత పాఁత పాదరక్షలుఁ దప్ప,

యాదిన మేసంపాదనయు లేకపోవుటచే 'గోరుచుట్టుపై రోకటిపోటు' అన్నట్లతనికి మఱింత మనోవేదన కలిగెను. ఇందునకుం దోడుగా నడచి నడచి మిక్కుటముగ నలసటయగుటచే నతఁడు నిట్టూర్పులు బుచ్చుచుఁ గష్టసాధ్యముతో నంజలు వేయుచుండెను. మనోవ్యాకులత నించుక వారింపనెంచి, యతఁడు సారాయియంగడి కరిగి, యాదినమున సంపాదించిన రెండణాల డబ్బును వెచ్చించి, త్రాగివైచెను. పదపడి, యతఁ డింటితోవఁ బట్టెను. సారాయి ప్రభావముచే నతని యొడలు వెచ్చగనయ్యెను. ఆదిన ప్రభాతంబునం దతఁడు చలితో గడగడ వడఁకుచుఁ దోవ నడచెను. ఇప్పుడన్ననో, యతనికిఁ గొత్త నిలువుటంగి లేకయే వెచ్చగ నుండెను. మంచు గడ్డలతో జిల్లుమనుచుండిన నామార్గమున, నతఁడు, చేతఁ బట్టిన యూఁతకోలను బలముగ నూదుచు, మఱొకచేత నుండిన జీర్ణపాదరక్షల నాడించుచు, నప్పుడప్పుడుఁ దీరని కైపుతోఁ దొట్రిల్లుచు, మార్గము నడచు చుండెను. అప్పుడాతని మనంబునఁ బరిపరి విధంబులైన భావంబులుద్భవిల్లి, యవి కంఠోద్గతము లాయెను. అవి కొంత వఱకీ తెఱగున నుండెను: "నాకు కావలసినది సారాయి. అది నా కబ్బినది. ఒడలియం దది ప్రవేశించి నాకు వలసిన వేడిమి నిచ్చినది. ఇఁక, నాకుఁ దోలు నిలువుటంగి యెందులకు? అది లేకపోయిన మానె.

దాని యుపయోగము నాకిప్పుడు తొలఁగి పోయెను. యావజ్జీవమును నేను దాని చింతయే యంటించు కొనను. అయిన నాభార్య, మార్త్రా, నిలువుటంగి తేలేదని చిడు ముడి పడును. ఏమి సిగ్గుమాలినతనము! నిర్నిమిత్తం బుగ నన్నది కసరును. ఇంటి కంతయు నేనే సంపాదించువాఁడనై దానిని దాని బిడ్డలను బోషించుచున్నాను. అట్టితఱి నన్నదిగాంచి మొగము చిట్లించుట యెట్టిపాడి? ..............ఆ! కొంచెమాగుము. 'నీవు పైకమును దేకపోయిన నీకుఁదగిన బుద్ధిని నేర్పుదు' ననును. అప్పు నీయవలసిన మహానుభావు లియ్యకబోయిన నేనేమి సేతు? రెండణాల సంపాద్యముతో నిలువుటంగిని గొనుటెట్లు? రెండణాలతో నేమి సేయనగును? త్రాగి వైచుటదప్ప"

అని యివ్విధంబున నాచర్మకారుండు తబ్బిబ్బైన పలుకుల నుడువుచు, గాళ్ళొకింత తడబడ, వంకరటింకరగా నడచుచుండెను. ఇట్లర్ధమార్గము గడచెను. అందొక దేవాలయం బుండెను. దాని కెదురుగఁ దిరుగుడు త్రోవయుండెను. ఇంచుక దూరమున నుండగనే, యతని కాదేవాలయము చెంత, నెద్దియో తెల్లగనుండున దొకటి దృగ్గోచరమయ్యెను. సంధ్యాకాలమగుటచేఁ జీకటు లప్పుడే క్రమ్ముచుండెను. ఆకతమున నా శ్వేతపదార్థ మతని కన్నులకు స్పష్టముగఁ గనుపింపలేదు. సైమన్ కన్నులు పులుముకొని, తేఱి

పాటుఁ జూచెను. "ఇచ్చట శ్వేతశిల యెద్దియును నుండలేదే!" అని యనుకొని మఱియొకసారి కన్నులు నులుముకొని దృష్టించిచూచెను. అది ఱాయి కాదని యతనికి బోధపడెను. "ఏదైన జంతువా?" యని శంకించెను. అయ్యది జంతువుగా నున్నట్లును నగుపడ లేదు. శిరస్సేమో మానవశిరస్సువలెనే కన్పట్టుచుండెను. సైమను యులికిపడెను. "ఇంతటి తెల్లని మనుష్యుఁ డిందెందుల కుండవలయును?" అని విస్మయ నిమగ్నుఁడై తన్నుఁ దాఁ బ్రశ్నించుకొనెను. అల్లనల్లన, నా యాకారమును డగ్గరించి, దానిచుట్టును జూచెను. మానవాకారంబొకటి విశదముగఁ బొలచెను. "సజీవుఁడో లేక నిర్జీవుఁడో?" అని తలపోసి, యరమరికతో దానిని దారొని పరీక్షింపఁగా నా మానిసి సంపూర్ణనగ్నుఁడై యుంట నెఱింగెను. ఈ వైపరీత్యమును గాంచి, సైమను మాఱ్పడిపోయెను. డిల్లుపడిన డెందముతో నాతని చేరువ నిలచెను. ఆవ్యక్తి యవనత పదనుఁడై దేవాలయ భిత్తి నానుకొని యొదిగి కూరుచుండి యుండెను.

---

*

## II

ఆకస్మికముగ నగుపడిన నీదారుణదృశ్యంబుఁ గాంచి, సైమన్ భయ విహ్వలుఁడై, యిట్లు యోచింప సాగెను: "ఎవ్వరో బందిపోండ్రు వీనియొద్ద నుండిన దంతయు దోచుకొని, మీఁదు, హతము గావించియో లేక నేలకు గోలకుఁదెచ్చియో యిం దిడిపోయి యుందురు. వీనిజోలి కేనిప్పుడు పోతినా నాయిడుములకుఁ గడయే యుండదు!" అని యనుకొని, యా భీకర దృశ్యమునుండి తన చూపును మరల్చుకొని, తొందరగా నంజలు వేయుచు వెడలిపోయెను. కొంత దవ్వరిగెను. తిరిగిచూచెను. ఆ యాకృతి చలించు చున్నట్లతని కంటఁబడెను. దిగులు నొకంతదారంగ, దాని చాయనే చూచుచు నిలువఁబడెను. అయ్యది యాతనినే పారిఁబారి దేరిచూచుచుండిన ట్లుండెను. సైమన్ రోమాంచితుఁడాయెను. గ్రుక్కునఁ దిరిగి త్రోవనడువ మొదలిడెను. ఇట్లింక కొంచెముదూరము నడచెను. ఏమి చోద్యమోకాని, యతఁడావ్యక్తి నుండి తెగింపుకొని పోఁజాలకుండెను. ఇనుము నయ స్కాంత మాకర్షించుపగిది, సైమన్ మనంబు నా నూతన వ్యక్తి యీడ్చుచుండెను. అంత, సైమన్ ఇత్తెరంగున చింతింపసాగెను. "వాని నొకింత పలుకరింతునా? లేక నాత్రోవఁబట్టి వెడలిపోదునా? వాఁడు నన్నేమి

చేయును ? ఎవ్వఁడో, యేమో ! ఎందుల కచ్చటఁ గూరుచుండి యున్నాఁడో ? ఏమైనను గానిమ్ము; వాఁడందు నిర్వ్యాజముగ గూర్చుండియుండుట న్యాగుపడదు !! సమీపమున కేగినవెంటనే, నామీఁదికతనికి నన్నుఁ గడముట్టించిన నేనేమిసేతు ! వాఁడొకవేళ తోవదోపరికాఁడో యారకూళ్ళ యాగచాట్లబో తనుకొందము. అప్పటికిని వానినుండి నాకు బాధతప్పదు. దిగంబరుఁడై యున్నాఁడు !!! నేను ధరించియుండు నీ చింపి బట్టలను వానికీయవలసి వచ్చును. అయ్యో ! దేవుఁడా, నాకెట్టి ధర్మసంకటమును దెచ్చిపెట్టితివి" అని విచారించుచు, సరగు సరగున, నింకొకింతదూరము పోయెను. అంతలో, నాతని యంతరాత్మ మేల్కాంచినట్లు యతనికి త్తెరంగున నుద్బోధింప సాగెను. "స్వైరా, నీవేమి చేయుచున్నావు ? నీ కీ చిత్తచాంచల్య మెందులకు ? ఎవ్వఁడో యభాగ్యుండొకఁ డిడుములకుఁ జిక్కి తహ తహ పడుచుండగా నీవు వానినిజూచి భీతిఁజెంద చూచి యుఁ జూడనట్లు నటించి పరుగిడు చున్నావే ? ఇది నీకుఁ దగునా ? నీవు చాల ధనికుఁడవై పోయితివా ? నీ ధనమునంతయు నా దౌర్భాగ్యుం డపహరించునని నీకు దిగులా ? సత్పురుషు లెప్పుడును బరుల కష్టంబుఁజూచి సహింపరు. వ్యసనార్తున కీవు సాయమొనరింపఁ బ్రాలుమాలి, పనికిరాని పిఱికెదనమును వహించి యీ రీతిఁ

బారిపోవు చుండుట నీబోటి యుచితజ్ఞులకుఁ జనునే ?"

సైమను మది తెలివొందెను. వెనుకంజ వేసెను. తిన్నగ దేవళమును సమీపించి, ధైర్య మవలంబించి, యా వ్యక్తిని దప్పకఁ జూచెను. అతఁడు యౌవనుఁడై దృఢకాయుఁడై యుంట యెఱుకపడెను. చలికి బిఱ్ఱ బిగిసికొని పోయినట్లును, జాల భీతిలినట్లును, గనుపించెను. ఆ విలక్షణవ్యక్తి, సైమనును గన్నులతోఁ జూడనైన చూడక, మోమువంచుకొని, కదలక, యొదిగి కూరుచుండి యుండెను. తలనెత్తి చూచుటకు సహితమాతనికి శక్తిలేదేమో యనునట్లుండెను. అంతలో నతఁడబ్బుర పాటున నిద్రనుండి మేల్కొనినట్లు, శిరము నొకింతయెత్తి తన విశాల నేత్రములతో సైమన్నును వీక్షించెను ఆ చూపు నుండియే సైమన్నన కాతనిపై ననురాగ ముద్భవించెను. మాటలలో మసలినఁ బ్రమాద మొకవునని యెంచి, చేతిలో నుండిన పాత్ర పాదుకలను జివ్వున నేలఁ బడవైచి, యూఁతకఱ్ఱను గోడకానించి, తన చినిగిన నిలువుటంగిని తీసి "దీనిని తొడుగుకొనుము" అని నుడివి యాతని కందిచ్చెను. అయిన, నతఁడా యంగరకమును ధరింపనొల్లన ట్లగుపడుచు, మౌనముద్రదాల్చి కూర్చుండి యుండెను. కడు దూపటిల్లుటచే నిలఁబడుట కాతనికి త్రాణ లేదేమోయని భావించి, సైమను కేలూత

యొసంగి యతనిని నిలువఁ బెట్టెను. మేనిపై నెందైనను గాయము లున్నవేమోయని యనుమానించి నఖశిఖ పర్యంత మాతనిఁ బరిశీలించెను. అయిన నెందును గాయము లగుపడలేదు. అనూనమైన యాతని దేహమును గాంచి, సైమన్ యచ్చెరు వొందెను. తళతళ మని మెఱయుచున్న మేను; సౌష్ఠవములైన యవయవములు; వింత తియ్యముతోఁగూడి మన మోహనమై యొప్పుచున్న నెమ్మొగము; ఇవన్నియు నతనిని జూపఱకుఁ బ్రేమపాత్రునిఁగా నొనరించుచుండెను. సైమన్ ఆతని చేతులను చొక్కా చేతులలో దూర్ప యత్నించెను గాని, యాచర్య కతఁ డపరిచితుఁడుగ నుండు నట్లగుపడెను. సైమన్ ఆశ్చర్యచకితుఁడాయెను. అంగకరము నాతనికిఁ బరివేష్టించి, దారముతో బిగించెను. తాఁ దెచ్చియుండిన జీర్ణపాదుకల నాతనికిఁ దొడిగించి, తనటోపీ నాతని శిరముపై నుంచెను. సైమన్ ఖల్వాటుఁడు. కాన, నతని తల కత్యంతముగ చలియయ్యెను. మగుడఁ డోపీని దీసి తన పట్టతలపై నుంచుకొని, "వీని తలలోఁ గురు లతిసాంద్రముగ నున్నవి; అందుచే నితని కంతగా చలి కాదు" అని మనస్సమాధాన మొనరించుకొని అతనిని తనవెంబడి గొంపోవ నిశ్చయించుకొనెను. నూతనవ్యక్తిని సంబోధించి, "సహోదరా! మానవ జీవితము దంతురితయుతము సుమా! మనకు

మూఁడెడి యిడుములు మన యధీనమునందు లేవు. 'దైవాధీనం జగత్సర్వం' అని కదా కోవిదుల నుడి. నీవు వ్యాకులత నొందకుము. నా వెంటరమ్ము." అని వక్కాణించి "నీవు నడవఁగలవా ?" అని యడిగెను. అందులకతఁడు, బదులిడమి సైమన్ వేడబంబుతో మఱియొకసారి యడిగెను. దానికతఁడు కృతజ్ఞతా సూచకంబులైన దృష్టులతో సైమన్నును దిలకించెను. అంత, సైమన్ "అహో ! ఏల మాటలాడవు ? ఈ చలికాలమంతయు, నిందే గడపనెంచితివా, యేమి ? జాగరూకుఁడవుగమ్ము. నడచుటకు శక్తిలేనిచో, నీకఱ్ఱనూఁతగాఁ గొని నడువుము." అని వాకుచ్చి, తనచేతికఱ్ఱ నాతని కొసంగెను. దాని నతఁడాదరువుగాఁ గొని, వణఁకు దేహంబుతో సైమన్నును వెన్నాడెను. మార్గము నడచుచుండునపుడు వారిరువురికిని నీ దిగువనుండు సంభాషణ జరిగెను.

సైమన్:—నీవేప్రాంతము వాఁడవు ?

నూతనవ్యక్తి:—నే నీవైపువాఁడనుగాను.

సైమన్:—ఔను, నీవు పరదేశము వాఁడవని నాకును దెలియును. ఈ చుట్టుపట్ల నుండువారిలో నాకపరిచితు లెవ్వరును లేరు. నీ విందెట్లు రాఁ గలిగితివి—దేవాలయము చెంతకు ?

నూతనవ్యక్తి:—నేఁ జెప్పలేను.

సైమన్:—ఎవ్వరో, పాపాత్ములు నీకీ యపచార మొన రించి యుందురు.

నూతనవ్యక్తి:—నా కెవ్వరును నపచార మొనరింపలేదు గాని దేవుఁడు నన్ను శిక్షించెను.

సైమన్:—నీ మాట ముమ్మాటికిని నిజము. మన మందఱము దైవాజ్ఞను లోఁబడిన వారము. పుట్టిన మీఁదట నట్లనను మన వలయును గదా! నీ వెం దరుగవలయు ?

నూతనవ్యక్తి:—నా కంతయు నొకటే.

ఈ ప్రత్యుత్తరముల ఫక్కిఁ గాంచి సైమ న్నరుదందెను. అతని కీ విచిత్రవ్యక్తి దుండగీఁడుగా నగుపడలేదు గాని స్వకీయ సమాచారములను గుఱించి మాత్రము నోరు విడువఁడని వ్యక్తమయ్యెను. చాల మృదుభాషి. సౌమ్యకళ మోమున దొలుకాడుచుండెను. సైమన్నన కతని నడవడి సరిగ బోధపడమి "ఉందేమో నాకేమి తెలియును నీ విషయములు" అని యనుకొని తన సంగడికాని వైపుఁదిరిగి "మంచిది మిత్రమా యిష్టముండి నచో నాయింటికి రమ్ము. ఇంచుక చలి కాచుకొని విశ్రమించుకొందువుగాక" అని పలికెను. నూతనవ్యక్తి

యూర కాతని పక్కనే నడచు చుండెను. చలిగాడ్పు కటకి "భోరు"మని వీచెను. సైమన్ ఒడలు పులకరించెను. ధరించి యుండిన మాత్రా యంగి నతఁడు చక్కఁగ సవరించుకొని కప్పుకొనెను. నడచి నడచి వేసరియుండుటచే దీర్ఘ నిశ్వాసములను విడచుచు, నివ్విధంబున దలపోయ సాగెను. "నేఁడు నేను మంచి యంగినే సంపాదించితిని! క్రొత్త యంగీ నలవరించుటకు మాఱుగా మున్నుండిన పాఁత దానిని సయితము పోనాడితిని!! తోడుగా నగ్న పరదేశీ యొకఁడు!!! మాత్రా నాచర్యను గాంచి యెంత కోరియపడునో!"

మాత్రాను దలంచుకొను కొలఁదిని, యాతని గుండె దడగొట్టుచుండెను. అయిన, వెంటనుండిన నూతనవ్యక్తి మొగంబును దిలకించు కొలఁదిని, ముఖ్యముగ నాతఁడు దేవళమునొద్ద పరిసరింపఁజేసిన దీర్ఘ వీక్షణము నుగ్గడించుకొను కొలఁదిని, నతని యంతరాత్మ యానందపరవశమై నృత్యమొనరించు చుండెను.

## III

ఆనాఁడు సైమన్ సతి సత్వరముగనే గృహకృత్యములను ముగించుకొని, ధవుని రాకకై యత్యౌత్సుక్యముతో నెదురు చూచుచుండెను. వంటకమునకు వల

సిన వంటచెఱకులను జీల్చి సిద్ధపఱచెను. నీళ్ళను మోసికొనివచ్చి, పాత్రలయందు నింపెను. వంటక మంతయు వండి, పసి బిడ్డల కన్నముబెట్టి వారిని నిదురపోనిచ్చెను. రొట్టెలను జేయలేదు. పిండి చాల స్వల్పముగా నుండినందున, నాఁడే దానినంతయు నుపయోగించినచో మరునాటి భుక్తికభావము గలుగును కదా, యని యోచించెను. కొంతసే పేమియుఁ దోచక యూరకుండి యావల నాపిండిని మఱునాటి కుంచుటయే లెస్స, యని నిర్ధరించుకొనెను. "నేను వంటకము నేమో సిద్ధపఱచితిని, అయిన, నా వల్లభుఁడు పల్లెలో నెవరింటనయిన నాతిథ్యమందిన నేవండిన వంటక మంతయు వ్యర్థమయిపోవునేమో," అని యనుకొనుచు, చినిగిన చొక్కా నొకటినిఁ గైకొని, దానిని గుట్టుచు బల్లయొద్దఁ గూరుచుండియుండెను. కుట్టునపు డామె మనంబున నేవేవో యోచనలు పుట్టి పొరలుచుండెను. "నా ప్రియుండమాయకుఁడు. శెల్లనిదంతయు పాలని నమ్మును. అంగడివా రెవ్వరైన మోసబుచ్చిన నేమిగతి ! వయస్సు చెల్లినవాఁడైనను, యతని మనస్సు పసిబిడ్డమనస్సే !! పదియూపాయల కుత్కృష్టమైన నిలువు టంగి రాకపోయినను, సామాన్యమైనదానినైనఁ గొన వచ్చును. కడచినయేడు చలికాలమునం దేను చాల కష్టపడితిని. నది కరిగి నీళ్ళు తెచ్చుటకుఁ గూడ

వలను పడకుండెను. ఉండిన నిలువుటంగి యొకటి, వారు ధరించిన నాకు లేదు; నేను తొడిగిన వారికి లేదు. అది యెట్లో కష్టసాధ్యముతో సర్దుకొనుచుంటిమి. ఈసారి యాకష్టము తీరినది. ప్రారంభించిన కార్యము నిరాటంకముగ నెరవేరునుగదా! నాప్రాణేశుఁడేలాకో యింకను రాలేదే!! చాల ప్రొద్దయినట్లున్నది. త్రోవలో నించుక సారాయినేమైనఁ జవిఁజూచిరేమో, నాప్రాణాధికులు!!!" ఈసరణిఁ దలపోయుచు, నాగృహిణి కుట్టుపనిని సాగించుచుండెను. అంతలో, వీథివాకిటఁ గాలిచప్పుడు వినవచ్చెను. ఎవ్వరో తలుపు తెఱచినట్లాయె. మాత్రా, కుట్టుపని నట్లే నిలిపి, సూదిని బట్టలోనే చెక్కి, దిగ్గున లేచి వీథిగుమ్మముకడ కేతెంచెను. ఒక నూతనవ్యక్తియుతుఁడై, నిజభర్త గృహమును బ్రవేశించుటఁ గాంచెను. ఆవ్యక్తి, శూన్యశిరస్సుతోను, జీర్ణపాదుకలతోను నుండుటఁజూచి, యచ్చెరువొంది, యతఁడొక దిక్కుదిన గుంపుగొయ్య కాఁడా యని యూహలుసేయ మొదలిడెను. సైమన్ విషయమై తాఁబడిన యనుమానము ధృవపడెనని దిగులొంది, జేవురించి, పెనిమిటిమ్రోల నిలచి, వాసన పట్టెను. అతని యూర్పులలో, సారాయివాసన వచ్చుచుండుట గనిపెట్టెను. ఇందులకుందోడతఁ డతిమానుఁడై, యఱగన్ను వెట్టి దేబచూపులతో దిక్కు

లను జూచుచుండుటయు, తనదృష్టుల నెదుర్కొనుటకు ధైర్యములేనివానివలె వర్తించుటయు, నాయమ యెఱింగి, తలమీఁద మిన్నొరిగిన దానివలె నత్యంత ఖిన్నురాలాయెను. "అయ్యో! రానున్న యనర్థంబులు మునుమున్నె మనంబునకుఁదట్టి భయబీజము లుప్పతిల్లఁజేయునను లోకోక్తి, నేఁడు నిక్కువంబయ్యె! డబ్బంతయు దుర్వ్యయముచేసి త్రాగివైచినాఁడు. ఒకటే నిలువుటంగి యుండినది! అదియును, చినిగి ఛిద్రమైయుండెను!! దానిని సహిత మెవ్వానికో దాన మొనరించివైచినాఁడు!!! లోనధరించి యుండిన నాయొంటొల్లె మాత్రము శేషించియున్నది. వెంబడినుండు సంగడితో, నింతవఱకుఁ జెల్లాటము లాడుచుండెను కాంబోలు!!!" అని గొణుగుకొని, రోష మిగురొత్తఁ జూచుచు, నిలఁబడెను. ఆవల సైమన్ తన యనుచరునితో గదిలోనికరిగి టోపీని దీసి బటకొయ్యకుఁ దగిలించి, భార్యకనఁబఱచిన సంరంభమును జూడనట్లు నటించి, బల్లపలకపైఁ గూరుచుండెను. మాత్రా వారిని వెంబడించి, నిలచి, చూచు చుండెను. నూతనవ్యక్తి నిశ్చేష్టితుఁడై శిరమును వంచి నిలిచియుండుట గాంచి, యతఁడొక కుజనుఁడని తలంచెను. ఇంతియగాక యతఁడు పెచ్చుగ దిగులొందినట్లు తోప తప్పక వాఁడొక చాటుమాటు వ్యక్తియేయని నిశ్చయించెను. అంత నాయింతి యత్యం

తంబుగఁ గనలి కషాయ నేత్రయై, "వివేక శూన్యులకు బుద్ధిసెప్పుట బూడిదలో హోమము జేసినట్లే"యని గొణుగుచు, వంటయింటికరిగి యందున్నరనుచు నిలువఁ బడెను. సైమన్ తన సంగడికాని సంబోధించి "సహోదరా! రమ్ము కూరుచుండుము" అనిచెప్పి సాదరముగ నతనిఁ దనప్రక్కఁ గూరుచుండఁ బెట్టుకొని, మార్తా చర్యలవలన నామెకుఁ గోపము వచ్చినదని గ్రహించియు శుష్కహాసితంబు వహించి, "మార్తా, వంటకేమియు వండి యున్నావు? మా కిద్దఱకును వడ్డించెదవా?" అనియడిగెను. మార్తా యొడ లంతయు భగ్గుమని మండిన ట్లయ్యెను. గొబ్బున బయటికివచ్చి, లొటపిట గొట్టుచు, శిరమునల్లార్చుచు, భర్త నొకమాఱును నూతనవ్యక్తి నొక తూరియు జుఱచుఱఁ జూచుచు నిలఁబడెను. మగుడ సైమన్ భార్య నుద్దేశించి, "ఏమి? ఏమియును వండలేదా?" అని యడిగెను. మార్తా కోప మగ్గలమయ్యెను. అంతనామె తెగువ వహించి, ముఖము చిట్లించి, "అవును, నేను వండి తినిగాని నీకు కాదు నేను వండినది. సైమన్ నీవు సారాయి త్రాగి యొడలెరుంగవు గాఁబోలు! క్రొత్త నిలువుటంగిని కొనఁబోయి ప్రాఁతదానిని సయితము పోగొట్టుకొని వచ్చిన మహా మేధావి కావా నీవు! పైగా కట్టుబట్టలేని శుష్క దరిద్రుని, దిక్కుమాలిన పక్షిని దోడనిడుకొని వచ్చినావు .నీవంటి త్రాగుబోఁతులకును,

నిన్ను వెంబడించివచ్చు దిగంబర దేశ దిమ్మరులకును నిం దశనము లేదు" అని నుడివెను. సైమన్ స్వాభావికముగ నోర్పుగలవాఁడు. అయిన నీమాట లతనికిని యలుకఁ గలిగించెను. "మార్తా, ఇఁక నోరు మూయుము. అవశ్యమై యేల యిత్తెరంగున వదురుచున్నావు! నన్ను వెంబడించి వచ్చియుండు పురుషుఁడెట్టివాఁడో యరయక, ఇట్లు నోటికి వచ్చినట్లు నుడువంగ దరమే?" అనుడు మార్తా మఱింత మండిపడి, "పైకమునంతయు నేమి చేసితివి? చూపుము" అని యడిగెను. అందుల కతఁడు తాఁదొడిగియుండిన యంగి జేబిలో వెదకి చూచెను. అందది యుండలేదు. ఉత్తర క్షణముననే తన చలికానికిఁ జుట్టియుండిన నిలువుటంగి జేబిలో వెదకెను. అందది భద్రముగ నుంచిన దుంచినట్లే యుండెను. దానిని వేగిరతీసి, బల్లపై నుంచి, భార్యతో నతడిట్లనెను. "మార్తా ఇదిగో నీవిచ్చిన పైకము. 'ట్రావిస్కి'గాని 'శ్రివినాఫ్'గాని నాకీయవలసిన ద్రవ్యము నియ్యరైరి. సంపూర్ణ మౌల్యము సంచితముగాకపోవుటచే నిలువుటంగిని గొన వలను పడదాయె." ఈ మాటలు మార్తా వినులలో దూరలేదు. బల్లపై నుండిన డబ్బును గొబ్బున గైకొని "నీకును, నీ వెంటనుండు వ్యర్థ జీవులకును నా యింట నన్నములేదు" అని హద్దుమీఱి నుడివి, తోకఁ ద్రొక్కిన త్రాచుచందంబున రోజుచు నిలువఁబడెను.

నిజస్థితి నెఱింగించిన గోప ముపశమించునని యెంచి, సైమను భార్యతో "మాత్రా, నేఁజెప్పున దించుక సావధాన మనస్కురాలై వినుము. ఈ దిన సంపాద్యంబైన రెండణాల ముత్తమును మాత్రము పానీయమునకై వెచ్చించితిని. నిక్కువం బెఱుంగక నీవిట్లు వెడపలుంలాడుట సంగతియే?" నా నామచ్చకంటె మఱింత కుపితయై "అవక తవక మాటలచే నే మోసపోను. కల్లు ముంతలో నెందైన పాలుండునా? త్రాగుబోతుల నుండి సత్య సౌజన్యములు వెలువడునా? నిన్నిందులకే కదా నేను మొదటనే పెండ్లాడ నొల్లనంటిని. నాకు యార్జాలుగా నియ్యఁబడిన గుంజాకోకల నన్నియు నీవే పాడుచేసి త్రాగి వైచితివి. నేఁడు క్రొత్త యంగిని తేఁబోయి పాత్రదానిని సయితము పోఁగొట్టుకొని, మీఁదు చెడత్రాగి, చాలనిదానికి నొక దేశదిమ్మరిని వెంట నంటించుకొని యింటికి వచ్చినావు! నీ నుండి తలవంపులు దప్ప మఱేమియును లేదు" అని పరిపరివిధములఁ గేరడమాడి, పదియేండ్ల యనుభవముల నన్నియును నన్యాపదేశముగ స్మరణకుఁ దెచ్చుకొని, భర్త మీఁద వ్రేగులను శరపరంపరలవలెఁ బ్రయోగించెను. ఉత్త మాటలతోఁ దృప్తినొందక యా గృహిణి నిజనాథుని చేయిపట్టి యీడ్చుచు, "నా యంగి నిచ్చివేయుము. అది యొకటే నాకుండునది! నేనెట్లుపాడై పోయిననీకేమి

నీవు వెచ్చగ నుండినజాలును కాఁబోలు ! భార్యాబిడ్డలచింత నీకేందుకు ? ఇంతటిస్వార్థపరమైన కుక్కజన్మ ముండినను నొకటేపోయినను నొకటే !! నిన్ను దయ్యముపట్టని !!!" అని పెనిమిటిని దిట్టఁగా, నతఁ డత్యంత సంతప్త మానసుండై యిట్లనెను: "మార్తా, గొడ్డలిచే నఱుకఁబడిన చెట్టు మఱల చిగురించునుగాని, మాటలచే విరిగిన మనస్సు మగుడ తిన్నఁబడ నేరదు. అవాచకముల నాడి యేల పాపము నొడిగట్టు కొనెదవు ?" ఈ బుద్ధివాదము లామె చెవిలో దూరలేదు. తన యంగిని సైమన్ విప్పియిచ్చునంతలో దానినామె గుంజెను. మొదలే జీర్ణావస్థలో నుండిన నాయంగి యీ యిగ్గులాటలోఁ బూర్తిగఁ జినిగి పోయెను. మార్తా దానిని గైకొని తలమీఁద వేసికొని, వేదురెత్తిన రీతిని వీధివాకిటవైపు బరుగిడెను. నాఁ డామె, పతిని బతిగృహమును బరిత్యజింప నెంచెనుగాని, యేకారణము చేతనో యించుక యాగెను. గృహ పరిత్యాగ విషయమై బహుశః యామె మనస్సు కుదురుబాటునకు వచ్చియుండ లేదేమో ! అయిన, తన మగనిపై నుండిన కాంతాళమును మాత్రము దీర్చుకొనవలయునని నిశ్చయించి యుండెను కాఁబోలు !! అందుల కామెకు సందు దొరకఁగా నాకార్యము నకుంఠితముగ నొనరించివైచను. ఇంటి కేతెంచియుండు కొత్తమానిసి యెవ్వఁడో, యెట్టి

వాఁడో, తెలిసికొనఁ గుతూహలాయత్త చిత్తయై యుండి నట్లామె కనుపించుచుండెను.

---

## IV

వీథివాకిట నాకస్మికముగా నిలచిపోయిన నాయిల్లాలు, ముందుఁబోవనొల్లక, తెల్లబోయిన మొగముతో నల్లన మఱలివచ్చి, ధవుని యెదుట నిలచెను. అంత నాదంపతు లిత్తెఱంగున ముచ్చటింపసాగిరి.

మాత్రా:—వాఁడొక వేళ కుత్సితుఁడు గానిచోఁ గాచ యయిన ధరింపక కూరుచుండియుండునా? కట్టుగుడ్డకు సయితము గతిలేనివాఁడు! ఏనేరమును నతఁడొనరింపకుండ నుండినచో, నీకీదాపరికం బేల? ఇందునిబోలు నీయొంద కాఁడెందు వోఁటి కెనో, నీవెందులకు నాకుఁ జెప్పకుంకువు?

సైమన్:—ఇంతవఱకు నే నిదియే నీకు విశదీకరింప యత్నించుచుంటిని. నీ వందుల కాస్పదమియ్య వైతివి. చెప్పెదవినుము. దేవాలయమును సమీపించితిని. పొద్దు దాదాపరసంజ్ఞయై యుండెను. తిరుగుదారియొద్ద వివస్త్రుఁడై యితఁడు కూరుచుండి యుండెను. నిర్మానుష్యముగ

నుండెను. చలికి నీల్గుకొనిపోయి సంకటపడు చుండెను. ఇదేమి యెండకాలమా? దేవుఁడు నన్నచ్చోటికిఁ గొంపోకయుండినచో, నీయభాగ్యుఁడు తప్పక మృత్యువువాతఁ బడియుండును. అట్టిపరిస్థితిలో నేనాతని వదలివచ్చుట తరమా? ఆపదలో నుండినవానిని నుపేక్షింతునా? లేక రక్షింతునా? నాకర్తవ్యంబేమి? అయ్యెడ నామనస్సు కరగిపోగాఁ జనిగిన నిలువుటంగిని నాతని చుట్టుఁజుట్టి యింటికిఁ దోడ్కొని వచ్చితిని. మార్తా, నీలో దయలేదా? నీకీ దురాగ్రహమేల? మానవదేహం బశాశ్వతంబని యెఱుంగవా? లోకంబున సాధునిందకంటె సాధుహింసకంటె వేరొండు పాపంబు గలదే?

మార్తా మఱలఁ బరుషోక్తుల నాడనెంచెనుగాని యయ్యవి నాలుక తుదకు వచ్చునప్పటికే, యామె వీక్షణము లావిలక్షణ వ్యక్తిపైఁబోగా నోటమాట వెలువడదాయె. ఒక వర్ణనాతీతమైన భావసంచలనము గలిగినదై యామె హృదయపరివర్తన మొందెను. నాతనవ్యక్తి నిమీలిత నేత్రుఁడై, వినమితవదనుఁడై, నిశ్చేష్టితుఁడై, యొకప్రక్క గూర్చుచుండి యుండెను. ఒకొకప్పు డతఁడు తన కన్నులను గిరుపుచు, నిజహృద

యంబున నేవో కొన్ని భావము లుద్భవించినట్లు సూచించుచుండెను. మార్తా, యాతనినే దయాతుం దిలయై చూచుచుండెను. సైమన్, యిదియే యదనని గ్రహించి, యామె మనంబున దేవుని జ్ఞప్తిసేయునెంచి, "మార్తా నీలో దేవుఁడు లేఁడా!" అని యడిగెను. ఈ మాటలు సైమన్ సహధర్మిణి హృదయంబున గాఢముగఁ జొచ్చెను. బిరబిర వంటయింటికరిగి, పిండిని కలిపి రొట్టెలనుజేసెను. వానిని దట్టలలోనుంచి, పానీయంబులతోఁదెచ్చి బల్లపైనుంచి, యిర్వురను భుజింపుఁడని వేడెను. సైమన్ నెయ్యుని దగ్గరకీడ్చుకొని, "యువకుఁడా, రమ్ము భుజింపుము. నీవు క్షుధాతురుండై పరితపించుచున్నావని నీముఖమే చెప్పక చెప్పుచున్నది" అని నుడివి యతిథి యారగింపఁ బ్రారంభించిన వెంటనే, తానును గుడువమొదలిడెను. పిదప సైమన్ వినోదార్థముగా నూతనాగంతుకునితో "సంగడీఁడా! ఇనుముతోఁగూడిన యగ్గివేల్పునకు సమ్మెట పెట్టుబ్బినట్లు, నన్నుఁగూడిన నీకు గురుతరమైన పెట్టే నేఁడు పడెఁగదా!" అని యాతని మోమును దిలకించుచు నొక చిఱునవ్వునవ్వెను. అతిథి మారుమాటాడలేదు. వారు భోనము నారగించునంతసేపును మార్తా మహాతల్లి యొకప్రక్క నిలచి వారి ముఖభావములనే పరిశీలించుచుండెను. ఆమె కానూతన వ్యక్తిపైఁ గనికర

మతిశయించెను. చూచుచుండినట్లే యాతనిముఖమున మందహాసము చెంగలించినట్లయ్యెను. హఠాత్తుగ గదియంతయు వెలుగాయెను. అతిథి మోమునుండి జ్యోతియొకటి యావిర్భవించుచున్నట్లుండెను. అతఁడు మార్టానె పుదరిగి, అనిమేషుఁడై కించిత్కాలము వీక్షించెను. ఉత్తరక్షణముననే జ్యోతి యదృశ్యమై యుండుటయు, అతఁడు మునుపటియట్లు భోజనము నారగించుచుండుటయు గోచరమయ్యెను. వారిభోజనము ముగిసినపిదప మార్టా పాత్రల నన్నింటిని దీసి తొరంబుగఁ గడిగి, యాచోటును శుభ్రపఱచి, యావల శేషాన్నమును భుజించెను. ఆగంతుకుని గుఱించిన సంగతుల నామె తెలియఁగోరి, యాతని నిత్తెఱంగున బ్రశ్నింప మొదలిడెను:

మార్టా:—నీ వేవైపు వాఁడవు ?

నూతనవ్యక్తి:—నే నీవైపువాఁడనుగాను.

మార్టా:—దేవళము చెంత కెట్లు రాఁగలిగితివి ?

నూతనవ్యక్తి:—నేఁ జెప్పలేను.

మార్టా:—ధూర్తులెవ్వరైన నీయొద్ద నుండిన దంతయు దోఁచుకొని పోయిరా ?

నూతనవ్యక్తి:—దేవుఁడు నన్ను శిక్షించెను.

మార్టా:—నీ వందు వివస్త్రుఁడవై పడియుంటివా ?

నూతనవ్యక్తి:—అవు నమ్మా, చలికి నా యంగము లన్నియుఁ గట్టెవారి యుండెను. నా దీనస్థితిని నైమఱఁగాంచి, జాలిచెంది, తాఁదొడిగి యుండిన నిలువుటంగిని నాచుట్టుఁజుట్టి యిందు దోడ్కొని వచ్చెను. పరిపరిధమమున నీవించుక చవికాని మాటల నాడినను, తుదను దయార్ద్రహృదయవై నా కన్నపానంబుల నిడితివి. ఈ సుకృతమునకు నీకుఁ బరమేశ్వరుఁడు మంగళ మొనరించుఁగాత.

మార్తా కాతనిపై ననురాగ మగ్గల మయ్యెను. లోనికరిగి యెల్లిప్రొద్దున తాను సరిచేసి కట్టియుంచి యుండిన మగని జుబ్బాను తెచ్చి, యాతని కొసంగి, ధరింపు మనెను. ఒక జత చల్లడములను సయిత మాతనికిఁ దెచ్చియిచ్చి "కట్టు బట్టలేక నీవెట్లు బ్రతుకఁ గలవు? ఇదేమి యెండకాలమా? వీనిని ధరించి కుంపటి ప్రక్కఁ గాని, పైన మంచెమీఁద నుండు గదిలోఁగాని వెచ్చగఁ బరుండి నిదురింపుము" అని సాదరముగఁ బలికెను. ఆపై నతిథి చల్లడమును దొడిగి నిలువుటంగిని మార్తాకు వెనుక కిచ్చివేసెను. పదపడి జుబ్బాను ధరించి, మిద్దె మీఁది కరిగి, యరలోఁ బరుండి నిదురబోయెను.

నిలువుటంగిని గైకొని వచ్చిన మార్తా, ధవుని యొద్దకువచ్చి, దాని నతనికొసంగి కప్పుకొమ్మని చెప్పి,

యాతనికిఁ బాన్పు సిద్ధపఱచెను. తాను సెజ్జనుజేరి పరుండెను. ఆమెకు నిదుర పట్టలేదు. ఆమె మనస్సంతయు నా నూతన వ్యక్తిలో లీనమై యుండెను. మఱునాటి కుంచఁబడిన పిండినంతయు నుపయోగించి యాతిథ్య మొనరించి నందులకై యామె మనంబున నలజడి కలిగెను. ఇంటనుండిన నొకటి రెండు చింపి గుడ్డలనుగూడ దాన మొనరించి నందులకై మిగుల వగచెను. అయిన, నాయతిథి ప్రదర్శించిన స్మితవదనమును స్మరించుకొను కొలఁదిని యామె యలజడి యంతయు పటాపంచలై చెదరిపోవు చుండుటయేగాక యామె యంతరాత్మ యానంద పరవశమగుచు నృత్య మొనరించు చుండెను. సైమనునకును నిదురపట్ట లేదని మార్తా తెలిసికొని యతనిని బిలచెను! అంత వారీ తెఱంగున సంభాషింప సాగిరి.

సైమన్:—ఏమి, మార్తా?

మార్తా:—రేపటికి భుక్తికి లేదు. ఉండిన దంతయు వండి వేసితిని. తెల్లవారి కిరుగమ్మ పొరుగమ్మల నడిగి యప్పుగాఁ గొంత పిండిని దేవలయును.

సైమన్:—ఎట్లో దినములు సాగిపోవును. ప్రాణములుండు వఱకు జీవనోపాయమును వెదకు చుండ వలయును గదా!

మార్తా:—(ఇంచుక నే పాలోచించు చుండి) మనయతిథి గుణవంతునివలె నే కన్పట్టు చున్నాఁడు. అయిన, స్వకీయ సమాచారములను గుఱించి యించు కేని యు నోరు విడువఁడు. ఎందులకింత గుట్టు?

సైమన్:—అతఁ డేమియును జెప్పఁ జాలఁ డేమో!

మార్తా:—సైమన్

సైమన్:—ఏమి?

మార్తా:—మన మేమో పర పర వారలకెల్ల 'పరోపకారార్థ మిదం శరీరం' అని సతతముఁ దేనువలేకఁ దోడ్పడు చున్నామే; మనకేల యెవ్వరును సాయపడరు?

సైమన్:—మార్తా నీ కింత చింత యేల? పుట్టించిన దేవుఁ డన్నమిడఁడా? ఇఁక నిదురఁ బొమ్ము చాల పొద్దయినది.

ఆవల సైమన్ మాటలను జాలించి శీఘ్రముననే నిదురవోయెను. మార్తాకూడ నిశ్చింతగా శయనించెను.

## V

ప్రభాత మాయెను. సైమన్ మాత్రా దంపతులు మేల్కొనిరి. బిడ్డలింకను గాఢనిద్రలో నుండిరి. మాత్రా యిరుగింట "యెమిలియా" యొద్దకరిగి పావు సేరు పిండి నెరువుగాఁ దెచ్చి పచనకార్యము నారంభించెను. నూతనాగంతుకుఁడు వేకువనేలేచి మైవిదిర్చి, తిన్నగా నదియొద్ద కరిగి ప్రాతఃకాల కృత్యములను ముగించుకొని వచ్చి బల్లపలకపై నూరక కూరుచుండి యుండెను. మున్నతని మోము కాంతిహీనమై రాహుగ్రస్తమైన చంద్రబింబము పగిది యుండెను. ఇప్పు డయ్యది దివ్య వర్చస్సుతో నలరారుచుండెను. సైమ నాతని సమీపించి, ప్రక్కనఁ గూరుచుండి, యిట్లు ముచ్చటింప సాగెను.

సైమన్:—సహోదరా! కడు పన్నమును, నొడలు గుడ్డయును నడుగునుకదా. ఏ తన్నిమిత్తము మానవుఁడు కష్టించి పని చేయవలయును. నీ వేపని చేయఁగలవు?

నూతనవ్యక్తి:—నాకేమియును దెలియదు.

సైమన్:—మంచిది; నే నొకమాటఁ జెప్పెద వినుము. మానవుని మనంబున నిచ్ఛయొకటి యుండిన నెట్టి పనినైన నతఁడు నేర్వఁగలఁడు!

నూతనవ్యక్తి:—మానవులు పనిచేయుదురు; నేనును పనిచేసెద.

సైమన్:—నీ పేరేమి?

నూతనవ్యక్తి:—నన్ను "మైకేల్" అని పిలుతురు.

సైమన్:—మైకేల్, ఆత్మీయ వృత్తాంతములను గుఱించి నీవు మూకీభావము వహించుచో నేను నిన్ను నిర్బంధింపను. అయ్యది నీయిచ్ఛకు లోఁబడినది. అయిన జీవధారణచేసిన ప్రతి మానవుఁడును బ్రతుకు తెరవొకటి కల్పించుకొన వలయును. నే నలవరచున దంతయు నీవర్థిమెయి నేర్చిన నచిర కాలముననే నీ వారితేరిన గాఁడగర వయ్యెదవు. అట్టితఱి నిన్ను నేను నాయింట నుంచుకొనుట కే యభ్యంతరమును నుండదు సుమా. ఇందున కేమందువు?

మైకేల్:—దేవుఁడు నీకు భద్రమొనరించుగాత! నీవేమి చూపిన దాని ననుకరించెద. కరుణించిచూపుము.

ఆవల సైమన్ దారమును గైకొని దానికి బంక నంటించు విధము నతని కెరింగించెను. ఏకసంతగ్రాహియో యాయన నేర్పినదంతయు మైకే లొకసారికే యనుకరించు చుండెను. చర్మ కర్మమునందలి మర్మములన్నియు నవలీల నేర్చినైచి యొకటి రెండు దినములలోనే

దక్షుఁడయ్యెను. పైనఁ జూచుటకు వెంగలివలెఁ గనుపడినను, పనిలోమాత్ర మతఁడసదృశమగు నైపుణ్యము నగుపఱచు చుండెను. ప్రతి దినమును నతిశ్రద్ధతో బాటుపడుచుఁ దన యజమానునికి వెన్నెముకవలె నుండెను. సద్గుణ విశిష్టుండు; స్వల్పాహారి; మితభాషి; తప్పుపలుకఁడు; అలవోకగానైన నెగతాళి చేయఁడు; నవ్వనే నవ్వఁడు. నాటిరేయి మార్తా నెనరున నన్నోదకముల నిడినపుడుమాత్ర మించుక స్మితమును గనఁబఱచి యుండెను. మొత్తముమీఁద నతఁడు దేవతా జీవనమును గడుపుచుండెననిన సత్యమునకు దూరము కాదు.

---

## VI

ఈప్రకారము కాలచక్రమున దినములు, వారములు, నెలలు, యొక సంవత్సరము నయితము కడచిపోయెను. అహరహమును మైకేల్ స్వామికార్యతత్పరుఁడై మెలంగుచుండెను. అతని పనులలో నొక వింతయోజము గన్పట్టుచుండెను. పరిసరవాసు లందఱీతని వాసి విని పాదరక్షల పనుల నన్నియు నీతనికే యప్పగించుచుండిరి. వారి పనులను మైకేల్ భద్రముగను, సుందరముగను, శీఘ్రముగను, జేసియిచ్చుచు

వారి ప్రశంసలను జూరగొనుచుండెను. సైమన్నునకు విరివిగ ధనము చేరుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు ప్రాతఃకాలంబున నొక శ్రీమంతుఁడు రథారూఢుఁడై సైమను గృహమున కరుదెంచెను. శకట మాఁగగనే సేవకుఁడు గొబ్బున డిగ్గి శకట కవాటమును దీసి నిజస్వామికిఁ గేలూత నొసంగి యాతని దింపెను. సైమను సతి సత్వరముగ వీధివాకిలి పాఱఁదీసి యాతనికి సుస్వాగత మొసంగెను. సైమను మైకేలు లభ్యుత్థానం బొనరించిరి. తట్టున గడిబిడిసేయు చుండిన బిడ్డలు నిశ్శబ్దముగ నాగంతుకుని వేడబంబుతోఁ జూచుచు నిలువఁబడిరి. ధనికుఁడు మంచి కాయపుష్టి గలిగి యుండెను. నిగనిగలాడు సకలాతు నిలువుటంగిని ధరించి యుండెను. అతఁ డతిశయించిన నహంభావముతో గృహ ప్రవేశ మొనరించెను. చాల పొడువరి యగుటచే ద్వారబంధన మాతని శిరమును దాకు చున్నట్లుండెను. కాఁబట్టి యతఁడు తలనించుక వంచి జాగ్రత్త వహించి లోనికరిగెను. ఇంటి హజారములో నర్థభాగ మంతయు నతఁడాక్రమించుకొనున ట్లుండెను. వినయ సంభ్రమంబులు పురిగొన సైమన్నాతనిచెంత నొకకుర్చీ నీడ్చి యందాసీను గమ్మని వేఁడెను. అర్థవంతు డొకింత సేపు కూరుచుండక యట్లే నిలఁబడి నలుదిక్కులఁ జూచెను. ఆతని తల గిముచందువాను సోకుచున్నట్లుం

డెను. సైమన్ ఈ మహాకాయునిగాంచి వెఱఁగందెను. ఇట్టి మానవు నతఁ డిదివఱ కెప్పుడును గాంచియుండలేదు. సైమన్ చాల పలచనివాఁడు. మైకేలును సన్నగా సుకుమారముగా నుండెను. ఇఁక మాత్రా యన్ననో మూర్తీభవించిన క్షామదేవత! ఆమె బిడ్డలు చాల బక్కచిక్కి యెండుచేపలవలె నుండిరి!! వీరి నడుమ నాగురిలేని లావు వాఁ డీలోకమునకుఁ జేరినవానివలె నగుపడక యన్యలోకమునకుఁ జెందినవానివలెఁ గన్పట్టుచుండెను. ఆతని మొగము గుండ్రనిదై యుబ్బెత్తిన బుగ్గలతో నిండారుచు రక్తవర్ణయుతమై ముఖము గొట్టునట్లుండెను. ఆతని యవటు వాబోఁతు మెడసొంపు నవఘులించుచుండెను. ఒడలంతయుఁ జెక్కుచెదరక యుక్కుగుండువలె నుండెను. తనివిదీర తినుటలో నతఁ డావంతయు వెనుక పడువాఁడు కాఁడని యాతని భీమంబగు రూపంబే చెప్పక చెప్పుచుండెను. తన నల్లనిగ్గుల గొంగళి నిలువంగి నతఁడువిప్పి మఱొక కుర్చీపై నుంచి, తానొక దానిపై నాసీనుఁ డయ్యెను. ఆతని యంగరకము సంచపురేకు తళుకులతోఁ గన్నుల మిఱుమిట్లు గొల్పుచుండెను. అంత నాఘనుఁడు, సైమన్ వంక దిరిగి, వృషభస్వరమును బోలిన కంఠధ్వనితో "ఈ యంగడికి యజమానుఁ డెవఁడు?" అని ప్రశ్నించెను. సైమన్ సవినయముగ "నీ యల్పాత్ముఁడే, మహాప్రభూ" యని

బదులిడి ముందేమి యానతి నొసంగునోయని యాతనినే చూచుచు నిలఁబడెను. ఆవల నా భాగ్యవంతుఁడు సైమన్నునుజూచి "నీ పేరేమి" అని యడుగ, నందుల కతఁడు "నన్ను సైమన్ అని పిలుతురు" అని వాకుృచ్చెను. పిదప నా యైశ్వర్యవంతుఁ డట్టహాస మొట్టిపడ, భృత్యునివంక దిరిగి, "ఓరీ! ఐవాన్ ఆ తోలు పొదుక నిందు గొనిరమ్ము; శీఘ్రముగా" అని యాజ్ఞాపింప, నతఁ డతి త్వరితగతి నరిగి బండిలో నుండిన నాపొట్లమును దెచ్చి బల్లపై నుంచెను. శ్రీమంతుండు వికసన్ముఖుండై పొట్లమునువిప్పి తోలును జేతితోఁ జూపుచు సైమన్నును సంబోధించి "చూచితివా! యీ చర్మమును?" అని యడిగెను. అంత వారిరువురికిని, నీదిగువ సంభాషణ జరిగెను.

సైమన్:—చూచితిని స్వామీ.

ధనికుఁడు:—ఇది యెట్టిచర్మమని తలంచితివి?

సైమన్:—(తోలును జేతితో స్పృశించి)ఇది యుత్కృష్టమైన చర్మము.

ధనికుఁడు:—(గురుకాయించుచు) పిచ్చివాఁడా! 'అత్యుత్కృష్ట'మనుము. ఇది జర్మనీనుండి నాకై ప్రత్యేకముగ దెప్పించితిని. నీ జీవితకాలము నం దిట్టి తోలు నెప్పుడును జూచియెఱుఁగవు!

దీని విలువ యెంతయని భావించితివి ? ఇది యేఁబదిరూపాయల నిచ్చినను, దొరకుట దుర్లభము !!

సైమన్ :—(అబ్బురపాటున) ఇంతటి విలువగల చర్మమును మాబోటి దరిద్రులెట్లు చూడఁగలుగుదుము ?

ధనికుఁడు:—(చిరచిరలాడుచు) టక్,టక్! అదియట్లుండని. ఇప్పుడు నీవు నా కాళ్ళకు సరిపోవు బూట్సులను గుట్టి యియ్యఁగలవా ? ఈ చర్మముతో ?

సైమన్ :—(వినయముతో) చిత్తము; మహాస్వామీ.

ధనికుఁడు:—అట్లయిన, 'చేయఁగల' ననుచున్నావా ? నిక్కముగా చేయఁగలవా?

సైమన్ :—(తొంకుమాటలతో) చే...య...గలను దేవరా !

ధనికుఁడు:—(అమితమైన గర్వముతో) ఎవరి కాళ్ళకు నీవు బూట్సులు గుట్టుచున్నావని తలంచితివి ? ఎట్టివారలని భావించితివి ? ఒక్కయేఁడు చెడిపోక నుండు బూట్సులు చేసియియ్యవలయును. ఈ నియమమునకు బద్ధుఁడవై యుండఁగలిగినచోఁ గార్యమును గైకొనుము. లేనిచో, 'నావలన కాదు'

అని మొహమాటములేక మొదలే మనవిచేయుదు. అట్లొనరించుటలో నవమాన మేమియును లేదు. చర్మమును మాత్రము చెడఁగొట్టకుము. మును మున్నే నిన్ను హెచ్చరించుచున్నాను. ఒక సంవత్సరములోపల బూట్సులు చెడిపోయెనా, నీకుఁ గారాగార వాసము తప్పదు. చెడకుండ నుండెనా, నీకు నేను పదునైదు రూప్యములను పారితోషికముగ నొసంగెదను.

సైమన్ సందిగ్ధ మనస్కుఁడాయెను. అతనికి నోటమాట నిర్గళముగ రాదాయె. ఇట్టి కఠిన నిబంధనల నతఁడెప్పుడును వినియుండలేదు. కాన నతఁడు, స్వతంత్రించి తానే యొప్పందమున కొప్పుకొనుటకు చాలినంత ధైర్యములేమి, మైకేలును మోచేతితోఁ బొడచి యోరగంటితోఁజూచెను. మైకేల్, నిజస్వామి సైగను గైకొని, యంగీకార సూచకముగఁ దలయూచెను. ఈ యింగితము నెఱింగి, సైమన్ శ్రీమంతుని కార్యము నంగీకరించెను. సైమన్నాతని యడుగుల కొలఁతను గైకొన ననుమతివేఁడెను. అందుల కతఁడు వల్లెయన సైమన్ చేతులను శుభ్రముగఁ గడుగుకొని పదునేడంగుళముల కాగితము నొకటిని దీసికొనివచ్చి కూరుచుండెను. సంపదాఢ్యుం డెడమకాలును విఱ్ఱవీగుచుఁ జాచెను. దాని

యథుగు భాగమును వెనుకభాగమును గొలచెను. ఆవల నతఁడాయతికాయుని మోకాలు పిక్కను గొలవఁబోగా, కాగితము చాలకవచ్చెను. ఆసంపన్నుని గడుసు పిక్కలు పెద్దదూలములను బోలుచుండెను. సైమన్ మఱొక కాగితమును దెచ్చి చేతనుండినదానికి జంటింపఁబోయెను. అంతలో నా ధనాఢ్యుఁడు సైమన్నును హెచ్చరించుచు, “జాగ్రత్త, మోకాలు పిక్కయొక్క యిరుకుగా నుంచకుము” అని పలికి తనచూపులను మైకేల్ వైపు మరల్చెను. తన చేతివ్రేలితో నతనిని జూపుచు “వీఁడెవరు” అని యడుగ, నందులకు సైమన్ “వీఁడే నాపనివాఁడు, మైకేల్ అని పేరు” అన, ధనికుఁడు మైకేల్ వైపుతిరిగి “మైకేల్, ఇదిగో చూడుము, బూట్సు లొక్కయేమి కించిన్మాత్రమును చెడకూడదు” అని దర్పోన్నతిని బలికెను. మైకేల్ శ్రీమంతుని కభిముఖుఁడై యాతనిజూచుటకు మాఱుగా నతని వీపు వెనుక నెద్దియో వీక్షించుచు, తటాలున నొక చిఱునవ్వునవ్వెను. అప్పుడాతని మొగంబున నజ్వలకాంతులు ప్రభవిల్లుచుండెను. దీనినంతయుఁ బరికించుచుండిన సైమన్, విస్మయచేతస్కుండై యూరక నిలచియుండెను. మదాంధుఁడైన ఆఢ్యవంతునిగన్నుల కిది కనుపడలేదు. అతఁడు మైకేలును సంబోధించి, “ఏరా కుంకా! దేనినిజూచి నీవిట్లు పండ్లిగిలించుచున్నావు?

నియతకాలమునకు సరిగ బూట్సులను సిద్ధపరపకుం డినచో నీవు కష్టమునకు గురియగుదువు." అని తుళ్ళుచు నుడువ, సంచుల కాడిటువరి "వలసినపు డవి యాయత్తమయ్యే యుండును" అని గొనకొని ధాటిగాఁ బలికెను. అంత నాయభిజనుఁడు "అట్లైన సరియే, నాకు కావలసిన దదియే" అని వక్కాణించి సైమన్ వంకఁ దిరిగెను. అతఁ డిరుపాదముల కొలఁతను గైకొని యొక మూల నమ్రతతో నిలువఁబడెను. పదపడి సంపదధికుఁడు సేవకుని బిలచి విప్పియుండిన బూట్సులను మగుడ దొడిగించుకొని, నిలువుటంగిని దొడుఁగ వలయునని యానతిచ్చి చేతులుచాచి నిలువఁ బడెను. బంటు దానిని సరిగ దొడిగి వెనుకకొదిగి నిలఁబడెను. పిదప నా శ్రీమంతుండు, సైమన్ సెలవును గైకొని, యిల్లు వెడలెను. ఈ సారి యా యాయకాఁడు ద్వార బంధనపు పై తట్టు నంతగా గమనింపమి, యాతనితల దానికి 'ఫెళ్'మని తాకెను. ఆ కడిది తాకున కతఁడొట్టు పెట్టి తిట్టి నొప్పి నాపుటకై చేతితోఁ దలనొరయుచు బయటికిఁ బోయెను. భృత్యుఁడు తనమీఁద మాటవచ్చునేమో యని దిగులుపడి గడగడ వడఁకుచు నొకమూల నిలిచెను. శ్రీమంతుం డంత రథము నవరోహించి అతిత్వరితముగ గుఱ్ఱములను దోలవలసినదని సారథి కాజ్ఞ యొసంగెను. సారథి కొరడాతో బలముగ గుఱ్ఱములను

గొట్టెను. రథము కనుమూసి తెఱచునంతలో నదృశ్య
మాయెను. పిదప సైమను తన చెలికానితోఁ బరిహాస
ముగా "చూచితివా, నెయ్యుఁడా యెంతపెద్ద బలీవర్ద
మేతెంచి యుండెను. తీక్ష్ణమైన పరశువుతో సహిత
మాతని యెముక తెగదుసుమా! మన కుటీర కవాటము
నతఁడు తన తలతోఁ దొడరి సడలించి వైచెను. అయిన
నతఁడా దెబ్బ నించుకైనను లక్ష్యపెట్టి నట్లగపడఁడు!"
అనవుడు మైకేల్ మారుమాటాడక మిన్నకుండెను.
అప్పుడు సహచారుఁ డాతుటుసందుకొని మోమునఁ జిరునవ్వు
జిలుకార, నిట్లనెను "అవును, సుబ్బనసూర మెసవి మదించి
యున్నాఁడు. యముఁడుకూడ ఈ మహానాయునిగాంచి
వెఱచి వెనుకకు మఱలి పోవును గాఁబోలు!"

---

## VII

సైమను కర్తవ్యోత్సుకుఁ డాయెను. మైకేలును
గార్య నిమగ్నుం డయ్యెను. అంత సైమను మైకేలును
సమీపించి "మిత్రమా ఇటు చూడుము! పని నేమో
మన మొప్పుకొని వేసితిమి. దానిని తృప్తికరముగ
నిర్వహించు భారము మన తలపైనున్నది. సర్వప్రయ
త్నములును జేసి శ్రీమంతుని సంతృప్తునిగఁజేసి తీరవలె

యును. మొదలే ముంగోపి; ఇఁక నెరసు దొరకిన మమ్ములఁ బ్రతుక నిచ్చునా? మీఁదు తోలు చాల విలువగలది. మన మావంతయైనను దప్పొనరింప కూడదు సుమా! నాకు నేత్రపటుత్వము తక్కువ. దానంజేసి నీవే తోలును బరిమాణముల ననుసరించి కత్తిరింపుము. హస్తనైపుణ్యమున నీకన్న మిన్న యయిన వారెవ్వ రున్నారు! ముఖ్యమైన భాగములన్నియు నీవే కుట్టుము. చిల్లర పనులను నేఁజేసెద." నావుడు మైకేల్ చర్మమును దీసికొని బల్లపైఁ బఱచి మృదువుగఁజేసి మడచి కత్తిరింప మొదలిడెను. మాత్రా చెంతనిలచి చూచుచుండెను. మైకేల్ చర్య యామెకు వింతఁగొల్పెను. బూట్సులు కుట్టుట కనుగుణముగా దోలును గత్తిరించుటకు మాఱుగా సంబువులకు దగినట్లతఁడు దానిని గత్తిరించుచుండెను. అను దినమును జూచుచుండుటచే నామెకీ పనులలో మంచి జ్ఞానమలవడి యుండెను. రష్యా దేశమున శవములకు సంబువులను దొడుగు వాడుక గలదు. సజీవుఁడై యుండు శ్రీమంతునికి బూట్సులు కుట్టుటకు బదులు కళేబరమున కుపయోగించు సంబువుల నతఁడు చేయుచుండుట మాత్రా గాంచి యక్కజమంది మైకేలును మందలింప నెంచెను గాని ఆమె కట్లొనరించుటకు చాలినంత ధైర్యముండ లేదు. అనుమాన మానసంబుతో 'దొడ్డవారి బూట్సు

లను కుట్టు విధానము నాకుఁ దెలియదేమో! మైకేల్ పేరెన్నికఁగన్న పనివాఁడు !! తప్పుల నెప్పుడును జేయఁడు. నేను కేవలమొక యాఁడుదేకదా!!! నాకేమి తెలియు నీ విషయములు !!!" అని తలపోసి యట్లు చూచుచు తటస్థురాలుగ నిలచిపోయెను. మైకేల్, బూట్సులకువలె జంటదారము నుపయోగించుటకు మాఱుగ సంబువులకువలె నొంటిదారమునే యుపయోగించుచుండెను. మార్తా యబ్బుర మతిశయించెను. ఆతని కార్యము లిదివఱకు నిష్కల్మషంబుగ నుండబట్టి, మార్తా, యాతనిపనిలో నైక్యము గలిగించుకొనుటకు జంకెను. ఇవ్విధంబున మైకేల్ మధ్యాహ్నమువఱకుఁ గార్యమగ్నుండై యుండి, నెరతనంబున సంబువులను సిద్ధపఱచెను. బూట్సు లెంత వఱకైనదో సైమన్ చూడ వచ్చెను. సంబువులను గాంచిన తత్క్షణమే ఆతని మనస్సు కళక్కుమనెను. ఆ సలలితుని చర్యలో నీ ఘోర ప్రమాదము గోచరించినందులకై యాతని మనంబున నాశ్చర్య విషాదము లొక్కేసారి స్తోమం బయ్యెను. అంతనతఁడు మోము ముడుచుకొని మైకేల్ ను సంబోధించి యిట్లనెను. "నాయనా! యెంతపని జేసితివి ! ఏడాదిగా నొక్క తప్పైనను జేయనివాఁ డిప్పు డొకటిచెప్పిన మఱొకటిని జేసి వైచినాఁడవే !! ఇది నీకు న్యాయమా ? పెద్దమనుష్యుం

దూరకుండునా? స్వాభావికముగనే యతఁడు క్రూర చిత్తుఁడు. ఇఁక నెరసుదొరకిన నతఁ డూరక వదలునా? చర్మమన్ననో, చాల విలువగలదే!!! తప్పుఁజేసిన గఠినముగ దండింతునని యాదర్పితుఁ డాదియందే శాసించి యున్నాఁడే. అయ్యో, నాకొంపముంచితివే; నా గుట్టు కూల్చితివే" అని సంక్షోభిత హృదయుండై యలమటించుచు నాగొడగరవాఁడు చతికిల పడియెను. మాత్రా కూడ హృదయవేదనతో ధవునియొద్ద కరుగుదెంచి, యాతని నూరడించుచు, "నాకిది మొదలే తెలియును. మైకేల్ చాలనిపుణుఁడు గాన నేనతనిపని కడ్డముపో లేదు" అనిచెప్పి, యామెయు బలవించుచు, నిలువఁ బడెను. అంతలో వీధివాకిట నెవ్వరో యత్యంత కౌతుకముతోఁ దలుపు తట్టిరి. సైమన్ త్వరపాటున నరిగి తలుపుదీసి చూడఁగా మున్ను వచ్చియుండిన శ్రీమంతుని బంటు అశ్వారోహకుఁడై వచ్చి గుఱ్ఱము నొక ప్రక్క బిగించి నిలచి యుండుట గాంచెను. సైమన్ నిలువునీరై పోయెను. అయినను నలజడి నొకింత యడంచుకొని యా భృత్యునికి సుస్వాగత మొసంగి వచ్చిన పని యేమని విచారించెను. ఆవల వా రిరువురికిని నీదిగువ సంభాషణ జరిగెను.

భృత్యుఁడు!—సైమన్ మీకుఁ గుట్టనిచ్చిన బూట్సు

లను గుఱించి మా దొరసాని యొకసందేశ మంపి యున్నది.

సైమన్:—ఏమి యా సందేశము!

భృత్యుఁడు:—బూట్సులను గుట్ట నిర్దేశించిన మా ప్రభువున కవి యిప్పు డనవసరములుగఁ బరిణమించినవి! వానికి మారుగా నొకజత సంబువులు గావలసి వచ్చినది. అందుచేత మా ప్రభ్విని సంబువులను జేయించి తెమ్మని యానతి నొసంగి నన్నుఁ బంపినది.

సైమన్:—ఇంతలో నేల యీ మార్పు?

భృత్యుఁడు:—తానొకటి తలఁచిన దైవ మొకటి దలఁచుగదా! మా యొడయం డిందుండి వెడలి పోయినఁ గొన్ని గడియలలోనే ప్రాణములు విడిచెను. ఆతని శవమున కుద్దాలము లవశ్యకము లైనవి. వేగిర చేసి యిత్తువా?

సైమన్:—(దిగ్భ్రాంతుఁడై) నీ మాటలు నాకచ్చెరువు గొల్పు చున్నవి. ప్రాతఃకాలమున నతఁ డిందుండెనే! దృఢకాయుఁడుగను నారోగ్యవంతుడుగను గన్పట్టెనే!!

భృత్యుఁడు:—దైవానుగ్రహ మావంత తప్పిన నెంత దృఢ కాయుఁడైన నేమి! ఇంటినుండి వెడలి

వచ్చిన పురుషుఁడు మగుడ గృహము చేరనేలేదు. త్రోవలోఁ గొన్ని చిల్లర పనులను ముగించుకొని యింటియొక్క కరిగితిమి. బండివాకిలి దీసి యాతనిదింపఁబోగా నతఁ డనువుల బాసి చల్లపడి కొయ్యవారి యుండెను. ఆతని శవము నీవలి కీడ్చినై చూచుటే దుష్కర మయ్యెను.

సైమన్:—ఆవల ?

భృత్యుఁడు:—ఆవల నాస్థూలమైన ఘటమును బయటికీడ్చి పీనుఁగ పెట్టెలో నుంచి, యంత్యక్రియలకై సిద్ధపఱచితిమి. సంబువులను దొడుగుట మాత్రము మిగిలియున్నది. వానిని శీఘ్రముగనిచ్చిన గొంపోదును.

సైమన్ హృదయము నావరించియుండిన సంక్షోభమిప్పు డుపశమించెను. మైకేల్ చేసినతప్పు అప్రయత్నముగ నొప్పుగాఁ బరిణమించెకదా యని సంతోష భరితుఁ డయ్యెను. అతఁడు చూపిన దివ్యదృష్టి సైమన్నకు బోధపడలేదుగాని యుపక్రమించిన కార్యమును మాత్ర మతఁ డతిత్ప్తికరముగఁ జేయునని గట్టినమ్మకమాతనియెడల జనించెను. అప్పటినుండి మైకేల్ పైనుండిన విశ్వాసగౌరవము లినుమడించెను. మైకేల్ సంబువుల జతను కాగితములోనుంచి, కట్టి, భృత్యునకం

దిచ్చెను. అతఁడు సైమన్ సెలవునుగైకొని, కూలి డబ్బు నావలఁ బంపుదునని నుడివి, హయము నెక్కి వెడలిపోయెను.

---

VIII

ఇట్లుండంగున మైకేల్ నిజస్వామి కత్యంతాను కూలుండై యాతనియింటనే నివసించుచుండెను. ఇట్లొక యేడు, రెండేండ్లు, ఐదేండ్లు నయితము గడచిపోయెను. ఆ సచ్చరిత్రుని నడవడిలో నించుకేనియు మార్పు కనుపింపలేదు. వీతరాగుఁడు; మితభాషి; వేడుకకైనను బరిహాస మొనరింపఁడు. ఇదివఱ కతఁడు రెండుసారులు మాత్రము స్మితమును జూపియుండెను. మాత్రా, దయార్ద్ర హృదయయై యన్నపానంబు లొసగినపు డొకసారి; ఒకయేడు చెడనిబూట్సులను జేసి యియ్య వలసినదని యా శ్రీమంతుఁ డాజ్ఞాపించినపు డింకొకసారి. ఇఁక నాతని కృతికర్మ చాతుర్యమన్ననో, వర్ణనాతీతము. ఇంతటి యమోఘశక్తి గలవాఁడును, మేధాసంపన్నుఁడును, దనచేతిక్రింద పనివాఁడుగా నున్నందులకై సైమన్ సంతోషాంతరంగుండై, యాతనిఁ జూచిచూచి మురియుచుండెను. ఎందుండి వచ్చితివని యిప్పు డతని నడుగఁడు. తనయిల్లువదలి వెడలిపోవునేమో యను

భీతి యతని కిప్పుడు కలిగెను.

ఇట్లుండ నొకనాఁ డహర్ముఖంబున సైమన్ మైకేలు లెప్పటియట్లు తమ పనులలోఁ బ్రవేశించి యుండిరి. శీతకాల మగుటచేఁ జలి యధికముగా నుండెను. సైమన్ బిడ్డలు బల్లయొద్దఁ గూరుచుండి కిటికీగుండ వచ్చుబోవు వారిని జూచుచు నాడుకొను చుండిరి. మార్తా లోపల పచనకార్యాసక్తయై యుండెను. సైమన్, జాలకము చెంతనిలచి యురమీఁద అంపమునకు సానఁబెట్టుచుండెను. మైకే లింకొక కిటికీయొద్ద నిలచి పాదరక్షలలో నొక సూక్ష్మభాగము నత్యంత జాగరూకతతోఁ గుట్టుచుండెను. అల్లంతన, వీధివైపుఁ జూచుచుండిన కుఱ్ఱడొకఁడు మైకేల్ యొద్దకుఁ బరుగిడి వచ్చి యాతని వీపుమీఁద నానుకొని, "మైకేల్ మామా! అదో చూడుము. ఎవ్వతెయో యొక యిల్లా. లిద్దఱుపిల్లలను దోకొని మనయింటిని డగ్గరుచున్నది. ఆమె యొకవర్తకుని పెండ్లాము కాఁబోలు! ఇద్దఱు బిడ్డలలో నొకటి కుంటిది!!" అనుడు మైకేల్ చేతనుండిన కార్యము నట్లే వదలివేసి కన్యలతో నరుగుదెంచుచుండిన నాస్త్రీని దేఱి పారజూచుచు నిలబడిపోయెను. సైమ నిద్ది గాంచి విస్మయమొందెను. ఏలన, నా కష్టాళి యెప్పుడును నిబ్భంగి కర్తవ్యమును మాని వీధిఁ బోవువారిని జూచుచు నిలఁబడలేదు. ఆతని

దృష్టి నాకర్షించిన వ్యక్తి యెవ్వరో తెలియఁగోరి సైమన్ కిటికీలోఁ జూచెను. ఒక స్త్రీ యిద్దఱు బాలికలను జెరియొకచేతిలోఁ బట్టుకొని నిజగృహమువైపు వచ్చుచుండుట గాంచెను. ఆ పొలఁతి చూపఱియే; మధ్యవయస్కురాలు; విలువగల వలువల నలవరించియుండెను. బాలికల కిరువురకును జిలిబిలి వన్నె యొల్లెలను గీలించి, మీఁద శ్రేష్ఠతమములైన శాలువలను గప్పియుండెను. బిడ్డలు ముద్దులొల్కుచుండిరి. ఇద్దఱిపోలికయు నొకటిగానే యుంటచేఁ బ్రత్యేకముగ వారినానవాలుబట్టుట కష్టమగుచుండెను. అయిన నొక బిడ్డమాత్ర మించుక కుంటుచుండెను. పడుచులను నడపించుచు నాయిల్లాలు సైమన్ గృహమును బ్రవేశించెను. అతఁ డామెకు స్వాగతమొసంగి కుర్చీపై నామె నాసీన గావించెను. బాలికలు బలుసిగ్గున నామె కాళ్ళచెంతనే నిలువఁబడియుండిరి. బల్లపలకపై గూరుచుండుడని సైమన్ యెంత చెప్పినను వినక ఆ బాలికలు మఱింత సంకోచము నగుపఱచుచు నా స్త్రీ యొద్ద యొదిగి నిలఁబడిరి. అంత నా యాగంతుకురాలు సైమన్నును సంబోధించి "అయ్యా, వచ్చు వసంత కాలమున దొడుగుటకీ బాలికలకు మంచి మృదువైన బూట్సులను గుట్టి యీయగలవా?" అని యడుగ నందున కతఁడు "ఇంత చిన్నవి మేము సామాన్యముగ

గుట్టుమమ్మా అయిన మీా కోరికను వీటఁబుచ్చుటకు నాకిష్టములేదు; కాన గుట్టియిచ్చెద" అని బదులిడెను. పదపడి సైమన్ "బూట్సుల లోనిభాగమునందు బట్టను వేతునా, లేక మెత్తని తోలునే వేయుదునా ?" అని యడుగ నందునకాయంగన "బట్టనే వేయుఁడు" అని పలికి మైకేల్ వంక తనదృష్టులను బ్రసరింపఁజేసెను. సైమన్నతనిని జూపుచు "ఇతఁడే మైకేల్, పనిలో మంచి చొరవగలవాఁడు" అన, నందుల కానవలామణి "అవును, మైకేల్ పేరువినియే నేనింతదూరము మరుగుదెంచి నది" అని పలికి యాతనికి వందన మొనరించెను. మైకేలును నత్యంత విశ్వాస పూర్వకములైన జూటుక్కుల నిగుడించుచు నాస్త్రీకి నమస్కరించెను. ఏమి చోద్యమో కాని యా బాలికలు మైకేల్ కంటఁబడిన దాదిగా నతఁడు గుట్టుపనినిమాని వారినే తెప్పలల్లార్పకఁ జూచుచుండెను. బిడ్డలు గునగున బెరిగి కుదిరికగా నల్లారు ముద్దుగా నుండినదేమో నిజమే. కాటుక కండ్లు; గులాబివన్నెఁ నిగ్గు చెక్కులు; నల్లని నెఱివేణులు; కెంబెదవులు; ముచ్చటఁగొల్పు తెలివిగల మోములు; వీనికిఁదోడు శ్రేష్ఠమైన శృంగారమైన ఉడుపు. ఇవన్నియు జూపఱ చిత్తంబు నాకర్షణ సేయుచుండినదేమో నిజమే. అయినను మైకేల్ వారిని తెప్పలార్పకుండ బరికించుటలో నేమో విశేష మున్నట్లుండెను.

వంట యింటిలో నుండిన మార్తా యీవలికివచ్చి వచ్చిన యిల్లాలిని బిడ్డలను జూచుచు నిలుచుండెను. బాలికల కాళ్ళ కొలతనుదీయ సైమన్ ముందునకు వచ్చెను. అప్పు డాగృహిణి యొకబిడ్డను జూపి "ఈ చిన్నది కుంటిది. ఒకగాలికొక బూట్సును చక్కఁగ నుండుదానికి మూఁడు బూట్సులను జేసిన చాలును. వీరమడబిడ్డలు." అని చెప్పెను. సైమన్నామె చెప్పిన చొప్పున నంగ వికల్పముగల నామగువ కాళ్ళకొలఁతను దీయుచు మది జాలిచెంది "అమ్మా, యెంత చక్కని చుక్కయిది! ఇది పుట్టుకతోఁ గుంటియా లేక పుట్టినమీఁద నంగ వైకల్యము నొందెనా?" అని యడుగ నందుల కాసాధ్వి "పుట్టుకుంటి కాదప్పా. జననమందిన పిదప వీరి జనని పాదముమీఁదఁ బొరలుటచేఁ గుంటువడెను" అని నుడివెను. అంతలోఁ జెంతనుండిన మార్తా మాటనందుకొని "అట్లయిన నీవు వీరి తల్లి కావా?" అని ప్రశ్నింప "కానమ్మా, వీరు నా కొమరితలుగారు. నాకును వీరి యింటి వారికిని యెట్టి చుట్టరికమును లేదు. నేను వీరిని బెంచుకొంటిని" అని యా ఘనురాలు వాక్రుచ్చెను. మార్తా యాచ్చెరువొంది "నీవు వీరికిఁ దల్లివి కాకపోయినను వీరి నెంతగాఁ బ్రేమించు చున్నావు!" అన నా పుణ్యాంగన "అమ్మకచెల్ల! వీరినెట్లు నేను ప్రేమింపకుండ నుండగలను. పురిటింటి శిశువులుగా నుండిన

దాదిగా నేను వీరిని నాచంటె పాలతోఁ బోషించి పెంచితిని. నాయాత్మ తనయుం డొకఁడుండెను. ఆ దౌర్భాగ్యుండు రెండేండ్లు పెరిగి యావల నన్నువదలి దేవునిలో నైక్యమయ్యెను. అప్పటిగోలె నే నీ బిడ్డలను నా సొంత బిడ్డలవలెనే భావించి వీరి యాటపాటలందు మునయు చున్నాను”అని వచింప నంత మార్త్రా “అట్లయినచో నీ బాలికల తలిదండ్రు లెవ్వరు?” అని యడిగెను. ఆపై నాపూజ్యురాలి త్తెఱంగునఁ జెప్పసాగెను.

---

## IX

దాదాపై దేండ్ల క్రిత మీ బిడ్డలొకే వారము దినములలోఁ దల్లిదండ్రులను బోనాడుట తటస్థించెను. తండ్రి మంగళవారము నాడును తల్లి శుక్రవారమునను బరలోకమున కేగిరి. జనకుఁడు మరణించిన మూడవ దినమున వీరు జనన మందిరి. మరునాడే తల్లి యసువులఁ బాసి భర్త ననుగమించెను. అప్పుడేను నామగనింటిలో గ్రామమందు నివసించు చుంటిని. మా యింటి ప్రక్కనే వీరు నివసించు చుండిరి. వీరి తండ్రి ప్రతి దినమును నడవి కరిగి యందు గట్టెలు కొట్టితెచ్చి వాని నమ్మి సంసారము నడుపు చుండెను. ఇట్లుండ నొకనా

డతనికిఁ గాల పరిపాకంబయ్యెఁ గాబోలు! మహావృక్షం బొకటి విరిగి యాతనిపైఁ బడెను. అతని ప్రేగు లీవలికి వచ్చివేసెను. కంఠగత ప్రాణుండై ఘోరమైన యావేదనతో సంకటపడు చుండుట నెవ్వరో గాంచి యాతని గీమునకుఁగొని వచ్చిరి. కుట్టుసురుతో నుండిన నతఁ డిల్లు చేరగనే కండ్లు తేలవేసి గుటుక్కు మనెను. నిండు చూలాలుగ నుండిన నాతనిభార్య యావారమున నీ యమడ బిడ్డలను బ్రసవించి యొక దినము మాత్రము బ్రతికియుండి యేకాంత దుఃఖమున బొగలుచు నీ లోకయాత్రను జాలించు కొనెను. పురిటింటి బిడ్డలనుచూచి వత్తమని నేను రెండవ దినము పోయిచూడఁగా నా దౌర్భాగ్యురాలు మరణించి చల్లనై కట్టెపారి పడియుండెను. హృదయ భేదకమైన యాదృశ్యమును గాంచి నా కత్యంత సంకటమయ్యెను. కన్నీళ్ళు కార్చుచు చుట్టుపట్ల నుండువారిని బిలచి వారి కీ సంగతిని దెలిపితిని. వారందఱును సజ్జనులు; దయాళువులు. శవసంస్కార కార్యము నొనరించి యా ధర్మాత్ములు గుమిగూడి బిడ్డల విషయమై యోచింప సాగిరి. అందుండిన వారందఱిలోను చంటిబిడ్డతల్లి నేనొక్కతెయే యాటచే నా యనాథ శిశుద్వయమును వారు నాకప్పగించి తత్కాలమునకు స్తన్యమునిచ్చి పోషింపుఁడని యేకగ్రీవముగాఁ నందఱును నన్ను వేడిరి. నేనందులకు విధిలేక సమ్మతించి బిడ్డల

నింటికి గొనిపోయి పోషింప మొదలిడితిని. ఇట్లుకొన్ని వారములు గడచెను. ఆవల నందుండిన వారందఱును నాయొద్ద కరుగుదెంచి "ఈకందలకు నీవేతల్లివి; వీరిని నీవే సాకుకొనుము" అని కోరగా నేనందులకియ్యకొని, వీరిని పెంచుకొంటిని. తొలుదొల్త కుంటిబిడ్డ నసడ్డజేసి పాలీయకుంటిని, వెంటనే నాయంతరాత్మ నన్నుఁజక్కఁగ చీవాట్లుపెట్టగా నాకు జ్ఞానోదయమై "దేవునివలెనుండు పసిపాప యేమిపాపముచేసెను! కడుపునకియ్యక దీనినిఁ జంపనేల?" అని యనుకొని నాకర్జమును గుర్తించి దానికిని స్తన్యమునీయ మొదలిడితి. దైవకృపచే మువ్వురు బిడ్డలకును జాలినంత పాలుండెను. అంతే కాదు; వారుతాగి మిగిలి చిలిపాలుగనుండెను. అది చూచి నాకచ్చెరువగుచుండెను. ఆదరణ విషయములో వీరిని నాసొంత బిడ్డలవలెనే చూచుకొనుచుంటిని. అప్పు డు నాకు యౌవనముండెను. దేహ పటుత్వముండెను. పుష్టికరమైన యాహారముండెను. పెట్టుపోతల కించు కేనియు గొఱతలేక వీరిని గాపాడుచుంటిని. ఇట్లు రెండేండ్లు కడచునంతలో నాసొంతబిడ్డడు, నాపెన్నిధి నన్నువదలి పరలోకమున కేగెను. మఱల నాకు సంతా నము కలుగనేలేదు. ఇప్పుడు నాభర్త కర్మాగార మందు గొప్పవేతనమును సంపాదించు చున్నాడు. ఏకొఱతయును మాకిప్పుడులేదు. ఈబిడ్డలనే నాసొంత

బిడ్డలకంటె నెక్కువగా జూచుకొనుచు వీరిని లాలించి తేలించుచు సుఖముగానున్నాము. బిడ్డలు పాపలతో సందడిలేని యిల్లు యిల్లేనా? నాజీవన దీపమునకు వీరే తైలము." ఇబ్భంగి, యాగుణవతి, దయదలిర్ప వాక్రుచ్చి చెక్కుడోయిపైఁ దొలికి నిలచియుండిన యశ్రుకణములను గరవస్త్రముతోఁ దుడుచుకొనుచు కుంటిబిడ్డను నక్కునఁజేర్చి యనురాగ ముట్టిపడ దానిని ముద్దిడెను. ఈ కథ నతిశ్రద్ధతో నాలకించుచుండిన మార్తా నిట్టూర్పు నిగుడించి, "జననీజనకులను గోల్పోయినను బిడ్డలు మనవచ్చుగాని, దైవము తప్పఁజూచిన నెట్టి వారును మనట కల్ల, యను కోవిదుల నుడి కన్యథాత్వంబు వాటిల్లునే ?" అని వచించి మిన్నకుండెను. తోడనే మైకేల్ నుండి వింతప్రభ యొకటి యావిర్భవించుచున్నట్లుండెను. ఇల్లంతయు నుజ్జ్వలకాంతి యుతమయ్యెను. అంద ఱాతనివైపు జూడ్కులు నిగుడించిరి. అతఁడూర్ధ్వ వదనుఁడై చేతులను మోకాళ్ళకుఁజుట్టి యొదిగి కూరుచుండియుండెను. ఆతని మోమున లేనగవు చెంగలించెను. దేనినో చూచి యతఁడాహ్లాదమును గనుబఱచు చున్నట్లుండెను. ఉత్తర క్షణముననే యా వింత ప్రభ యదృశ్యమయ్యెను. ఎప్పటియట్లు మైకేల్ పాదుకలను గుట్టుచుండెను.

# X

ఆ గంతుకురాలు సైమన్ మార్త్రా దంపతుల సెలవుగైకొని జంటపిల్లలను వెంటనిడుకొని వెడలిపోయెను. తదుపరి మైకేల్ మహాశయుఁడు పైకిలేచి, సైమన్ మార్త్రాల చెంత కఱుగుదెంచి వారిరువురికిని నమస్కరించి యిట్లనెను; "జననీ, తండ్రీ, నాకెలసంబుదీరె, ఏనిక పోయివచ్చెద. నాకు సెలవొసంగెదరా? దేవుఁడేమో నన్నుమన్నించెను. కాని మీరును నన్నుమన్నింతురా?" అని వేడెను. ఈమాటల నతఁడుచ్చరించునపుడు దివ్యకళలతో నతని మోమలరారుచుండెను. ఒక మహావిభూతియేగాని సామాన్యుఁడు కాఁడని సైమన్ మార్త్రాలు గ్రహించి దిగ్భ్రాంతులైరి. తమ గృహము నింతటి సంభావనీయుఁడు పావన మొనరించినందులకై బ్రహ్మానందము నందిరి. వారతనికి జోహారులొనరించి, యానందబాష్పములను రాల్చిరి. అంత సైమన్, ఆదివ్యపురుషుని సంబోధించి యిట్లనెను. "మహానుభావా నీవు మానవాతీతుండవని నీచర్యలే విశదపఱచుచున్నవి. నిన్ను బ్రశ్నించుటకుగాని నాయొద్ద నుంచుకొనుటకుగాని యే నెంతటివాఁడను! అయిన నొక్కటి మాత్రము నేనడుగ సాహసించుచున్నాను. ఎందుల కీవు సదా మౌనుఁడవై విచ్ఛాయ వదనుఁడవై యుండి మార్త్రా యన్నాదికముల నిడినపుడు మందహాసమును

గనుబఱచితివి ? నాఁటఁ గోలె నీవు విన్నఁబాటులేక మెలంగుచు శ్రీమంతుం డొకఁడఱుగుదెంచి యొకయేడు సమయకుండనుండు బూట్సులను గుట్టుమని శాసించి నప్పుడు మగుడ సస్మితాస్యుండవైతివి ? ఆవల మున్ను కంటె నెక్కుడు ముఖవర్చస్సుతో నేల మనుచుంటివి ? మఱల నిపుడొక క్రొత్తనెలఁత యమడబిడ్డలతో వచ్చి యుండ వారిని కుతుకతతోఁ దిలకించి మఱొకసారి దరహాసితాననుండవైతివి ? నే నిట్లడుగుచున్నానని కోపింపకుము. ఎందులకు నీనుండి వెలుతురు వెలువడు చున్నది ? ఏల నీవి త్రికాలంబులందు మాత్రమే ప్రమో దంబున బెరసి తక్కిన కాలమందంతయు గంభీరముగా నుంటివి? దయచేసి యీయంశములను విశదముగ దెలిపి, నా శంకలను దీర్పుమా", అని దీనముగ వేడగా నందుల కా పూజ్య పురుషుం డిత్తెఱంగున వాక్రుచ్చెను. "సైమన్ తండ్రీ నేనిప్పుడు శాపవిముక్తుండనైతిని. దేవుఁడు నన్ను క్షమించెను గాన నానుండి దీప్తులు బయలుదేరుచున్నవి. శాపము కలిమిచేఁ గాంతి హీనుఁడనై యిదివఱకు నిందుంటిని. ఇచ్చట నుండు కాలములో మూఁడు దైవవాక్కులను దెలిసికొనవల యునని నాకు దైవాజ్ఞ యుండెను. నేనా మూఁడు వాక్కుల నా త్రికాలంబు లందుఁ దెలిసికొనఁ గలిగితి గాన సంతసమంది మందహాసము నగుపఱచితిని. తు

ధాతురుండైన నాకు మర్త్యా మహాదేవి కృపచేసి యన్న మిడినపుడు మొదటి దైవవాక్కు విదిత మయ్యెను. శ్రీమంతుం డరుగుదెంచి నపుడు రెండవది నాకు దెల్ల మయ్యె. మూఁడవది అవడబిడ్డలతో వచ్చియుండిన నా ప్రాంగణమున మూలమున నాకెఱుక పడెను. ఈ త్రికాలంబు లందును శాపవిమోచనం బయ్యెకదా యని సంతుష్టుండై జ్యోతిర్మయుండై విరాజిల్లతి" అని యా మానవాతీతుండు నుడువ నైమన్నతనిని మఱికొన్ని ప్రశ్నల నడుగ సాహసించి యిట్లనెను. "అనఘా! ఇం కొక మనవి. దేవుఁడు మిమ్ము నెందులకు శిక్షించెను? మీ రెంటెంగిన నాత్రివాక్కు లెయ్యవి?" అంత నాదివ్య పురుషుం డిట్లైటంగున జెప్పసాగెను. "నేను దేవలోకమున నుండు కొండొక దేవదూతను. ఏదో యొక చిన్న విషయమున దైవాజ్ఞను నేను మీఱి నడచుట సంభవించెను. దాని కతన నామహా మహుండు నన్ను శిక్షింపనెంచి మానవునిగ బరిణమించి నరలోకమునకుఁ ద్రోసివైచెను. నేనంత యాపాధికమైన నీ మానవ శరీరముతో భూలోకంబున నుండవలసి వచ్చెను. ఆ యప్రమేయుని "నా కమరత్వము మఱల నెప్పుడబ్బును" అని వేడగ నందులకా కరుణామయుండు నామూఁడు వాక్కులును నీవు క్రమేణ తెలిసికొనిన పిదప మఱల నిజరూపమునొంది దేవలోకమునకు రాఁ గలుగుదువు.'

అని వచింప, నేను మనస్సమాధాన మందితిని. దేవుని యానతి నేరీతి నతిక్రమించితి నంటివా చెప్పెద వినుము. ఒకనాఁడు పరమేశ్వరుఁడు నరలోకమునకుఁ బొమ్మని నాకాజ్ఞ యొసంగి యందొక చోటను జక్కఁగ గుర్తు చెప్పి యచ్చట నుండిన యొక స్త్రీ యాత్మను గొని రమ్మని చెప్పెను. ఆజ్ఞానుగుణ్యముగఁ జివుక్కున నేను మానవలోకమున కరుగుదెంచి యా స్త్రీ పరుండి యుండిన గదిని బ్రవేశించితిని. అందామె రోగగ్రస్తయై యమడబిడ్డలను బ్రసవించి యేకాంత దుఃఖము నందుట గాంచితిని. ప్రక్కఁ బరుండి యుండిన శిశు ద్వయమునకు స్తన్యము నిచ్చునంతటి శక్తికూడ యామె కు లేనట్లుగ పడెను. సంతాప కారకమైన యామెస్థితిని గాంచి నాకు మనసు కరగెను. నేను దేవదూతయని యా యతివ తొడిదొడి గుర్తించి నాకు మ్రొక్కి "మహానుభావా నేను ఘోరవిపదంబుధిని మునింగి యున్నాను. నాకు మగదక్షత లేదు. నా పెనిమిటి రెండు దినముల క్రితము మ్రానువిరిగి పైబడుటచే దుర్మరణము నొందెను. పతి వియోగ దుఃఖం బొకయెడ బడబాగ్ని వలెఁ గడుపు కాల్చుచుండగా రోగమొకచోట తీవ్రముగ బాధించు చుండగా నీయమడః బిడ్డలు పుట్టిరి. నే నొంటరిపాటున దిక్కులేక పడియున్నాను. ఈ కందలను బోషించి పెంచి పెద్దఁజేసిన పిదప దైవాజ్ఞను తలమోచి

తోడసులేక నిన్ను వెన్నాడెద. తల్లి దండ్రు లిద్దరును లేక పోయిన బిడ్డలెట్లు బ్రతుక గలరు!" అని కన్నీరు మున్నీరు కాగ నేడుచుచు దీనముగ వేడగ నేను తటస్థుఁడనై నిలచి పోతిని! కన్న బిడ్డలపై నుండిన విరాళితోఁ బలికిన నామె పలుకులు నిజమని నమ్మితిని. అంత నేను ప్రాణహరణ కార్యమునకు విముఖుండనై చెంత నుండిన పసి పాపలను పాలుద్రాగుట కనుకూలముగఁ బరుండపెట్టి వచ్చిన త్రోవఁబట్టి వెడలి పోతిని. అంత నేను దేవలోకమునకరిగి లోకరక్షకుని మ్రోల నిలచి జరిగినదంతయు నాతనికిఁ బూసగ్రుచ్చినట్లు నివేదించితిని. అప్పాటున నాజగద్రక్షకుండు నాపైకోపించి 'నాయాజ్ఞోల్లంఘనంబు చేయఁజనునే? నీవు మఱల నరలోకమునకరిగి విడిచివచ్చిన స్త్రీ ప్రాణమును దత్క్షణమే తీసికొనిరమ్ము. నీవిప్పుడుచూపిన యవిధేయతకై ఈ శిక్షను విధించుచున్నాను. నామూఁడు వాక్కులు నీకుఁ దెలియువఱకు నీవు భూలోకంబున నివసింపవలయును;' అని యానతిచ్చి యతిశీఘ్రముగ వెడలిపొమ్మనెను. పదపడి నేను దేవలోకచ్యుతికి వగచి, "పరమపావనా ఆమూఁడు వాక్కులెయ్యవి" అని యడుగ నందులకా మహామహుం డివ్విధమున సెలవొసంగెను. "నామూఁడు వాక్కు లెవ్వియన జెప్పెదవినుము. మొదటిది, మానవులలో నుండునదేది? రెండవది మానవుల కతీతమైన

దేది? మూఁడవది, మానవజీవన మూలకందమేది? ఈ మూఁడును నీవు చక్కఁగ నెఱిగినపిదప నీవు మఱల నమరుఁడవై యిందు రాఁగలుగుదువు," అని సంజ్ఞాపించి యా శరణాగతవత్సలుండు నన్ను వీడ్కొలిపెను. ఆవల నేను దైవాజ్ఞను శిరసావహించి, వేర్లిమ్మిశిని గుతలంబునకు వచ్చి, మొదలు వదలివచ్చిన స్త్రీ ప్రాణమును గైకొన నుంకించితిని. అంతలో నాయనద యావేదనతో గురంగటనున్న యొక శిశువుపైఁ బొరలి దానిపాదమును నలిగించి వేసెను. నేనామె యాత్మను లాగుకొని, నభోమార్గంబున నెగిరిపోవుచుండ నంతలో బ్రిబల నిర్ఘాతంబొకటి పైతెంచి నా రెండు రెక్కలను దుంచి వైచెను. అప్పుడేను గాలిచేఁగూలిన గారాకుభంగి భువనమార్గంబున కవఘూతంబై యొక పొలమునఁ గూలితిని. నానుండి వ్యవహితమైన యా స్త్రీ యాత్మ వేలుపుల తో్రవఁబడి దరిఁజేరెను.

---

## XI

సైమన్ మార్తా దంపతులు తామిదివఱ కెట్టి పూజ్య పురుషుని కాతిథ్యమొసంగిరో చక్కఁగ నెఱింగిరి. దేవలోకమునకుఁ జేరిన యొక్క యమరుండే తమ

గృహంబున విడిసి కుటుంబమందు సంగియై యుల్లిబిల్లిగా నున్నందులకై వారు పరమానందము నొందిరి. అంత నా దేవదూత తన కథ నిత్తెఱంగున ముందు సాగించెను.

"ఈ పగిది నేను దేవునిచేఁ ద్రోయఁబడినవాఁడై దిగంబరుఁడై పడియుంటిని. చలి గాలి ఆఁకలి దప్పి మున్నగునవి తదాదిగా నన్నును బాధింప సాగెను. ఆనాఁడు చలి యధికముగ నుండెను. నా కాళ్ళు సేతులు కొంకరపోయి నేను జడుఁడై పడియుంటిని. సమీపంబు ననే కొండొక దేవాలయంబు దృగ్గోచరం బయ్యె. అత్యంత కష్టసాధ్యముతో నా దేహము చెంత కరిగితిని. నా దురదృష్ట వశమున నా దేవాలయ కవాటము బీగము వేయఁబడి యుండెను. చలిని వారింపనెంచి దేవాలయ భిత్తినానుకొని యందే కూరుచుండి యుంటిని. సంధ్యా కాలము సాగిన కొలఁదిని చలిబాధ యధికమగు చుండెను. ఆఁకలి కార్చిచ్చువలెఁ గడుపును గాల్చు చుండెను. డబ్బాటున నెవ్వరో యీ మార్గమున వచ్చినట్లాయె. పాతఁత పాదుకల నొక చేతిలోను దుడ్డు కఱ్ఱ నింకొకచేతిలోను పట్టి యీవ్యక్తి తనలో నేమేమో గొణగుకొను చుండెను. ఆ మానవుని ముఖమున దామస గుణము తాండవమాడు చుండెను. నాకుఁ జాల భయమయ్యెను. నా మోము నావలికి ద్రిప్పుకొంటిని. చలి, గొంగళి నిలువుటంగి, కుటుంబ పోషణము మున్నగు

విషయములను గుఱించి యతఁడు పలవరించుచు వేళా కోళావస్థలో నుండినట్లుండెను. అప్పుడేను "చూచితివా! క్షుధాతురుండనై నేను చలికి నీల్గుకొనిపడియుండగా నీపురుషుండు స్వార్థపరుఁడై నన్నుఁజూచియుఁజూడనట్లు నటించి నరగునరగున వెడలిపోవుచున్నాఁడే," అని యనుకొని హతాశుండనైతిని. అయిన నించుకసేపైన పిదప నావ్యక్తి యనుమానమానసంబుతో నాయొద్ద కరుగుదెంచి నన్ను నలువైపులను బరిశీలించెను. వేలవేసికొనియుండిన నాశిరమును పైకెత్తి యాతని ముఖమును దిలకించితిని. మొదటివలె నతనిమోము నిస్తేజమై భయావహమైయుండక ఇప్పుడు జీవకళలతో నలరారుచుండెను. నే నతని దృష్టించి చూచుసరికి యాతఁడు నాయెడల ననురక్తుండై నాకుఁ గట్టుబట్టనిచ్చి నన్ను బహూకరించెను. ఆవల నాపుణ్యాత్ముఁడు నన్నుఁదనయింటికిఁ గొంపోయెను. ఆతని గృహిణి మొదలేవగింపుతో గడుసు మాటల నాడెను. ఆమె కర్కశవాక్కులు నాహృదయంబున జొచ్చి నన్ను మిక్కుటముగ నొవ్వించెను. నా కుక్కిరిబిక్కిరియై యందు నిలుచుటయే కష్టమయ్యెను. నన్నిల్లువెడల నడవవలయునని యా యిల్లాలి ముఖ్యోద్దేశమై నట్లగపడెను. అట్లామె యొనరించియుండినచో, నేను చలికిజిక్కి చనిపోయియుందును; ఆమెకూడ చనిపోయి యుండును.

అంతలో నామెభర్త దేవుని విస్మరింపఁజేసెను. అప్పుడా సంపూజ్యురా లనుగ్రహంబొప్ప నా కన్నపానంబుల నిడెను. ఆముత్తైదువ మొగంబున నేనప్పుడు దేవుని గాంచితిని. ప్రథమదైవవాక్యమున 'మానవులలో నుండునదెయ్యది ?' యనునది నాకుఁ దేటతెల్లమయ్యె. మానవులలోనుండునది ప్రేమయేకదా ! అవ్యక్తముగ నుండిన నీవిషయమును దెలిసికొంటినిగదా! యని సంతోషించి నవ్వితిని. ఆవల దక్కిన రెండువాక్యములును గుంభనముగానేయుండినందున నేనతిమెలకువతో వేచియుంటిని. ఇట్లు కొన్నిదినములు గడచెను. అంత నొకనాఁడొక శ్రీమంతుం డరుగుదెంచి యమితమైన యహముతో నొక సంవత్సరము చెడని బూట్సులను గుట్టుమని యాజ్ఞాపించుచుండుటను వింటిని. ఆసంపదధికుని వీపువెనుక నాసంగడీఁడుగా నుండినఁ గాలపురుషుని గాంచి యా దినము సూర్యుడస్తంగతుఁడగు లోపల నా ధనికుఁడు మృత్యువక్త్రగతుం డగునని యెఱింగితిని. పోఁగాలము దాపించి యుండినను, నజ్ఞానవశంబున, నొకయేఁడు చెడని బూట్సులను గుట్టుమని యానతి నిచ్చుచుండుట గాంచి రెండవ వాక్యమున 'మానవుల కతీతమైన దెయ్యది?' అను దాని నెఱింగితిని. అనాగతమున కమర్ప బ్రయత్నించుట గాలిలో మేడగట్టుట వంటిది! భవిష్యత్తు దైవాధీనము. అనాగతవేది యా సర్వజ్ఞుఁడొకఁడే. నాచెలి

కానిని జూచి నందునకును రెండవ దైవవాక్య విశద మైనందునకును బ్రమోదమునొంది నేను రెండవసారి నవ్వితిని. అయిన మూఁడవ వాక్యమైన 'మానవజీవన మూలకందము' నాకు విదితము కామి, నే నత్యంత జాగ రూకతతో వేచియుంటిని. తొట్టతుదకు ఘుణాక్షర న్యాయమున నారవయేఁ డాయముడ బిడ్డలతో నగుచు పెంచిన నా పుణ్యాంగన మూలమున నా మూఁడవ వాక్యమును కరతలామలక మయ్యె. తల్లిదండ్రులెడ బాసినను బిడ్డలు దైవానుమతము ననుసరించి పరుల ప్రేమవలన మన గలుగుదురను సంశయము నాకు విశద మయ్యెను. ఎట్టి బందుగునూ కాని యా వెలందుక, సదయ హృదయయై, యనదలైన యా శౌదములను ముద్దుతోఁ బెంచి ప్రేమించుచుండుట గాంచి మానవ జీవన మూలకంద మనోన్యాన్యానురక్తి యని గుర్తించితిని. ఆ పూజ్యురాలి మొగంబున దేవుని ప్రతిమానమును దిలకించితిని. మూఁడవ దైవవాక్యకూడ ప్రతిపాదిత మయ్యెకదా యని సంతోష భరితుండనై మూఁడవసారి నవ్వితిని.”

---

## XII

అంత నా దేవదూత విగత కల్మషుండై యమరత్వమును బొందెను. ఆ మహానుభావుఁడు వచించుచుండినట్లే యాతని యంబరములు జారి నేలఁ గూలెను. అతని యొడలంతయు నుజ్వలకాంతులచేఁ బరివేష్టితమయ్యెను. కర్ణామృతతుల్యమైన యీ మహామహుని వాగ్ఝరి యిహలోకంబునకుఁ జెందినట్లుగాక నభోవచనంబులభాతి వినవచ్చుచుండెను. సైమన్ మాత్రా దంపతు లానందపరవశులై యంజలి ఘటించి నిలువఁబడియుండ నామానవాతీతుండిత్తెఱంగున నుద్బోధింపసాగెను. "ప్రతిమానవుని జీవనవృత్తమునకును బరస్పర ప్రేమయే తల్లివేరు. స్వశక్తిమీఁదనే యాధారపడియున్నానని తలంచు మానిసి శుద్ధవీరుఁడి! బిడ్డలు ప్రవర్ధమానమగుట తల్లి యధీనమందు లేదు. నాఁడు తన కేవస్తువు కావలయునో యాసంపదాఢ్యుం డెఱుంగఁడు. ముందు గడియలో నేమి సంభవించునో యెవ్వనికిని దెలియదు. మానవుని కనాగతజ్ఞానము దేవుఁడియ్యలేదు. శాపము కలిమిచే నేను మానవుఁడైనపుడు స్వయముగా నేనేమియును జేయఁజాలకుంటిని. సైమన్ మాత్రా దంపతుల మన్ననవలన నేమనగలిగితిని. తల్లిదండ్రులనుండి దూరీకరింపఁబడిన పసిపాప లన్యాంగన చూపిన ప్రేమవలన పొదలగలిగిరి. సృష్టికర్త

మానవులకు జీవముపోసిన సంగతి నేను మున్నెఱిఁగి యుంటిని. అయిన, వారిజీవనసౌధమునకు బునాదిరాయి యన్యోన్యానురాగమనియు, నైకమత్యమనియు దెలిసి యుండలేదు. ఇప్పుడది నాకుఁదెల్లమయ్యె. జనులు స్వార్థపరులై తోడిమానవుల నసడ్డచేయవలయునని దైవసంకల్ప మెన్నటికినిగాదు. వివేకవిదూరులైన కొందఱు, తమ్ముతామే సంరక్షించు కొనుచున్నామని విశ్వసించినను, వారే యించుకలోతుగ నాలోచించిన బరస్పర ప్రేమానుబంధములేక జీవించుట యసంగత మనియు, వెంగళమనియు వారికి విదితమగును. విశ్వ ప్రేమి దైవసమానుఁడు! సమానుఁడేకాఁడు, స్వరూపుఁ డనినను తప్పుకాదు. దయయే దేవుఁడు"

ఈ విధంబున నా దేవదూత యుద్బోధించి యూ వల దైవసంస్తవ మొనరింప మొదలిడెను. ఆతని కంఠారావము తారమై, సుశ్రావ్యమై, నాదయుతమై, యాగృహంబు నస్తిభారంబుతో నల్లాడించి వైచెను. అనంతర మాయింటి పైకప్పు రెండుభాగములుగాఁ జీలి పోయెను. జ్యోతిర్మయంబగు స్తంభంబొకటి యావిర్భవించి యిహపరలోకంబుల నొకటిగాఁ జేర్చునట్లుండెను. విలసితభక్తి నిశ్చలులై నిలచియుండిన నాగొడగర దంపతులు సాంద్రప్రభోజ్వలలను గాంచి, సుడివడి

నేలంబడిరి. శాపవిముక్తుండైన యా దేవదూత, యిరు పక్షద్వయంబుతో నంతరిక్షంబున కెగిసి దేవలోకంబున కరిగెను. తదుపరి సైమన్ మాత్రా దంపతులు, ఆశ్చర్యపాటునుండి తెలివినొంది, పైకిలేచి నలువైపులనుజూచిరి. మునుపటియట్లు వారు స్వగృహంబున నుండుట గాంచిరి. బిడ్డలెప్పటియట్లాడుకొనుచుండిరి. మైకేల్ మాయమై యుండెను.

---

# జల్లు ఢక్క

[వాల్గానదీ ప్రాంతములందు రూథిలోనుండు ఒక చిన్న కథ]

వాల్గానదీ ప్రాంతంబునం దొకగ్రామంబున ఎమిలిన్ అను కృషీవలుఁ డొకఁడుండెను. అతఁడొక భూస్వామి కధీనుఁడై కూలిపని చేయుచుండెను. ఒకనాఁడతఁడు కర్తవ్యోత్సుకుఁడై శాద్వలంబులపై నడచి పోవుచుండ, మండూకంబొకటి చంగుచంగుమని ఎగురుచు నాతనికి నడ్డముగ వచ్చెను. ఎమిలిన్ చాల భూతదయ కలవాఁడు. 'చలిచీమనైనను జాఁద్రొక్క నేరనివాడు' కాన నతఁడా కప్పగంతులను వారించుకొని, దానిని తన పాదముల క్రింద చిక్కి హతము గాకుండ బ్రతికించెను. అంతలో నాతని నెవ్వరో పిలిచినట్లాయె. తిరిగి చూచెను. లేఁబ్రాయపు ముద్దరాలొకతె వెనుక వచ్చుచుండుటఁ గాంచెను. ఎమిలిన్నును సంబోధించిన దీ జవ్వనియే. అంత నా ముగుదకును ఎమిలిన్నకును నీ దిగువ సంభాషణ జరిగెను.

ముగుద:—ఎమిలిన్! నీ వెందున కింకను బెండ్లాడకున్నాఁడవు?

ఎమిలిన్ !—బేలా ! నేనెట్లు పెండ్లాడుదు ! నాయొడలి మీాద నుండు వలువలుదక్క వేరులేవు. ఇంత దరిద్రావస్థలో నుండువాని నెవతె పెండ్లాడును ?

ముగుద:—నేను నీ కిల్లాలయిన ?

ఎమిలిన్:—(మందస్మిత వదనుండై) నాకు చాల సంతోషము, నీవనిన నాకక్కఱయే. అయిన మనము పెండ్లాడిన సంసారమునకు వలసిన జీవనాధార మెద్ది ? ఉండుట కిల్లుకూడ లేదే !

ముగుద:—ఆ విషయమై నీ వెందుకు చింతించెదవు ? నిద్రను దగ్గించి ఎక్కువ పనిసేయవలెనను తత్వ మును జీవన మూలకందముగా గ్రహించిన వాని కెవ్వనికైన తిండి బట్టలకుఁ గొఱతఁ గలుగునా ?

ఎమిలిన్:—అట్లయిన మంచిది. నేను పరిణయమాడె దను. ఎందు సంసారమును బూనుదము ? ఎక్కడి కరుగుదము ?

ముగుద:—పట్టణమునకు.

అట్లే వారిరువురునుఁ జేరువనుండిన నగరమునకు వెడలిరి. ఆ నగరాంతంబున నొక చిన్న కుటీరమున కామె యతనిఁ దోడ్కొని పోయెను. అందు వారు పరిణయమాడి సుఖముగ సంసారయాత్ర చేయుచుండిరి.

ఇట్లుండ నొకనాఁ డా దేశపు రాజు రథారూఢుండై యాత్రోవనుఁ బోవ తలస్థించెను. ఎమిలీ సతీమణి రాజ దర్శనార్థమై వీధివాకిట నిలచి చూచుచుండెను. అరద మింటిదగ్గఱకు వచ్చెను. పుడమిఱే డామె రూప లావణ్యములను దేరిపాఱఁజూచి వెరగంది 'ఎచ్చటనుండి వచ్చిన దీ సౌందర్య రాశి' అని ప్రశ్నించి రథికుని శక టము నాపుమనెను. వాఁడట్లె యొనరింప భూకాంతుండు ఎమిలీ సతిని చేతిసన్నతోఁ బిలచెను. అంత నామె స్యందనంబును సమీపించి సవినయముగ నమస్కరించి నిలువ నతఁడామెను, 'నీ వెవ్వరు' అని యడిగెను. అంత నాసాధ్వి 'నేను ఎమిలీ కృషీవలుని భార్య' అని బదు లిడెను. 'ఇంత చక్కని దానవే నీవు, కేవల మొక హాలముకాపరి నెట్లు చేపట్టితివి? నీవు పట్టపురాణిగా నుండవలసిన దానవే!' అని రాజనగా నందులకా పతి వ్రతా లలామ 'నాకు రైతు మగఁడే చాలును. మీా యుపచార పూర్వకములైన మాటలకే నెంతయుగృతజ్ఞు రాలను' అని నుడివి మిన్నకుండెను.

రాజామెతోఁ గొంతసేపు ముచ్చటించి ముందు నకు సాగెను. అతని మనస్సామెపై దగిలెను. సరిగా నగరమునకుఁ బోయెను. రాత్రి నిదురపట్టలేదు. ఎట్లా చక్కని చుక్కను దనవశము గావించికొన నగునా అని ఆలోచించు చుండెను. భృత్యులను బిలిపించి తన యభి

మతం బెరింగించెను. 'ఎమిలిన్ పెండ్లామును నావశము గావించు కొనుటకై యేదైన చక్కని యుపాయమును వెదుకుఁడు' అని ఆజ్ఞాపించెను.

అంత వారు దీర్ఘాలోచనఁ గావించి యేలికయొద్ద కరుదెంచి 'జియ్యా! యేలినవారికిఁ గష్టసాధ్య మేదైన నున్నదే? ఎమిలిన్నను రాచనగరులో నొక భృత్యుఁడై పనిచేయ నాజ్ఞాపింపుము. మేమతనిని గష్టతమములైనఁ జేతలచే నంత మొందింతుము. అపై వానిభార్య విధవ యగు. మీరామెను నిరాటంకముగ స్వీకరింపవచ్చును.' అని వినయ వినమిత గాత్రులై విన్నవించిరి.

ఈ యుక్తి పుడమిరేనికి సమంజసమని తోఁప, నాతండు ఎమిలిన్నను ప్రాసాదంబునఁ గూలిపని చేయ వలయుననియు భార్యాసమేతుండై యందే నివసింప వలయుననియు నుత్తరు వొసంగెను.

దూతలు రాజాజ్ఞను ఎమిలిన్నకు నివేదించిరి. అందున కాతని గృహిణి 'నాథా! ప్రాసాదంబునఁ బగలంతయుఁ బనిచేసి రాత్రివేళ కింటికి వచ్చివేయుఁడు' అని నుడివెను.

మరునాఁడు పెందలకడనే లేచి యాకార్మికుండు రాచనగరమునకుఁ బోయి, పార్శ్వత్తికాని యొద్ద కరిగి 'నాపనియేమి' అని యడుగ నందుల కాతఁడు ఒక్కఁడే

యెందులకు వచ్చితివి? నీ పిండ్లామునుగూడ దోడ్కొని రాకుండ' అని మందలింపఁగా నా దిటువరి 'ఆమె నివసించుట కిల్లొకటె యున్నది. ఇచ్చోటున కామె నెందు కీడ్చుకొని రావలయును?' అని బదులిడెను. పార్వ్రత్తె కా డతనికిఁ గష్టతమములైన పనులను నియమించెను. ఇద్దఱుచేయుపని నొకనికే యిచ్చెను. నిర్ణీత కార్యమును ముగింతునను నమ్మకము లేకపోయినను బనికిఁ బూనుకొని సంజవేళ కంతయు ముగించెను. పార్వ్రత్తె కాఁడదిచూచి యోర్వలేక నా కష్టజీవికి నల్వురుచేయు పని నీయ నిశ్చయించు కొనెను.

ఎమిలిన్ నిజవాసంబున కిరిగెను. గృహిణి యిల్లంతయు నూడ్చి శుభ్రపఱచి, వంటకము జేసి, బల్ల యొద్ద గూరుచుండి కుట్టుపని సేయుచు, ధవుని రాకకై నిరీక్షించు చుండెను. అతఁడు రాగానే యెదురేగి తోడ్కొనివచ్చి, సిద్ధమయిన వంటకములను బల్లపై నుంచి యాతని భుజింప జేసెను. తరువాత పని విషయమై యాతని బ్రశ్నింప నందున కతఁడు 'ఆ! వారు నాకు చాల కష్టమైన పనుల నిచ్చుచున్నారు.' అని పలవించెను. దానికామె యధైర్యము నొందక 'పనిని గుఱించి నీవు చీకాకు నొందకుము. ఎంతపని చేసితిని, ఇఁక ముందెంత చేయవలెను అని వెనుక ముందు జూడక నేకాగ్రచిత్తుఁడవై, కార్య తత్పరుఁడవైనచో నంతయు

సరిపోవును.' అని హితముసెప్ప నతఁడు శాంత మన స్కుఁడై పవళించి నిదురవోయెను.

మరునాఁడు తెల్లవారగనే ఎమిలిన్ తన విధికృత్యమును నిర్వహింప వెడలెను. నగరు చేరఁగనే తనకు నల్పతర పనిని నియోగింపఁ బడియుండుట నెఱింగి కొంత చింతించెను. అయినను గాలయాపనము సేయక పనిలోఁ బ్రవేశించెను. ఏమి యాశ్చర్యము! సూర్యుడస్తంగతుడఁగు సరికి కృత కృత్యుండై స్వగృహమునకు రాఁగలిగెను.

ఇట్లొక వారము గడచిపోయెను. పార్థివుఁడతనిని మోటు పనులచేఁ బీచమడంచుట కానిపని అని తలంచెను. అందుచే నాతనికి నిపుణ కార్యములను నియోగించెను. వానిని నయిత మతఁడవలీల నిర్వహించుచు వచ్చెను. వడ్రింగిపని, గృహ నిర్మాణకార్యము, శిల్పికర్మ మున్నగువాని నన్నింటిని నీళ్ళు దాగినట్లు నిర్వహించుచు వచ్చెను. ఇట్లింకొక వారముగూడ గడచిపోయెను. రాజున కమిత కోపము గలిగెను. సేవకులను బిలిపించి యాతండు 'మీకన్నము బెట్టి సాకుట రిత్త. రెండు వారములు కడచి పోయెను. అయినను మీ రేమియుఁ జేయలేదు. ఎమిలిన్నుఁ జేతల చేతనే సదమదం బొనరించెదమని యంటిరే, అయిన నతఁడు ప్రతిదినము సంధ్యాకాలమగు సరికి నియమిత కార్యము

లను సమగ్రముగఁ జేసినైచి యాహ్లాద సూచకముగఁ బాటలు పాడుకొనుచు నింటికిఁ బోవుచుండుట నేను కన్నులారఁ గాంచుచున్నాను. నన్ను మీరొక వెంగలిగా భావించి నట్లున్నది. నేను మీకుఁ దగిన శిక్ష జేసెద.' అని కట కటంబడి పలుక వారు భీత మనస్కులై "స్వామీ! మాచేత నయినదంతయుఁ జేసితిమి. మోకు పనులనిచ్చి పరిమార్ప యత్నించితిమి. నిరర్థక మాయెను. ఆపై జాణపనులనిచ్చి చూచితిమి. అవికూడ నతనికి దుస్సాధ్యము కాలేదు. అదెట్లు చేయుచున్నాఁడో యెవరికిని దెలియదు. అతనికో లేక యతనిభార్యకో మంత్రశక్తియొకటి యుండవలెను. అయ్యది వారికిఁ దోడ్పడు చుండునని భావించెదము. ఈసారి అమానుష కార్యము నొకటిని గనిపట్టి యతని కొసంగునట్లు చేయుదుము. క్షమింపుడు." అని నుడువ రాజు వల్లెయని శుద్ధాంతంబున కరిగెను. కొంతసేపైన పిదప నాభృత్యులొక యోచన చేసి మహీధవుని సమీపించి 'మహాప్రభూ! ఎమిలిన్నను బిలిపించి ఒక్కదినమునందే సౌధనిస్సరణము నందొక గొప్ప దేవాలయమును నిర్మింప వలయునని శాసింపుము. దాని నతఁడు నిర్వహింపఁజాలక పోయెనా, ఉత్తర క్షణముననే ఆతనిపై యవిధేయత జూపెనను నేరము మోపి శిరచ్ఛేదనము గావింపుము." అని సలహా నిచ్చిరి.

అంత నా పృథ్వీశుండు కర్మశీలుండైన ఎమిలిన్నను బిలిపించి తననూతన శాసనము నాతని కెఱిఁగించెను. 'నీ వీ పనిని రేపు సాయంసమయములోపల నెరవేర్పక పోయినచో నీతల నీయొడలిపై నుండదు' అని నుడువ నా యభాగ్యుండు ఖిన్నవదనుఁడై స్వగృహమునకు వెడలిపోయెను. ఇల్లుచేరగనే నిజజాయ యొద్దకరిగి 'నాకంత్యకాలము సమీపించినది. వింటివా, రాజాజ్ఞ. నే నొక్క దినమునందే గొప్ప దేవాలయము నిర్మింప వలయునఁట! తప్పినచో, శిరచ్ఛేదము చేయించునట. మనము పలాయితులౌదము. అది యొకటియే మనకు శరణ్యము. లెమ్ము, సిద్ధముకమ్ము' అని నుడువ నందునకామె 'ఎందులకంత భీతిలుచున్నారు? రాజున కెందఱు భృత్యులున్నారు? మన మెచ్చటి కురికినను వెతకిబట్టి తెత్తురు. వారిబారినుండి మనము దప్పించు కొనలేము. శక్తియుండువఱకు విధేయులై యాజ్ఞా పాలన మొనరింతము' అని ధైర్యము చెప్పెను. అందున కతఁడు 'శక్తికి మీరిన పనులనిచ్చిన నేనెట్లు విధేయతఁ జూపగలను?' అని ప్రశ్నింప నామె 'ప్రాణేశా! అధైర్యమున కెడమీయకుము. సాపడి నిదురఁబొమ్ము. తెల్లవారగు సరికంతయు సరిపోవును' అని యూరడించెను. ఆపై నతఁడు భుజించి, శాంతచిత్తుఁడై పరుండి నిద్రించెను. అతని భార్య ప్రభాతమగుటకుమున్నే నిజ

వల్లభుని లేపి 'వేగిరపొమ్ము. దేవాలయము సిద్ధమయి నది. ఇచ్చ టచ్చట గొన్ని ములుకులఁ గొట్టవలయును. ఆపనిని ముగింపుము. ఒకనాటి పనిమాత్రము శేష ముగ నున్నది' అని నుడివి వలసిన యుపకరణములనిచ్చి సత్వరముగ నుగని నంపెను.

ఎమిలిక్ రాజ హర్మ్యమును సమీపించెను. దాని ముందుపడిన విశాలస్థలము నందొక గొప్ప దేవా లయము నిర్మింపఁబడియుండెను. అది యింకను, సంపూర్ణస్థితికి వచ్చియుండలేదు. ఆ కార్యశీలుడు సంజవేళకు దానిని పూర్తిచేసినైచెను.

రాజు నిదురపోయి లేచి, తన యంతఃపురము నుండి కిటికీలోఁ జూచెను, దేవాలయ మొకటి యుద్భ వింపఁబడ్డదియై యుండుటయు, ఎమిలిక్ ములుకులను గొట్టుచుండుటయు గాంచెను. దుఃఖితుఁడై ఆ రాజు ఎమిలిన్నును ఒరలోకమునకంపి అతని భార్య నపహరింప వీలు లేకపోయెకదా అని వగఁచి బంటులను బిలపించి 'ఇదిగో చూడుఁడు! ఈ యమానుష కార్యమును సహి తము వాఁడు నిర్వహించి యున్నాఁడు. మీరింతకంటె గష్టమెయుండు పని నియమించితిరా మీరు బ్రతికితిరి. లేనిచో, వీనితోఁగూడ మిమ్ము నరికి వేయించెద' అని కూ్రరాజ్ఞ చేసెను. పదపడి రాజభటులు దీర్ఘా

లోచన గావించి యొక పన్నుగడను బన్ని, దొరయొద్ద కరుదెంచి మహాస్వామీ! 'ఈసారి యెమిలిన్నను బిలిపించి నగరుచుట్టును నావల పడవలతోఁ గూడిన నదినొకటిని నిర్మింపుమని, యాజ్ఞచేయుఁడు. అతఁడు దాని నిర్వహణమునందుఁ దప్పుట ఖండితము. అవిధేయతఁ జూపెనను మిషతో నతని తల నరికివేయింపుఁడు' అని విన్నవించిరి. రాజట్లే వానిని బిలిపించి, "ఓరీ! నీకొక నూతన కార్యమును నియమించి యున్నాను. గొప్ప దేవాలయము నొక రాత్రిలో నిర్మింపఁగలిగిన, కర్మఠుండవైన నీకీ కార్యము కష్టము కాదు. రేపటిలోపల నగరుచుట్టును నొక నదియు దానిలో తెప్పలోడలును నిర్మింపవలయును. లేనిచో నిన్ను యమపురికంపెదను' అని వక్కాణించెను. ఎమిలిన్ మొగము వెలవెలఁబోయెను. బిరబిర నింటికివచ్చెను. భర్త ముఖము వాడియుండుటఁగాంచి గృహిణి 'ఏమి! రాజు మఱేదైన క్రొత్తకార్యమును నియమించెనా?' అని యడుగ నందున కతఁడు 'ఈసారి తెగువవహించి తప్పక మనము కాళ్ళకు బుద్ధి సెప్పవలయు. వింటివా రాజాజ్ఞ? ఒక్క దినములో నావలు పడవలతోఁ గూడిన నదీ నిర్మాణ మొనరింపవలయునఁట. లేనిచో, నాతల నరికి వేయించెడివాడఁట. తప్పులేకయే నా ప్రాణమును గోల్పోవలసి వచ్చును. లెమ్ము సిద్ధముకమ్ము.

ఎందైన తలఁదాచి కొందము' అని యాతురముతోఁ బలుకఁగ నామె 'మీ మాటలు నాకు హృదయంగమముగా లేవు. క్షమింపుడు. రాజసైనికులనుండి దప్పించుకొనుట కానిపని. మన మెచ్చట తలదాచికొన్నను వారు వెదకిపట్టి తెత్తురు. ఆజ్ఞాధారణముదప్ప వేరు తెరువే గనుపింపదు.' నావుఁడు, 'ఆజ్ఞాపాలన మెట్లు సాధ్యమగును?' అని యా కార్మికుండు చిడిముడిపడి యడిగెను. అందున కామె 'ప్రాణనాథా! అధైర్యము వహింపకుము. శాంతచిత్తులై భుజించి పరుండి నిదుర బొందుము. తెల్లవారికి లేచి పోయిచూడుఁడు. నియమిత కార్యము నిర్ణీత సమయమునకే యయియుండును' అని యూరడించి భోజనమారగింపఁ జేసెను. ఆ రాత్రికూడ నతఁడు నిమ్మళమైన మనంబుతో శయనించెను. అరుణోదయము కాకమునుపే, ఆతని భార్య నిదురనుండి లేపి 'లెండు నగరమునకు బొండు. అంతయు సిద్ధమై యున్నది. సౌధంబున కెదురుగా నించుక యున్నత ప్రదేశంబును సమ ప్రదేశంబుగావించిన మీ కార్యము పూర్తియగును' అని నుడివి ఖనిత్రము నిచ్చి పంపెను.

పుడమి ఱేఁడు ప్రాతఃకాలమున లేచి నగరు చుట్టును జూచెను. క్రొత్తగ నదియొకటి లోచన గోచరం బయ్యెను. తెప్పలోడలు పైకి దిగువకు వచ్చుచు

బోవుచుండెను. ఎమిలి నొక్క మిఱ్ఱును బడగొట్టి సమము చేయుచుండెను. భూవల్లభుం డిది యంతయుఁ గాంచి యాశ్చర్య చకితుఁడయ్యెను. అయిన నా నది కాని, తెప్పలోడలు కాని యతని కానందావహము లుగ నుండలేదు. ఎమిలిన్నను రూపుమాపుటకుఁ గారణము చిక్కకఁబోయె కదా అని వ్యాకులతఁ జెందెను. కింకరులను బిలపించి 'వీఁడు చేయని పనియే లేనట్టు తోఁచుచున్నది! త్వష్టృనిపని, లేపకునిపని, శిల్పిపని, అన్నిటిలోను దక్షుఁడు. మీ రీసారి వీనికి దుస్సాధ్యమైన కార్యమును గనిపట్టి తీరవలయును.' అని యాజ్ఞాపించెను.

అంత నా యనుచరులు చింతించి చింతించి యొక తెరవును గనిపెట్టి, నరపాలునియొద్ద కరుగుఁదెంచి, యతనికిఁ బ్రణమిల్లి యిట్లనిరి. 'రాజేంద్రా! ఈసారి మేము చాలబుద్ధి నుపయోగించి ఒక మంచియుపాయమును గనిపట్టియున్నాము. దాని నిర్వహణములో, మీచేతి కతఁడు చిక్కఁబడుట నిక్కువము. ఆతని కీసారి మరణము ధ్రువము.' అని నుడువ నా క్ష్మాపాలుం డాతురముతో 'అట్టిపని యెద్ది? వేగర నివేదింపుడు' అని యడుగ వారిట్లు విన్నవించిరి. 'ఎక్కడికో తెలియదు, అక్కడికిఁబొమ్మన. ఏదో తెలియదు, దానిని గొనితెమ్మన.' అని ఆజ్ఞాపింపుడు. వా డెక్కడికిఁ

బోయినను 'నీవు పోవలసిన చోటదికాదు' అనవచ్చును. వాడేమి తెచ్చినను నేను తెమ్మనిన పదార్థమదికాదు' అనవచ్చును. ఈ పనిలో నతఁడవిధేయతఁ జూపక తప్పదు; వాని శిరచ్ఛేదన మొనరించి మీ యభీష్టమును నెరవేర్చుకొనవచ్చును." అని మనవిజేసిరి.

ఉర్వీశుం డీయుక్తి చాల బాగున్నదని యుబ్బి పోయెను. ఎమిలిన్నును బిలిపించి 'ఓరీ! ఈసారి నీకొక చక్కని కార్యమును నియమింతును. ఎక్కడికో తెలియదు, అక్కడికిఁ బొమ్ము. ఏదో తెలియదు, దానిని గొని తెమ్ము. నీకు మూఁడుదినములు వ్యవధి నిచ్చియున్నాను. ఈ పనిని నీవు చేయనిచో నీ శిరశ్ఛేదన మొనరింతును. పొమ్ము, శీఘ్రముగాఁ బొమ్ము' అని క్రూరాజ్ఞ చేసెను.

ఈ సంకులాజ్ఞ వినినతోడనే యతఁడు చింతాంబుధి మునింగెను. భార్య రూపవతియైనచో శత్రువుగాఁ బరిణమించునను నుడి నేడు నిజమయ్యెకదా అని విలపించెను. కష్టముతో నిల్లువచ్చిచేరి తన యర్ధాంగితో నంతయు జెప్పెను. ఈసారి యా ధీమతికూడ యోచింప మొదలిడెను. కొంతసేపైన పిదప 'కాని మంచిది. రాజభటులెట్లైన నిన్నుఁ జిక్కించుకొననెంచి వారు తమ యేలిక కీయుక్తిని నేర్పియున్నారు. ఇప్పుడు మనము

చాల జాగరూకతతో మెలంగవలయును.' అని నుడివి భర్త కీతెఱంగున నుపదేశించెను. 'ప్రాణకాంతా! ఈసారి నీవు చాల దవ్వరుగవలయును. హాలిక సైనికుల కుభయులకును జనయిత్రీస్థానంబున నుండు వృద్ధ మాతను సాహాయ్యమొనరింపుమని వేడుము. ఆ లోక జనని నీకుఁ దోడ్పడెనా, మనము బ్రతికితిమి. లేదా చెడితిమి. అన్వేషిత వస్తువును నీవు పొందగలిగినచో జక్కఁగ రాచ నగరమునకురమ్ము. నేనందే యుండ వలసివచ్చును. వారెల్లనను నన్ను నిర్బంధించి ఈసారి గొంపోదురు. అయిన నీనిర్బంధ మెంతకాలముండును! లోకమాత చెప్పినదంతయు తు, చ, తప్పకుండ నొన రింపుము.' అని యా పతివ్రతాలలామ నుడివి యాతని ప్రయాణమునకు సిద్ధపఱచెను. ఆహార సామగ్రులతోఁ గూడిన నొక తిత్తియు, దానితోఁగూడ నొక కదురును ఇచ్చి, 'ఈ కదురు నా వృద్ధమాతకిమ్ము. అప్పు డామె నీవు నా పెనిమిటియని గుర్తించును' అని చెప్పి పోవలసినత్రోవ సహితము చూపెను.

ఎమిలిన్ పయానమాయెను. ఊరంతయు గడచి పోయెను. పురాంతంబున నుండు నొక విశాల స్థలము నందు గాలరులు వ్యాయామము సేయుచుండుటగాంచెను. అచ్చటనే నిలచి వారిని జాగరూకతతోఁ జూచెను. కొంతసేపైన పిదప నా పదాతులు శరీర వ్యాయామ

మును జాలించి విశ్రమించుకొనుచుండిరి. అంత ఎమిలీ వారిని సమీపించి 'అన్నలారా! నాకించుక సాహాయ్య మొనరించెదరా? ఎక్కడికో తెలియ దక్కడికిఁ బోవుటకు త్రోవయేది? ఏదో తెలియ దద్దానిని గొనితెచ్చుటెట్లు?' అని యడిగెను. వారీమాటల నతిశ్రద్ధగో నాలకించి తుదకు 'ఈపనిమీద నిన్నెవ్వరంపిరి' అనియడుగ నందున కతఁడు 'రాజు' అని బదులిడెను. అంత వారు 'మేమే ఎక్కడికో తెలియము, అక్కడి కరుగుచున్నాము. ఏదో తెలియదు, అద్దానిని వెతకుచున్నాము. కాన మేమెట్టి సాహాయ్యమును నీకుఁ జేయఁజాలము' అని నుడివిరి. ఎమిలీ కొంతసే పచ్చటనే యుండి యావల ప్రయాణోన్ముఖుఁ డాయెను. చాల దూరము నడచెను. మార్గాయాసముచేఁ గాళ్ళు పోతెను. అయినను గాళ్ళ నీడ్చుకొని ముందునకు సాగెను. మధ్యాహ్న సమయంబున నొకచెట్టు పంచఁజేరి తన యిల్లాలిచ్చి యుండిన తిండి పదార్థములను మెసవి చేరువనుండిన యొక సరోవరంబున నీళ్ళుత్రాగి మరల త్రోవ నడువ నారంభించెను. ఆ మహారణ్య మధ్యంబున నొక కుటీరము దృగ్గోచర మయ్యెను. అచ్చటి కతఁ డరిగి దానిలోఁ బ్రవేశించెను. లోపల నొక ముసలమ్మ గూరుచుండి యుండుటయు నామెకంటఁ దడిపెట్టుకొను చుండుటయు గాంచెను. ఆమె నూలును వడుకు చుండెను. వడుకునపు డా

వృద్ధురాలు తన వ్రేలిని నాలుకపై నుంచి తేమ జేసి కొనుటకు మారుగ కంటి దిగువనుంచి కన్నీళ్ళతోఁ దడుపుకొను చుండెను. ఎమిలిన్నను జూచిన తత్ క్షణమే ఆ వృద్ధ స్త్రీ చిరాకు నంది 'ఇంచేల వచ్చితివి' అని యాతని గద్దించెను.

ఎమిలిన్ తాఁదెచ్చిన కదురు నామె చేతికియ్యగా నుత్తరక్షణముననే నా వృద్ధ దయార్ద్ర హృదయమై యాతని గూరుచుండఁబెట్టి కుశల ప్రశ్నలనడిగి పిదప నతని భుజింపఁజేసి వచ్చినపని యేమియని యడిగెను. అప్పు డతఁడు నిజ జీవనచరిత్రములోని ముఖ్యాంశంబుల నంతయు నామెకు నివేదించెను. తా నుద్వాహంబయిన వృత్తాంతంబును భార్యాభర్త లిరువురునుఁ బట్టణ నివా సం బవలంబించిన చందంబును కష్టపడి పొట్ట పోసుకొను మండిన రీతిని, పుడమిరేడు ప్రాసాదంబున తన్ను వైతనికునిగా నియమించిన విధంబును, అందు రాజాజ్ఞచేఁ గష్ట కార్యములను, దుస్సాధ్య కార్యములను, అమానుష కార్యములనుగూడఁ జేయించిన తెఱంగును, తుదకు భూకాంతుండు 'ఎక్కడికో తెలియ దక్కడికి పొమ్ము, ఏదో తెలియదద్దానిని గొనితెమ్ము' అని చెప్పిపంపిన దినునును, నిజభార్య ధైర్యమిచ్చి కర్షక సైనికుల కిరువురకును దల్లియగు తన్నుఁజూచి దోడడుగు డని యుపదేశించిన విధంబును, పుట భేదనంబున కీవల

నుండిన విశాల స్థలమునం దుండిన సైనికులను దా నన్వేషిత పదార్థమునుఁ బొందుటకు మార్గమెద్దియని యడిగినవితానమును, వారిచ్చిన ప్రత్యుత్తరమును అంతయు సమగ్రముగ నామె కెరుకపఱచెను. ఈ విషయముల నామె సావధానముతో విని దుఃఖమును మరలించుకొని 'నిజముగ నాయతమాసన్న మయినది' అని లోహాలించి 'మంచిది, కుఱ్ఱవాడా, నీవు భయపడ వలదు. ఇదిగో ఈ నూలుచెండును నీముందు దొరలించి అది పోవుమార్గంబు నందే నీవును బోవుము. చాల దవ్వరిగిన పిదప మీరు సముద్రపు టొడ్డును జేరుదురు. అందొక గొప్ప పట్టణమును గాంతువు. ఆ పట్టణాం తంబున నుండు మేడలో నొక రాత్రి బసచేయుము. వెదుక వచ్చిన పదార్థమునకై అచ్చటగనిపట్టుకొని యుండుము. నీ కది లభ్యమగును' అని నుడివి యావృద్ధమాత యాతని కారాత్రి యాతిథ్యమిచ్చి సత్కరించెను. మరునా డతఁడు తెల్లవారగనే లేచి వృద్ధజనని సెలవుగైకొని తన ప్రయాణ మారంభించెను. అంతలో నాతనికొక సందియ మంకు రింప వెనుకకువచ్చి, యా ముసలమ్మను సమీపించి 'అమ్మా! నాకు లభించిన వస్తువును, వెతకఁబోయిన వస్తువదియే యని ఎట్లు గుర్తించ వలయును?' అని ప్రశ్నింప నందున కామె 'తల్లిదండ్రుల వాక్కులకంటె నెక్కుడు ప్రాముఖ్యమును వహించి తనయులనుండి

యెద్ది విధేయతను సంగ్రహించునో అదియే యది' అని దగ్గుత్తికతో వేడినట్టూప్పు నిగుడించి, యించుక మిన్న కుండి మఱల ఆవస్తువు దొరకినంతనే నేరుగ దొరయొద్ద కరిగి యన్వేషిత వస్తువును దెచ్చినానని చూపుము. రాజది కాదనును. పిదప నీవు 'సరియైన వస్తువిది కానిచో దానిని కట్టెలతోఁ జక్కగ మోదవలయును' అని దానిని బ్రద్దలుచేసి నదీజలంబులఁ బడవేయుము. ఆవల నీవు నీభార్యను గలిసికొందువు. నా బాష్పకణము లెండిపోవును" అని చెప్పి 'నీకు భద్రమగుగాక' అని యాశీర్వదించి యాతని గొంతదూరము సాగనంపి తాను వెనుకకు మరలెను.

అంతనాఁ గృషీకుండు వృద్ధమాత వాక్యానుసారముగ నూలుచెండును తనముందు దొరలించి తద్దనుగామియై పోవుచుండెను. అది దొరలి దొరలి తుదకు సముద్రతీరము జేరెను. అందొక మహానగరము ఇంచుక దూరములో నుండెను. ఎమిలిన్నా ఆనగర ప్రవేశ మొనరించి వీధులెల్ల గడచి, కడఁగొట్టుననుండు మేడలో నొకరాత్రి బస నడుగ, నాగృహస్థుఁడందున కియ్యకొని సమర్యాదగ నాతని కాతిథ్య మొసంగెను. ఎమిలిఁ పరుండి నిదురపోయెను. ప్రభాతము కాగనే యాతనికి మెలకువయ్యెను. ఇంటి యజమానుఁ డభ్యుదితుండైన నిజతనయుని నిద్రనుండి మేల్కొల్పు చుండుటయు, ఆ

కుఱ్ఱవాని నతఁడడవికిఁబోయి వంట చెఱుకును దెమ్మను చుండుటయు ఎమిలిన్న వినెను. కొడుకు తండ్రిమాటలను సద్దుచేయలేక. 'ఇంత వేగరనే లెమ్మనుచున్నావా? ఇంకను చాల పొద్దున్నది!' అని యస్పష్ట వాక్యముల నుచ్చరించి, వెండియు నిదురఁబోవ మొదలిడెను. పదపడి నా యువకుని తల్లి 'నాయనా! లెమ్ము లెమ్ము ప్రొద్దైనది. వారినే కట్టెలకు బంపవలయునని నీ యిష్టమా! మీతండ్రి యొడలు నొచ్చుచున్నది. లేవుము' అని కొడుకును వేడుకొనుచుండుటయు, ఎందున కతఁడు చిడిముడిపడి ఆమెను గద్దించి మఱల నిదురబోవుటయు ఎమిలిన్న గాంచెను. అంతలో వీధియందొక మేఘ ఘర్జనమునఁబోలు శబ్దమాయెను. నిదురఁబోవుచుండిన కుఱ్ఱవాడు గ్రక్కునఁ బాన్పునుండి లేచి దుస్తులను ధరించి వీధిలోనికిఁ బరుగిడెను. ఎమిలిన్ వాని చర్యను గాంచి, తల్లిదండ్రుల మాటలను సరకుగొనక నిదురించిన బాలుఁడు ఈ గుడుగు శబ్దము చేయుచుండిన దానికె యవిచ్ఛిన్న భక్తి విధేయతలను జూపి యుండుటను గ్రహించి, తా వెదకవచ్చిన వస్తువదియే యుండునని భావించి, తానును వీధి గుమ్మమునఁబడి యా కుఱ్ఱవాని వెంబడి పరుగిడెను. ఎవ్వడో ఒకడొక గుండ్రని పదార్థమును తన నడుమునకు గట్టుకొని కఱ్ఱలతో దానిని మోదుచుండెను. ఉరుము శబ్దముచేసిన దీపదార్థమే.

జననీ జనకుల వాక్కులకంటె నెక్కువమై తనయుని విధే యతను గ్రహించిన దీ వస్తువే. ఎమిలిక్ దానిచెంత కరిగి జాగరూకతతోఁ బరికించెను. ఇరువైపులను చర్మముతోఁగూడిన యొక చిన్న గుండ్రని పీపాయివలె నుండెను. ఎమిలిన్ను దానిని మోదుచుండిన వ్యక్తిని 'ఇదియేమి?' అని యడిగెను. అందున కతఁడు 'ఇది ఢక్క' అని ప్రత్యుత్తరమిచ్చెను. 'దీనిలో నేమున్నది?' అని యడిగెను. 'ఏమియును లేదు' అని బదులిడెను. ఎమిలినాశ్చర్యచకితుఁడాయెను. 'అది నాకిత్తువా?' అని యడిగెను. అందున కతఁడియ్యకొన లేదు. ఎమిలిక్ అతనిని వాపోవుటమాని యతఁడుపోయిన చోటులకెల్లఁ దానును వెంటనే పోయెను. ఒక దినమంతయు నిట్లతని వెన్నాడిన పిదప, నిదురఁబోవ నాతం డొక చోట బరుండెను. ఎమిలిక్ ఆ యదనుచూచి గొబ్బున నా ఢక్కను లాగుకొని యురికెను. చక్కఁగాఁ దానుండిన పత్తనమునకువచ్చి నిజవాస స్థానంబునకువెళ్ళి, యందుభార్యను వెదకఁగా నామె యగుపడలేదు. ఎమిలిక్ ఇల్లు విడిచిన మరునాడే రాజామెను (తన పాతివ్రత్యమును గాపాడుకొనుచు నియమిత కాలంబైన మూఁడు దినములలో మగని రాకకై యెదురుచూచు చుండెను. స్వగృహంబున భార్యను గానక, ఎమిలిక్ రాజసౌధంబున కరిగి యచ్చట నామె నిర్బంధితయై యుంట నెఱింగెను. అంత

నతఁడు అంతర్వంశికునియొద్ద కరిగి తెలియని చోటునకుఁ బంపబడినవాడును, తెలియని పదార్థమును దెమ్మని యనుపబడినవాడును వచ్చి యున్నాడనియు రాజునకు వలసిన పదార్థమునుదెచ్చి వాకిటియొద్ద నిలచియున్నాడనియు చెప్పి పంపెను. అంత వసుధాధిపుండు ఎమిలిన్నను మరునాడు రావలసినదని సందేశ మంపెను. నిరాకృతుండై నను ఎదఁగుందక నా కృషికుండు 'నే నీ దినంబుననే వలసిన వస్తువును దెచ్చినాననియు, పుడమిరేడు నాయొద్దకు రానిచో నేనే యుతనియొద్ద కరుగు వాఁడ ననియు ఆతనికి నివేదింపుము' అని వెండియుఁ జెప్పి పంపెను. రా జంతట విధిలేక బయటికివచ్చి 'ఎక్కడికి పోయియుంటివి?' అని యడిగెను. ఎమిలిన్ తాఁ బోయిన చోటు నెరింగించెను. వసుంధరాధిపుం డంత 'నే బొమ్మనిన చోటది కాదు' అనెను. తరువాత 'ఏమి తెచ్చినావు?' అని ప్రశ్నింప, ఎమిలిన్ థక్కాను జూపించెను. భూవల్లభుండు దానిని జూడనైనఁ జూడక 'నేఁ దెమ్మనిన దదికాదు' అని మొగము ద్రిప్పుకొనెను. ధిక్కృతుండైన నాదిట్ట 'సరియైన పదార్థమిది కానిచో దీనిని బ్రద్దలుచేసి దయ్యమునకుఁ బారవేయ వలయును.' అని బదులిడి, దానిని కఱ్ఱలతో మోగించుచు నది వంక కరిగెను. ఆ భేరీ నినాదంబు చెవిఁజొచ్చిన తోడనే రాజసైనికు లందఱు ఎమిలిన్నని యొద్దకువచ్చి యాతనికి

బోహారు లొనరించి వెంబడించిరి. ఎమిలిఁ ఏమియాజ్ఞ చేయునో అని నిరీక్షణా సూచకములైన దృష్టులతో నాతనిఁ జూచుచుండిరి.

అంతట నా మహీధవుండు సైన్య రహితుండై బలమేవైపు తిరిగెనో కనుగొనెను. అతనికి జ్ఞానోదయం బాయెను. సైనికులవైపు తిరిగి "మీరు ఎమిలిఁ వెంట పోవకుడని బిగ్గరగా నఱచెను. నిరర్ధకమాయెను. రణభేరీప్రభావ మేమనవలయును! వసుధేశుం డంతట వక్త్రము చెడియుంటను గ్రహించి, ఎమిలిన్నని సతి నాతనికి వెనుక కిచ్చివేసెదననియు, నారణభేరి నాతని కియ్యవలయుననియు సందేశ మంపెను. ఎమిలినా మాటలను గమనింపక 'ఈ ఢక్కను ప్రక్కలించి నదిలోఁ బడవేయ వలయునని నాకాజ్ఞ యయినది' అని నుడివి దానిని బ్రద్దలుచేసి నదీజలంబులలోఁ బడవేసెను. ఆ పిదప వెంటనుండిన యుద్ధభటు లందఱు పారిపోయిరి. మహీపతి యంతట ఎమిలిఁ ఇల్లాలిని నిర్బంధ విముక్తి గావించి యతని కప్పగించెను. అప్పటినుండి యామహీ పాలుండు పరదారాపేక్షను మాని సద్వర్తనుఁడుగా మెలంగు చుండెను. ఎమిలిఁ భార్యా సమేతుఁడై సుఖముగ సంసారముచేయుచు వర్ధిల్లు చుండెను.

# దయయే దైవము

పూర్వము రష్యాదేశమునందొక పట్టణంబున, మార్టిన్ నాఁబడు చర్మకారుఁ డొకఁడుండెను. అతని యిల్లు చాల చిన్నదై వెలుపలి రాచబాటకంటెఁ తగ్గు ప్రదేశము నందుండెను. దానికి పిన్నవైపున నొక కిటికి యుండెను. మార్టిన్ చర్మకర్మను జేయుచు వచ్చుచుఁబోవుచున్న వారి నా గవాక్షమునుండి యప్పుడప్పుడు తలయెత్తి చూచుచుండెను. నివాసము తగ్గు ప్రదేశమునందుండుటచే నాత్రోవ నడచువారి పాదములు మాత్రమే యతనికి లోచన గోచరంబులగుచుండెను. మార్టిన్ చాలచురుకు బుద్ధిగలవాఁడు. అందు వచ్చుచు బోవుచుండు పాదచారులను వారి పాదరక్షల మూలముననే యానవాలు పట్టుచుండెను. తాఁజేసిన పాదుకల నతఁడొక క్షణములో గుర్తించుచుండెను. బహుకాలమునుండి యందే యతఁడు నివసించు చుండుటచేఁ జుట్టుపట్లనుండు వారిలో నతని కపరిచితు లెవ్వరునులేరు. కనిష్టపక్ష మొకటి రెండుసారులైన వాని పాదుక లీతని జేతికి వచ్చియుండెను. కొన్నిఁటికి నడుగు భాగము గట్టియుండెను. మఱికొన్నిఁటికి రంధ్రము

లను గుట్టి యుండెను. ఎల్లప్పుడును శ్రేష్ఠమైన చర్మమునే యుపయోగించుచు, శ్రద్ధా భక్తులతో నతిభద్రముగా నతఁడు కుట్టుచుండెను. ఇంతియుగాక యతఁడు పణమునధికముగ నడుగక చాల మితముగఁ గష్టమునకు దగినంత మాత్రమే గైకొనుచుండెను. దానంజేసి యా గొడగరవాఁడు బహుజన పరిచితుఁడై ప్రీతిపాత్రుఁడై యుండెను. ఇంకొక విశేషము! అతఁ డెప్పటికిని, మాట తప్పి నడచుచుండలేదు. నియమిత కాలమునకు సరిగఁ బనిని ముగింపఁ గలిగిననే, యాతడు పనిని గైకొను చుండెనుగాని, యూరకే యాశతో నందఱకును మాటయిచ్చి పనులను బుచ్చుకొనుచుంట లేదు. అందుచే నాతని పని యెప్పుడును గొఱవడు చుండలేదు.

మార్టిన్ సుహృదయుండన్న పైఁ జెప్పఁబడిన సంగతులవలన విశదమగుచున్నది గదా! ముదిమి సమీపించుచుండినట్లెల్ల నాతఁడు జీవాత్మను, బరమాత్మను గుఱించి యోచింప మొదలిడెను. మధ్యవయస్సు దాఁటీదాఁటక మునుపే విధురుఁడయ్యెను. ఆతని భార్య యెనమండ్రు బిడ్డలను గనినను మూడేండ్ల బాలు నొకనిఁదప్ప, తక్కిన బిడ్డలను బ్రసూతికాలమునందే పోనాడియుండెను. ఈ చిన్నబిడ్డను దన యక్కయిం టిలోఁ బల్లెలోవిడిచి యందు పెంచవలయునని మార్టిన్

తలంచెను కాని యూవలఁ గొంచమాలోచించి యూ కొత్తవారినడుమ నీ పసికందను వదలుట కతనికి మనస్సు రాలేదు. కాన నతఁడు నిజతనయుని తనయొద్దనే యుంచుకొని పెంచుచుఁ దనవృత్తిని సాగించుచు శాంత మనస్కుఁడై దినములు గడుపుచుండెను.

ఇట్లు దశవర్షంబులు గడచెను. బాలుఁడు శుక్ల పక్షచంద్రుని మాడ్కి దినదిన ప్రవర్ధమానుండై యల్లారుముద్దుగఁ బెరిగి నిజజనకునికిఁ జేదోడు వాదో డుగ మెలంగుచుండెను. బిడ్డల మూలమున నా చర్మ కారునికిఁ గించిన్మాత్రమును సుఖ ముండఁగూడదను తలంపు విధాతృవుకుఁ గలదో యన నా బాలుఁడు జ్వర పీడితుఁడై యొకవారము బరుండియుండి యెనిమిదవ దినమునఁ బరలోకమున కేగెను. చర్మకార హృదయ మున మహత్తైన సంక్షోభ ముత్పన్న మాయెను. ధైర్య సత్త్వము లొక్కటఁదూలెను. నిరాశా పూరి తుఁడయ్యెను. దేవునియందుండిన నమ్మకము సడలెను. "వృద్ధుఁడైన నన్నుఁ గొంపోక పసిబాలుని నేకపుత్రుని గొంపోయిన దైవము దుర్దైవముగాక మఱేమి ?" యని తర్కింపసాగెను. తన్ను వేగిర తీసికొని పొమ్మని మృత్యుదేవతను దీనముగ వేడుచుండెను. తుద కతఁడు నాస్తికుఁడై దేవళమునకరిగి యెప్పటియట్లు దైవప్రార్థన

మొనరించుటకూడ మానుకొనెను.

ఇట్లుండ నొకనాఁడు నిజగ్రామ నివాసియైన వృద్ధ స్నేహితుఁడొకఁడు మార్టిన్నును జూడవచ్చెను. అతఁ డాతని సందర్శించి పండ్రెండేండ్లయి యుండెను. ఈ నడుమఁ దనకు సంభవించిన యాపదల నన్నియును మార్టిన్ ఆతనికి నివేదించి మర్మభేదక మగునట్లు దుఃఖించెను. "మిత్రమా, నే నిక నీ ప్రపంచమున నసువులు నిలుపుకొని మనజాలను. మరణ మెప్పుడు వచ్చునా యని యత్యాతురతతో నెదురుచూచు చున్నాఁడను. అదియొకటే నాకీ ప్రపంచమున మిగిలియుండునది! దేనిపైనను నాకు మమతలేదు. నేను నిరాశా పూరితుఁడనై యీ లోకమునంతయు నొక శ్మశాన వాటికగఁ గాంచుచున్నాఁడను!! దేవుఁడెంతటి చెనఁటి వాఁడు!!! నిజముగ నతఁడు ధర్మపాలకుఁడా!!!! నీవు చెప్పుము?" అని పరిపరివిధముల దేవుని దూఱ నారంభించెను. అంత నా వృద్ధస్నేహితుఁడు తన చెలికాని హృదయంబున నుద్భవించియుండు నాస్తికత్వమును గాంచి వగచి దానినెల్లైన మూలోత్పాటన మొనరింప నెంచి యిట్లనెను. "మార్టిన్ నీవేమో నేడు సరిగా మాటలాడుచుండుటలేదు. అలజడుల కారణముచే నీకు జిత్తవిభ్రమము గలిగినది కాఁబోలు! దేవుని చర్యలపై న్యాయనిర్ణయముల నొనరించి తీర్పునుజెప్ప మన మొం

తేటివారము !! మనకుంచు యల్పజ్ఞానముతో నా మహా
మాహుని రహస్యకార్యములను నుద్దేశములను మన మర్థ
ము జేసికొనఁ గలమా ? నీవు చాల పొరవడినావు సుహా!
నీకొమారుఁడు చావవలయునని యు నీవింకను జీవించి
యుండవలయుననియు దేవుని యిచ్ఛ. అతఁడేదో సదుద్దే
శముతోనే యిట్లొనరించి యుండవలయును. నీ విప్పు
డపుత్రసితుఁడవై చావ నిచ్ఛగించిన శోధిమానవులతో
నెట్టి సంబంధమునులేక స్వసుఖము నపేక్షించి జీవించు
వాఁడవనియు, దేవుని నిర్దేశములయం దవిశ్వాసమును
జూపువాఁడవనియు, కేవల మొక నాస్తికుఁడనియుఁ
దేలుచున్నదికదా ! ఇది నీకుఁదగునే ?" నావుడు,
మార్టిన్ యించుక యలుకఁజెంది "మ రెవ్వరి సుఖము
నకై యేను జీవింపవలయును ?" అన, నావృద్ధుఁడు "నీవు
దేవుని కోసమై జీవింపవలయును. అతఁడు నీకుఁ
బ్రాణముల నొసంగెను. కాన నీ వతనికై పాటుపడ
వలయును. దేవునికొఱకై జీవధారణము చేసినానని
నీవు గ్రహించిన యుత్తరక్షణముననే నీకు జీవయాత్ర
సుగమమై కన్పట్టును. శమదమాది గుణములు నీకల
వడును. తృప్తమనస్కుఁడవై యుందువు." అనవుడు
మార్టిన్నామాటల నాలకించి కొంచెమునే పూరకుండి
పదపడి యిట్లుపలికెను: "నెయ్యుఁడా' దేవునికై
జీవించుట యన నెట్లు ? నాకుఁదెలియదు" నా, నాసన్మా

గ్గుఁడు "మార్టిన్ నీకుఁ జదువనువచ్చునా?" అని యడుగ నందులకతఁడు "వచ్చును" అని బదులిడెను. అంత నా మునలివాఁడు "అట్లైనచో, మొదలు నీవు సువార్తలను గొని పఠియింపుము. అందు దేవునికై మానవుఁడు జీవించుటయనఁగా నెట్లను సంశయము వివరింపఁబడియున్నది." అని వాక్రుచ్చి, మార్టిన్ సెలవుఁగైకొని, వెడలనుద్యుక్తుఁడయ్యెను. తనయింట నాతిథ్యమందుమని మార్టిన్ యెంతవేడినను నతఁడు నిలువఁడాయె. అంత మార్టిన్ యతని నొకింతదూరము వీడుకొలిపి మఱలివచ్చెను. స్నేహితుని హితవాక్యంబు లతనిమనంబున నించుక లోతుగఁ జొచ్చెను. ఆదినమే పెద్ద యక్షరములతో ముద్రింపఁబడిన సువార్తలను గొని చదువ నారంభించెను.

తొలుఁదొల్త నాగ్రంథము నతఁడు సెలవు దినములలో మాత్రము పఠింప వలయునని నిర్దేశించెను. అయినఁ జదువఁగఁ జదువఁగ నందలి ప్రబోధము లత్యంతానంద జనకములై యుండినందున నతఁడు ప్రతి దినమును దానిని బఠియించువాడుక నలవరించుకొనెను. ఒక్కొకరేయి యతఁడు చాలపొద్దు చదువుచుఁ గూరుచుండి యొడ లెఱుంగక తైలాభావముచే దీపమారిపోవు వఱకుఁ బారాయణము చేయుచుండెడివాఁడు! అర్థగ్రహణ మయినకొలఁది నాసక్తి మెండయ్యెను. దేవుని కొఱకు జీవయాత్ర సలుపుటయన నేమో యిప్పుడత

నికిఁ గరతలామలక మాయెను. మొదలు చిత్తమును గలంచిన నిరాశా వ్యాకులత లతనిని వదలి పోయెను. వాని స్థానమునఁ దృప్తియు శాంతియు నెలకొనెను. ఆదియం దతఁడు నిదురయేమో యెఱుఁగక నిజతనయుని స్మరించుచు వేడి నిట్టూర్పులు నిగుడించుచు సెజ్జపైఁ బరుండి రేలంతయు నలమటించుచుండెను. ఇప్పుడన్ననో యతఁడు దేవుని స్మరణజేయుచు నాతని మహిమలను గీర్తించుచు 'హా, దేవా! అంతయు నీ యిచ్ఛప్రకారము జరుగనిమ్ము" అని నిమ్మళమైన మనంబుతో శయనించుచుండెను. అప్పటి నుండియు నాతని జీవయాత్రయందొక గొప్పమార్పు కలిగెను. మున్నతఁడు సత్రములకును ఫలాహార మందిరములకును నేగి యందుఁ దేనీరును కాఫీని దఱుచుగఁ ద్రాగుచుండెడివాఁడు. ఒకొకప్పుడు స్నేహితులతో జతఁ గూడినప్పుడతఁడు ద్రాక్షారసము మున్నగు మత్తు ద్రావకములను నయితము వలదనుచుండలేదు. మద్యపానముచే శౌండుఁడై సంపూర్ణముగఁ బ్రజ్ఞాహీనుఁడు కాకపోయినను నతఁడు పలుమారు తన్మూలమున నావేశముతోను జిత్త విభ్రమముతోను, నస్పష్టములైన మాటాలనాడుచు, పాటలఁబాడుచు, జనులతో నకారణముగ వాగ్వాదములకు దిగుచు, కొన్ని వేళలందుఁ గఠినోక్తులతోఁ గలహించుచు, నిల్లుఁజేరుచుండెను. ఇప్పుడా చెడునడవడు

లన్నియు నాతని వదలిపోయెను. జీవన మతనికిప్పుడు శాంతమయమై సంతృప్తి సంయుతమై సంతోషావహమై యుండెను. దినమంతయుఁ గష్టించి పనిచేయును. రాతిరి వేళలందు 'సువార్తల'ను బఠించి శాంతచిత్తుఁడై నిదుర పోవును.

ఇట్లుండ నొకనాఁడు మార్టిన్ పద్ధతి ప్రకారము రేయి చాలప్రొద్దు మేల్కొని చదువుచు 'లూక్' సాధువు వ్రాసిన సువార్తలలో నారవసంధి కేతెంచెను. అందీ పంక్తుల నతఁడుతిలకించెను. "నిన్నెవ్వఁడైన చెంప మీఁద గట్టిగ నప్పళించిన రెండవ చెంపనుగూడ వానికిఁ జూపుము. నీ యంగ వస్త్రమును గైకొనిన వాఁడు నీ యంగరకమును సయితము లాగుకొన నుద్యుక్తుఁడైనచో నాతని నడ్డగింపకుము. అడిగిన వానికి లేదనకుము. నీ వస్తువులను దీసికొనిన వానిని "నా వస్తువులను వెనుక కిమ్మ"ని యడుగకుము. మఱియు నితరులు నీకే తెఱంగునఁ జేయ నిచ్ఛగింతువో నీవుకూడ నట్లేవారి విషయమై వర్తింపుము" ఆవల నేసు పలికిన నీమాటలం దుండెను. "నన్ను మీరు కర్త కర్తయని పిలుచుచునే నేఁజెప్పినట్లుమాత్రి మేలచేయరు ? నాయొద్ద కరుదెంచి నామాటలువిని వాని నాచరణలో నుంచువాఁ డెవ్వని వలె నున్నాఁడని యెంచితిరి ? అతఁడు శిలాస్తి భార ముతో భద్రముగఁ గట్టబడిన గృహముం బోలును.

ప్రళయకాలమునందుఁ బ్రవాహ మాగ్రహము నన్ని వైపులను జుట్టుకొన్నను నది కదలక చిరస్థాయిమై యుండును. ఏన నావాక్కుల నాలకించియు, వాని నాచరణలోఁ బెట్టనివాఁ డెవ్వనివలె నుండునని తలంతురో, అతఁడిసుకపైఁ గట్టబడిన గృహము చందంబున నున్నాఁడు! ప్రళయ సమయమునందుఁ బ్రవాహ మతి రభసముతోఁ దాకఁగా నది కూలిపోవును. ఆనాశ మెంత మహత్తరమైనది!!"

ఈమాటలను మార్టిక్ పునశ్చరణ మొనరించెను. అవి చాల మనోజ్ఞములుగ నుండెను. కంటియద్దములను దీసి పాత్రముపై నుంచెను. శిరమును కరయుగళములం దుంచి మోచేతులను బల్లపై నూని దీర్ఘాలోచనలో మునింగెను. స్వీయజీవిత మీ మాటల కెంతవఱకు సాదృశ్యమానో చూచుకొనెను. "నీ యిల్లు ఱాతి మీఁదనా, లేక యిసుకమీఁదనా, కట్టఁబడియుండునది?" అని తన్నుదాఁ బ్రశ్నించుకొనెను. "ఱాతిమీఁదనైనచో మంచిదే; యిసుక మీఁదనైనచో నీగతియేమి? చదువునపుడును, వినునపుడును నంతయు నతి సులభముగఁ దోచుచున్నది. దైవాజ్ఞను బరిపాలించుచున్నట్లే యగుపడుచున్నది. అయిన నుత్తరక్షణముననే యజ్ఞానాంధకారమువచ్చి క్రమ్ముకొనును. ఓ దేవా! నాశక్తి కొలఁది ప్రయత్నించెద. నీవు నాకుఁ దోడ్పడుము.

నాకేమో యానందము కలుగుచున్నది. నూతన చైతన్యము వచ్చినట్లున్నది." అని యిత్తెఱంగున నతఁడు పర్యాలోచించుచుఁ, బఠించుచు, నిద్రాకాల మతిక్రమించినను బుస్తకమును వదలకయుండెను. ఆవల నతఁడేడవ సంధికివచ్చెను. ఏసాక శతసైనిక భటాధి పతి గృహంబునకరిగి, విషమావస్థలో నుండిన యాతని సేవకుని రోగమును నివారణ మొనరించి, వానిని బ్రతి కించిన విధంబును, నేకపుత్రమరణమునకై దుఃఖించు చుండిన యొక విధవనుగాంచి యా యబల సంకటమును బోనాడిన చందంబును, స్నాతకుండైన యోహానుని శిష్యుల కా మహామహుండొసంగిన ప్రత్యుత్తరపు ఫక్కిని, పిదప మదముతోఁ ద్రుళ్ళుచున్న ఫరీసాయుని యింటికరిగి యందొక మలిన శీలయైన యంగన భక్తి శ్రద్ధలతోఁ జేసిన సేవనుగైకొని యామెను పాపవిముక్తు రాలుగ జేసినరీతియు, నంతయుఁ జదివెను. ఆ సమయ మునం దేసు నోటనుండి వెలువడిన వాక్కులను బునరు చ్చారణ మొనరించెను. పాపిష్ఠయైన యాయువిదను జూపి సైమన్నుతో నేసు ఇట్లనెనట. "చూచితివా, యాస్త్రీని నేను నీ యింటిలో నడుగిడినపుడు నీవు నా కాళ్ళకు నీళ్ళ నియ్యలేదు. ఈ స్త్రీ యన్ననో తన కన్నీటితో నా పాదములను గడిగి నిజ చికురములతోఁ దుడిచినది. నీవు నన్ను ముద్దిడలేదు. ఈమె యన్ననో, నేనీ గృహాము

బ్రవేశించిన దాదిగా నా పాదములను ముద్దిడుట మాన లేదు. నీవు నాశిరముపై లేపనమును బూయలేదు. ఈ యబల యన్ననో నా పాదములకు లేపనమును బూసి నది." మార్టిన్ ఈ మాటలను మననము జేసెను. తన నేత్రదర్పణములనుదీసి పుస్తకముపై నుంచెను. అవలఁ దనలోఁ దా నీ తెఱంగున దర్కించుకొనెను. "ఈ ఫరీ సాయునివలెనే నేనుకూడ నున్నాను కదా! నావలె నతఁడు స్వసుఖాపేక్షియై తేనీరును ద్రాగుటయు వెచ్చగా హాయిగా బరుండి నిద్రించుటయు మాత్రము గమనిం చెను. ఆగంతుకుని యోచనయే యాతనికిఁ గలుగ దాయె. లోకకర్తయే యా యభ్యాగతుండైనప్పు డిట్టి యనాదరణ మొనరించి పాపమునకు గురియయ్యెను గదా! ఆ పుష్కలుండగు నేను క్రీస్తుకవేళ నా సదన మున కరుగుదెంచినను నేనుకూడ నిట్లే చేయువాఁడను గదా!!" అని పరిపరి విధంబులఁ జింతించుచుఁ జేతులలోఁ దలనుంచుకొని యట్లే మేనెఱుంగక నిదురవోయెను. అంత డబ్బాటున నానిద్రాణుని చెవిలో నెవ్వరో "మార్టిన్" అని పలికినట్లాయె. మార్టిన్ ఉలికిపడి లేచెను. "ఎవరక్కడ" అని బిగ్గరగ నఱచెను. ఎవ్వరును గంటికగుపడలేదు. వీధి వాకిటివైపుఁ జూచెను. అం తయు నిశ్శబ్దముగ నుండెను. కూరుచున్నట్లే మఱల మైమఱచి నిదురించెను. మఱియొకసారి యాతని వీను

లలో "మార్టిన్, మార్టిన్, రేపు వీధి గుమ్మమువైపు నీవు చూచు చుండుము. నేను వచ్చెదను" అను నుడువులు పడెను. మార్టిన్ మేల్కాంచి చుట్టును బరిశీలించెను. కనులను బులిమెను. కుర్చీ నుండి పైకిలేచి యన్నివైపులఁ జూచెను. సద్దు చప్పుడులేదు! శ్రుతవచనంబులు నిక్కువంబుగ నొరులనుండి వెలువడినవా, లేక స్వప్నములోఁ దనమనస్సులోనే యుత్పన్నము లయినవా యని యనుమానించెను. దీపము నార్పి పడకజేరి శయనించెను.

ప్రభాతమాయెను. అప్పుడు చలికాలముగా నుండెను. ఇనుని తేజమును మందగింపఁజేయుచు మంచు మిక్కుటముగఁ బడుచుండెను. వీధిలో జనులు నఖశిఖ పర్యంతము దుస్తులను ధరియించి తమతమ యుద్యోగములపై వెడలుచుండిరి. మార్టిన్ లేచి స్నానాది కృత్యములను ముగించుకొని, దైవప్రార్థన మొనరించి, వంటకమును బ్రారంభించెను. పొయ్యిలో నిప్పునంటించి తేనీటిని యన్నమునుసేయ మొదలిడెను. కోసుగడ్డ పులుసునుజేయ నుద్యుక్తుఁడయ్యెను. చలి కాచుకొనుచు గడ్డను దరుగుచుండెను. ఆతని మనస్సంతయు వెనుకటి రేయి నడచిన సంఘటనలతో నిండియుండెను. నిజముగ నవి యొరుల మాటలా, లేక కలలోని పలుకులా, యిదమిత్థమని నిర్ధరింప లేకపోయెను. "ఇట్టి

సంఘటనలు కూడ నడచినవి" అని యనుకొని తరిగిన గడ్డను మఱొక పాత్రములోనుంచి పొయిమీఁద నిడి పులుసును జేయ మొదలిడెను. పదపడి యతఁ డచటనే యూరకఁ గూరచుండ నెందులకని యోచించి వీధి గవాక్షమున కెదురుగాఁ గూరుచుండి పాదరక్షలను గుట్టుచు నున్నవాఁడై వీధివైపు బలుమారుచూచు చుండెను. అతని కాదినము కృత్తికర్మకంటె నీకార్యమే యతిశయించెను. క్రొత్తపాదుక లగుపడిన ద్విగుణీకృతమైన యౌత్సుక్యముతో వంగివంగి చూచుచు నఖశిఖ పర్యంతము బరిశీలించు చుండెను. మొట్టమొద లా యింటిఁ గావలివాఁడు వచ్చెను. అతఁడు క్రొత్త మేజొళ్ళను దొడిగియుండెను. మార్టిన్ వాని కాళ్ళనే గాక ముఖమును సయితము బరికించెను. ఆవల నీళ్ళవాఁ డరుదెంచెను. ఆ పిదప చినిగిన పాదుకలను ధరియించి యొక వృద్ధుఁడు వచ్చెను. అతఁడు సనికెతో మంచు నూడ్చుచుండెను. అతని పేరు స్టీఫన్. ప్రాయముండినపు డతఁడు సైన్యములో నొక బంటుగా నుండి యిప్పుడు నివృత్తుఁడై యుండెను. ప్రక్కయింటి కావలి వానికిఁ దోడ్పడుచు నతఁడేమైన నిచ్చిన దానితో బొట్టపోసికొను చుండెను. సమీపముననే యొక వర్తకుని గృహములో నుచితముగ నియ్యఁబడిన ఒక చిన్న గదిలో నతఁడు వాసము చేయుచుండెను. మార్టిన్

యింటి ముందఱ నుండిన మంచునంతయు నతఁడు శుభ్రముగ నూడ్చుచుండెను. చలిబాధ కోర్వలేక యతఁడు పనికై నొకప్రక్క గోడకానించి మార్టిన్ యింటి పంచ నొదిగి నిలచి యుండెను. మార్టిన్ అతని నొకటి రెండు సారులు తలయెత్తి చూచెను.

"వీఁడు స్టీఫన్నే కదా! నాకీ వృద్ధాప్యమునందు బుద్ధి వికల్పము గలిగిన ట్లున్నది! స్టీఫన్ మంచునూడ్చుచుండగా నేను క్రైస్తువచ్చెనని తొంగి తొంగి తిలకించుచున్నాను!! నే నెంతటి ముసలిగొడ్డై పోయితి!!!" అని తన్నుఁ దాఁ బరిహాసించుకొనెను. కుట్టుపనిని మఱలఁ బూనెను. అయిన నతఁడు మనస్సు నిలుకడలేమిచే వెండియులేచి తేనీటిని సిద్ధపఱచి గవాక్షముకడ కరిగి చేతితోఁ జప్పుడు చేసెను. స్టీఫన్ తిరిగి చూచెను. మార్టిన్ అతనిని చేతి సన్నతో లోపలికి రమ్మని పిలచి వీధి వాకిలి దీసి "స్టీఫన్ రమ్మా; బిరబిర లోనికిరమ్మా; నీ యంగములన్నియుఁ జలికి వంకరలు పోవుచున్నవే" అని నుడివెను. స్టీఫన్ లోపలికరుగుదెంచి "దేవుడు నీకు మంగళ మొనరించుగాత; నిజముగా నా యెముకలు చలిబాధ సహింపఁజాలక నొచ్చుచున్నవి!!!" అని వక్కాణించి, గడగడ వణకుచు తన పాదముల కంటుకొని యుండిన మంచునంతయు దుడువఁ బోయెను. అయిన

దేహాపటుత్వము చాలమి యట్లు చేయుటలో నతఁడు నేలపైఁ బడిపోవు చుండెను. మాట్రిక్ అతనికి కేలూఁత యొసంగి "నేలను నేనావల శుభ్రపఱచు కొందును లెమ్ము. నీవు త్వరితముగ పోయి ప్రక్కగూరుచుండి చలికాచుకొనుము" అని చెప్పి యతనిని పొయ్యిచెంత గూరుచుండఁ బెట్టెను. ఆవల వీధివాకిలి వేసివచ్చి తే నీటి నొక గిన్నెలోఁబోసి త్రాగుమని వేడెను. తానును నొక గిన్నెలో నా పానీయమును గైకొని త్రాగ మొదలిడెను. స్టీఫన్ వేగిరనే త్రాగివైచి గిన్నను బోరగిలించి పడిన పంచదారముక్కలనుదీసి దానిపైనుంచి కృతజ్ఞతా సూచకములైన చూపుల నతనిపై బ్రసరింప జేసెను. స్టీఫనుని కింకను దృప్తికాలేదని యతని ముఖభావము వలన విశదమగు చుండెను. మాట్రిక్ అతని యింగితము నెఱింగి గిన్నెను సరిగనుంచి తే నీటిని బోసి త్రాగుఁడని వేడెను. స్టీఫన్ దానినికూడ త్రాగివైచి మొదటియట్లే గిన్నను బోరగిలించి చక్కెర ముక్కలనేరి దానిమీఁద నుంచి తన కృతజ్ఞతను దెలిపెను. మాట్రిక్ వీధి గవాక్షమునందు పలుమారు చూచు చుండుటను స్టీఫన్ చూచి "ఏమి? ఎవరినైనను ఎదురు చూచు చున్నావా?" అని యడిగెను. అందుల కతఁడు "స్టీఫన్, యేమిచెప్పుదు! నీకీ సంగతిని దెలుపుటకు నాకు సిగ్గగు చున్నది. నే నెవ్వరిని యెదురుచూచు

చున్నానని ఖండితముగఁ జెప్పలేను. అయిన నిన్న రేయి నా చెవిలో నెవ్వరో "నేను రేపు వచ్చెదను; నాకై చూపెట్టుకొని యుండుము" అనినట్లాయె! ఆ మాటలు నిక్కువంబులా, లేక కలయాయని నిర్ధరింప లేను సుమా!!" అని బదులిడి "మిత్రమా, నీ కేసుక్రీస్తు విషయము తెలిసినదే కదా. నే నెప్పటియట్లు నిన్న రాత్రి 'సువార్త'లను జదువుచు నామహామహాుం డొనరించిన మహిమలను గుఱించి యోచించు చుంటిని. నీవు చదువగలవా?" నా, నావృద్ధుఁడు "నాకుఁ జదువను రాదు. కాని ఏసువిషయమై వినియున్నాను" అని బదులిడెను. పిదప మార్టిన్ "నెయ్యుఁడా, చెప్పెద నాలకింపుము. ఆ జగద్రక్షకుండైన ఏసు ఫరీసాయుని యింటి కొకనాడు పోయెనట. అప్పు డాపాపాత్ముఁ డేసుకు స్వాగతమొసంగుటకు మారుగ నిర్లక్ష్యము నగు పఱచె నట. మానవ ప్రపంచమునే కాపాడవచ్చిన నా తండ్రికి సన్మాన మొసంగవలయునని యాతనికి బుద్ధి వొడమలేదే! ఆతనిచిత్తవృత్తి యెట్టిదో!! నేనే యొక వేళ నాఫరీసాయుని స్థానమునం దుండియుండినచో నా లోకైకనాథుని కెంతగౌరవముఁ జూపియుండినను నయ్యది కొఱవడియే యుండును గదా!!! అట్లే చింతించుచు గూరుచుండి యుండగాఁ గంటికి నిదురపట్టెను. నిద్రలో నెవ్వరో "మార్టిన్" అని పిలచినట్లాయె. ఉలికిపడి

లేచితిని. ఎవ్వరూ కనుపింపరైరి. మగుడ నిదురించితిని. తిరుగ నల్లే "మార్టిన్, నేను రేపువచ్చుచున్నాను; కాచుకొని యుండుము" అను పలుకులు నా వీనులఁ జొచ్చెను. క్రిమ్మఱలేచి నలుదెసలఁ జూచితిని. ఎవ్వరును గానరారైరి. సంగడీఁడా! నీవు నమ్ముదువో, లేవో, ఈమాటలు నాహృదయములోఁ బ్రవేశించినవి. నేనెంత వారించినను ఏసు వచ్చునను తలంపు నన్ను వదలి పోలేదు సుమా!!" అని నివేదించి, మిన్నకుండెను. ఈ యుక్తికార్తనమును వినిన స్త్రీయున్నను మిన్నకుండెను. మార్టిన్ మఱియొక గిన్నెడు తేనీరు నతనికొసంగి "సంపూర్ణముగఁ దృప్తియగువఱకుఁ ద్రాగుము" అని వచించి తనకథను ముందుసాగించెను. "నేస్తకాఁడా, చూచితివా! ఏసు బ్రతికియుండినపుడు డెవ్వరిని నసహ్యించుకొనలేదు. సామాన్యజనులలోనే యతఁడు చాలవఱకుఁ గలసిమెలసి తిరుగుచుండి వారికే బోధించుచుండెను. మనబోటి పాపిష్టులును, కూలిచేసి పొట్టపోసుకొనువారును, నతనికిఁ బ్రియతములు. వీరినుండియే యతఁడు తనశిష్యవర్గము నేర్పఱచుకొనెను. ఆ మహాత్ముని యమూల్య వాక్యలను వినియున్నావా! చెప్పెద నాలకింపుము. "ఎవఁడు తానందఱికంటె కనిష్ఠుఁడని భావించుకొనునో వాఁడందఱికంటె శ్రేష్ఠుఁడగును. ఎవఁడు తా నందఱికంటె శ్రేష్ఠుఁడని భావింప నిచ్ఛగించునో యాతఁ

డంద అకును సేవకుఁడై మెలంగవలయును; లొంగవల యును. నన్ను మీరు 'కర్తా'యని పిలుతురు. అయిన నేను మీ పాదములను కడిగెదను. బీదవారును, సంద అకును లొంగువారును, దయాళువులును, నెల్లప్పుడును దేవునికిఁ బ్రీతిపాత్రులు." ఈ వాగ్ధోరణిలో స్టీఫన్ తేనీరు త్రాగుట మఱచిపోయెను. అతఁడు స్వాభావి కముగఁ జాల మృదులహృదయుఁడు. మీఁదు పండు ముసలివాఁడు. అందుచే నాతనికన్నులనుండి యశ్రుకణ ములు దొరలి చెక్కులపై నిలచియుండెను. మార్టిన్ అతనిని "తేనీటిని ద్రాగుము" అని హెచ్చరించెను. అయిన నతఁడు దానినిగైకొనక "నాకు కడుపునిండినది; నీవు నాయుదరమునకేగాక మనస్సునకుగూడ నమృత తుల్యమైన యాహారము నొసంగితివి. నీకు నేను గృతజ్ఞతా పూర్వకములైన వందనముల నర్పించుచున్నాఁడను" అని నుడివి వెడల నుద్యుక్తుఁడయ్యెను. మార్టిన్ అత నితో "మఱల రమ్ము. నీవు నాయింటి కెప్పుడువచ్చినను సంతసమే" అని చెప్పి, యతనిని సాగనంపెను. పదపడి మార్టిన్ మిగిలియుండిన తేనీరును త్రాగి, కిటికీచెంతఁ గూరుచుండి పాదరక్షలను గుట్టుచుండెను. అయిన నా గొడగరవాని మనస్సంతయు నేసుతోను, నతని మహిమలతోను నిండి యుండెను. ఆ దినము ఏసు తన సదనము నలంకరించు ననియే యా చర్మకా

రుని నమస్కరము. ఆ క్షణమున నతఁడు గవాక్షము వంకఁ గుతూహలాయత్త చిత్తుఁడై చూచు చుండుట మాన లేదు. ఇరువురు సైనికు లాత్రోవను వచ్చిరి. అందొకఁడు మార్టి౯ చేత చేయఁబడిన పాదుకలనే దొడిగియుండెను. ఇంకొక్కఁడు ప్రభుత్వమువారి పాదరక్షలను ధరించియుం డెను. తరువాత ప్రక్కయింటి శ్రీమంతుఁడు మెఱుఁగు మేజోళ్ళను దొడిగి వడిగ వెడలిపోయెను. అటుపిమ్మట రొట్టెల నమ్మువాఁడు పెద్ద బుట్టను మోసికొని యక్క డక్కడ విక్రయించుచు ముందునకు సాగుచుండెను. ఆపై నొక పేదరాలు జీర్ణ వస్త్రములను ధరియించి శిశు సమేతయై యచ్చోటికివచ్చి గోడప్రక్క నిలచి సీతమా రుతము నుండియు మంచు నుండియు బిడ్డను మరుగు చేయు చుండెను. ఆమె వలువ లతిసామాన్యములై వేసవి కాలమునకుఁ దగినవై యుండెను. ప్రాతవడిన మోటు చెప్పులను గీలించి యుండెను. మార్టి౯ కిటికీలోఁ దొంగి చూచెను. ఆ పట్టణమున కాయమ నూతనా గంతుకయని గ్రహించెను. బిడ్డ యేడ్చుచుండుటయుఁ దల్లి యెంత యోదార్చినను నా పసిపాప యేడ్పు నిలుప కుండ నుండుటయు గాంచెను. ఆ యనాథ యుండిన దీనస్థితినిఁ జూచి మార్టి౯ కరుణగల వాఁడాయెను. సత్వ రముగ గవాటమునుదీసి, యామెను సంబోధించి, "అమ్మా రమ్ము; బిడ్డనెత్తుకొని మంచులో నెందులకు నిలచి

యున్నావు? లోనికివచ్చి యించుక చలికాచుకొనుము. బిడ్డకును శాకమునిమ్ము. అది యూరడిల్లి యేడ్పును నిలుపును" అనవుడు, పరపురుషుడు పిలచినందుల కామె యచ్చెరువొంది మౌనముగా నుండెను. అయిన, నాహ్వానించిన వ్యక్తి, కంబళిని గప్పుకొని కంటి యద్దములను ధరించి యుండు వృద్ధుఁడై యుంట యెఱింగి, ఆ స్త్రీ తప్పుగాఁ దలఁపక యతని యింటిలోనికి వెంబడించి పొయ్యి ప్రక్కన గూరుచుండి చలికాచుకొను చుండెను. చంటి బిడ్డకును వేడిమి నొసంగెను. అయిన నాపాప డేడ్పును నిలుపఁడాయె. మార్టిన్ బిడ్డకుఁ బాలనిమ్మని వేడెను. అందులకా బీదరాలు "నాయనా, నేను భోజనముచేసి యొక్క దినము మధ్యాహ్నమును నయినది. పాలు లేదు." అని వచింప మార్టినవిని వ్యసనముతోఁ దల యూచెను. పాలులేకపోయినను నా కృశాంగి బిడ్డకు స్తన్యమునీయ మొదలిడగా నయ్యది యేడ్చుచునే యుండుట మార్టిన్ చూచి, వేగిర నొక తట్టలో నన్నము నుంచి తాఁ జేసియుండిన కోసుగడ్డ పులుసునువేసి బల్లపై నుంచి యామెను భుజింపుమని వేడెను. బిడ్డను దా నెత్తుకొని "నేనును బిడ్డలను గన్నవాఁడనే. బిడ్డల నాడించుట నాకుఁ జక్కగ వచ్చును" అనిచెప్పి, యా స్త్రీ బోనము నారగించు నపుడు మార్టిన్ కంద నాడించు కొను చుండెను. వ్రేళ్ళతోఁ జిటికెలు వేసెను. ఆశిశు

వేడ్పు నిలుపలేదు. దానినోటఁ దనవ్రేలినిఁ బెట్టుచు గ్రుక్కిన లాగుచుండెను. ఇట్లు పలుమారొనరించు సరికా బిడ్డడేడ్పునుమాని కిలకిల నవ్వసాగెను. దాని తోఁగూడ తానును బొక్కినోరును దెఱచి మార్గిట నవ్వుచుండెను. భుజించునపు డా స్త్రీ స్వకీయ విష యములను గూర్చి యిత్తెఱంగున జెప్పెను. "నేనొక సైనికోద్యోగినిఁ జేపట్టితిని. దాదాపొక సంవత్స రము క్రితము నాభర్తను యుద్ధమున కంపిరి. అప్పటి నుండి యతని జాడయే తెలియదు. నాకు జీవనోపా యము లేకపోవుటచే, గర్భిణిగానుండినను, నొక గృహస్థుని యింటిలో వంటచేయ నిలచితిని. కొన్ని నెలలు యోచన లేక కడచెను. ఆవల నీ బిడ్డఁడు జననమందెను. అంత నాయింటి యజమానురాలు చంటిబిడ్డతో నన్నుంచు కొన నిష్టములేదనియు, వేఱొక వంటకూలిదానిని నియ మించుకొనెదననియు, నాకుఁ దెలియఁజెప్పి నన్నుఁ బొమ్మనెను. ఈ విశాల ప్రపంచమునం దేను నిలువ నీడలేక పరితపించుచు గొన్నిదినములు గడపితిని. చెంత నుండిన వస్తువుల నన్నియు నమ్మియో, లేక కుదువఁ బెట్టియో, కొంతడబ్బునుదెచ్చి యసువుల నిలుపుకొన గలిగితిని. ఎవరో శ్రీమంతులొకఱు తల్లిలేని బిడ్డకు స్తన్యమునిచ్చు చంటిబిడ్డతల్లి కావలయునని చెప్పి యుంటను విని నే నచటికిఁబోతిని. వారు నా కృశశరీర

మునుజూచి వలదుపొమ్మనిరి. నా నొసటివ్రాఁతకుఁ బలవించుచు, నొకయింటిచెంత గూరుచుండియుండగా నాగృహిణి నాపై జాలిగలిగి తనయింటిలో బాడుగలేక యొకగదిని నాకొసంగెను. నే నిప్పుడచ్చట నివసించుచున్నాను. ఉదరంభరణమునకై యేదైన యుద్యోగమును వెదకుచుండగా మాపల్లెకుఁజేరిన స్త్రీయొకతె నాకంటఁబడెను. ఆమె యొక సౌధములో నీళ్ళు మోయు పని చేయుచున్నదట. అదే సౌధములో నొక చిన్న పని ఖాళీగానున్నదని విని యచటికే నిప్పుడు పోయి యుంటిని. నాదురదృష్టవశమున నాగృహిణి పని యేదియును నిప్పుడులేదనియు, నొకవారము గడచిన పిదప మరల రావలయుననియు జెప్పి పంపివేసెను. ఆ పుణ్యాత్మురాలి మేడ చాలదూరముననున్నది. నేను వెడలినపుడు మంచు విశేషముగఁ బడుచుండలేదు. అయిన మధ్యమార్గమునకు వచ్చుసరికి యయ్యది యత్యధికముగఁ బడఁజొచ్చెను. నిన్నటినుండి యన్నము లేక పోవుటచే నాఁకలిబాధ యొకవైపు, బిడ్డపాలులేక చలికి జిక్కి చనిపోవునేమోయను దిగులొకవైపు. ఎంత యోదార్చినను నేడ్పునిలుపకుండ నుండిన బిడ్డను చలి నుండి కాపాడనెంచి మీయింటి గోడప్రక్క నిలచితిని.”

అన, నావృద్ధచర్మకరుఁ డత్యంత విషణ్ణహృదయుఁడై “యమ్మా, నీకు వెచ్చగాఁ దొడుగుకొనుటకు బట్టలు

రేవా ?" యని యడిగెను. అంతట నా దౌర్భాగ్యురాలు "లేవు, తండ్రీ! నాకెక్కడనుండి వచ్చును? నాచెంతనుండిన నొకటే శాలువను గతవారమే దనాలకుఁ గుదువఁబెట్టి వచ్చిన పైకముతో రెండుమూడు దినములు గడపితి." నా, నాముసలివాని హృదయ మినుప గుది యతోఁ జీల్చినట్లాయె. వడిగఁబోయి తన బట్టల పెట్టెలో వెదకి యొకయంగినిదెచ్చి, ఇదిగో, దీనిని గైకొమ్ము. ఇది చాల పాతది; ఐనను కొంచెము వెచ్చగఁ దొడుగుకొనవచ్చును." అని నుడివి దాని నామెకిచ్చి మదిసంతసించెను. ఆమె యాజీర్ణవస్త్రమునే పరమపావనముగ నెంచి, దానిని బుచ్చుకొని యానంద బాష్పములను రాల్చెను. ఆవల నామె "దీనిని నా బిడ్డకు వెచ్చగగప్పెద. దీనరక్షకుండైన యేసువే నన్ను మీయింటి గవాక్షముచెంత నేడు నిలఁబడునట్లు చేసె నోపు! ఆ మహానుభావుఁడే కిటికీలోఁ జూచునట్లు మీకు బుద్ధిఁబుట్టించెనేమో!! నేడు మీరు నాకొనరించిన మహోపకారమును నాప్రాణాంత పర్యంతము మఱువను. చలిలోఁ జచ్చుచుండిన బిడ్డను మీరు నేడు కాపాడి యపారమైన పుణ్యమును గట్టుకొంటిరి." అన నావృద్ధుఁడు "తల్లీ కారణములేకయే కార్యముపుట్టదు. నేనుద్దేశ పూర్వకముగానే గవాక్షముం దీదినము చూచు చుంటిని. ఏసు నిన్నరేయి నాతోఁజెప్పియే యుండెను."

నావుడు, నాసాధ్వి "ఏను మీ కెట్లు తెలియఁజేసెను, నా రాక" అని యడుగ నందులకా గొడగరవాఁడు వెనుకటి దినము రాత్రి జరిగినదంతయు నామెకు పూసగ్రుచ్చినట్లు తెలిపెను. దాని నాలకించి యా వనితారత్నము భక్తి భావ సమన్వితంబైన ముఖభావంబుతో నిట్లనెను. "తండ్రీ యిట్టి సంఘటనలు కేవలము మనోకల్పితము లుగాక నడచియే యున్నవి." అంత నామె యిల్లు వెడల నుద్యమించెను. మాట్రిక్ తనపెట్టెలో నుండిన పైకములో నైదణాలనుదీసి యామె చేతిలోనుంచి, "అమ్మా నీకుండిన యొక టేశాలువను గుదువఁబెట్టితి నంటివే! దాని నీపైకమునిచ్చి విడిపించుకొనుము." అని వచించి, యా యిల్లాలిని సమర్యాదగ సాగనంపెను. పిదప నతఁడు శేషించిన యన్నమును భుజించి క్రమ్మఱఁ గుట్టుపని సేయుచుండెను. గవాక్షమున నాగంతుకులను గాంచుట మఱువఁడాయె. మెండుగా జనులు వచ్చుచు బోవుచునుండిరి. ఇంచుక నీడపడిన గొబ్బునఁ దలయెత్తి చూచుచుండెను. ఇట్లు కొంతకాలము గడచెను. అంతలో నొక ఫలములనమ్ము వృద్ధస్త్రీ యచ్చటికి వచ్చెను. తాను విక్రయించుచుండిన సేబు పండ్లలో ముక్కాలు మువ్వీసము నమ్మి, శేషించిన వానిని గంపలోనుంచుకొని, తలమీఁద పెట్టుకొని యుండెను. మఱొక గంపలో నామె మానుతుండ్లను నింపుకొని దానిని చంకలో

నుంచుకొని యుండెను. ఆ మానితుసకల నామె యెందో నూతనగృహ నిర్మాణ మగుచోటఁ బ్రోగుచేసి వంటకము వండుటకై తీసికొని పోవుచుండెను. అది చాల బరువుగ నుండుటచే దానిని తలమీఁదఁ బెట్టుకొననెంచి సేబుపండ్లుంచిన దానిని దిగువకు దింపెను. కనుమూసి తెఱచు నంతలో నెక్కడినుండియో యొక తుంటరి బాలుఁడు చినిగిన యంగరకముతోను మాసిన టోపీతోను 'సర్రని' వచ్చి యొక సేబును లాగుకొని యుఱుకు చుండెను. అంతలో నాముదుసలి చాల యనుభవజ్ఞ యగుటచే మాని తుసకల గంపను నేల గూలించి బాలుని వెంబడించి వాని యంగరకమును గట్టిగ బట్టెను. ఆకుఱ్ఱ డంత యంగరకము నందే వదలి వేసి పలాయన మాయెను. వెంటనే యాస్త్రీ వానిని వెన్నాడి, వాని టోపీని బట్టెను. దానినికూడ వాఁడు విడిచి పార నుంకింప నామె వాని జుట్టునుబట్టి నిలిపి చెంపలమీఁదఁ దనశక్తి కొలఁది నప్పళించెను. బాలుఁడు కడు దీనుఁడై తాను సేబును ముచ్చిలింప లేదనియు నిర్దోషియనియు నొట్టుపెట్టి రోదనము సేయుచు విడువుమని వేడుచుండెను. మార్టిన్ ఈ యేడ్పును విని, కిటికీలోఁ దొంగిచూచెను. పండ్ల ముసలిది బాలుని ముడిఁబట్టి చెంపలపై మోదుచుండుట గాంచెను. మార్టిన్ హృదయమున సంతాపము కలిగెను. వడిగ

వెడలి, బాలుని రక్షింప నెంచెను. అంతలో నతఁడు మెట్లపైఁ దాటిపోలి, కంటి యద్దములను బడవేసికొనెను. అయినను వానిని గమనింపక, మొదలు బాలునియొద్ద కరిగి, వానిని విడువుమని యామ్త్రీని వేడెను. "వీఁడు తెలియని బాలుఁడు; క్షమింపుము" అని మార్టిక్ యెంత బ్రతిమాలినను నామె కోపాగ్ని చల్లారలేదు. "వీఁడు చాల దుష్టుఁడు. వీనికిఁ దగిన బుద్ధిని నేర్పవలయు. రక్షక భటుల కప్పగించిన వారు వీనిని సరియయిన విధమున సన్మానింతురు. వారి యొద్దకు వీని నిప్పుడే యీడ్చుకొని పోయెద" నని చెప్పుచు వాని నామె లాగుచుండెను. మార్టిక్ ఆమెను కోపము నాపుకొనుమని ప్రార్థించెను. అంత నామె కుఱ్ఱని వదలెను. బోయని వలనుండి తప్పించుకొనిన పక్షివలె నాబాలుఁడు గ్రక్కునఁ బారనుంకింప, మార్టిక్ వాని చేఁబట్టి "ఓరీ! నీవు పండును దొంగలించిన దేను కన్నులార గాంచితిని; ముసలమ్మ క్షమాపణను వేడుము." అని మందలింప, భీత మనస్కుఁడై యా బాలుఁడామె క్షమాపణ వేడెను. మార్టిక్, ముసలమ్మగంపలో నుండిన మఱియొక సేబును దీసి వానికిచ్చి, మందహాసమును గనుబఱచెను. ముదుసలిది మార్టినును జుఱ జుఱఁ జూచెను. ఆమె మనోభావము నతఁడు గ్రహించి "దాని విలువను నేనిచ్చివేసెదను లెమ్ము" అని మార్టిక్ పలుక, నందుల కామె

"మీరిట్టి దుష్టులను బ్రోత్సహించునది. రక్షక శాఖ వారు వీనికెదగిన పారితోషకము నిత్తురు. ఒక్క వారము దినములు పిరుదులూరి నేలపైc గూరుచుండ వలను పడనట్లు చేతురు!" నా, నావృద్ధుc డామె విస్త వృత్తికై వగచి, యిత్తెఱంగున మనవిచేసెను. "అమ్మా, యట్టిపని నెన్నcటికిని చేయకుము. మనదృష్టిలో నిట్టి శిక్షలు సూక్ష్మములని తోపవచ్చును. అయిన దేవుని దృష్టిలో నివి సరికావు. ఒక సేబుపండును దీసికొనిన దానికై రక్తముకారి చర్మము లేచునట్లు కొరడాతోc గొట్టించిన, మనము నిత్యమొనరించు పాపకార్యములకై యెంతటి కఠిన శిక్షల ననుభవింపవలయునో యించుక యోచింపుము." అన, నా ముసలమ్మ నిరుత్తరయై నిలువcబడెను. తదుపరి మార్టిక్ వారికొక చిన్నకథ నిట్లు చెప్పెను: "పూర్వమొక రాజుండెను. అతcడొక వర్తకునికి విశేష ద్రవ్యము నప్పుగా నిచ్చియుండెను. ఋణము నిచ్చివేయవలసినదని రాజతనిని యడుగగా నందులకా వర్తకుcడు "నాయొద్ద నొక చిన్నికాసైనను లేదు; నన్ను క్షమింపుcడు" అని మనవి చేసెను. రాజా తని మన్నించెను. పిదప నా వర్తకుcడు తనకుc గించి ద్ద్రవ్యము నప్పు నీయవలసి యుండిన యొక బీదవాని యొద్దకరిగి యా నిర్గతికుని డబ్బునిమ్మని కట్టడిచేసి యడి గెను. అతcడు చేతc బైకము లేదనెను. ఆవల నిచ్చెద

వనెను. అయినను నా వర్తకుఁ డాదారాభ్యాళ్యని న్యాయ స్థానమునకీడ్చి యతనిని జెరసాలకుఁ బంప నుంకించెను. రాజీసుద్దిని విని, వర్తకుని బిలపించి 'ఓరీ బహుద్రవ్యము నీయవలసిన నిన్ను నేను మన్నించియుండగా, స్వల్ప ఋణము నీయవలసిన నా నిరుపేద నేల న్యాయస్థానమున కెక్కించితివి? నీవెట్టి ఖలుఁడవు" అని చీవాట్లు పెట్టగా నా వర్తకుఁ డపుడు సిగ్గుచెంది, 'మహాప్రభూ, క్షమింప వలయును. నేను చేసినది తప్పు' అని వేడెను. రాజా వర్తకుని క్షమించెను. ఈ కథను వినిన వృద్ధ స్త్రీ నిట్టూర్పువిడచి, తలయూచి, 'ఔను, మీరు చెప్పున దేమో సరియేగాని యీ కాలపుఁ గుఱ్ఱవాండ్రు చాల చెడిపోయినారు.' అన, మార్టిన్ అందులకు "వారిని సరి దిద్దు కర్తవ్యము పెద్దవారయిన మనది కదా!" అని వాకుృచ్చెను. దానికా ముదుసలి 'నేఁ జెప్పునదియు నదియే' అని వక్కాణించి, స్వీయ సంసార సంబంధము లైన విషయముల నిట్లు తెలుపసాగెను: "నాకును పది మంది బిడ్డలుండిరి. ఒక యాఁడుబిడ్డతప్ప తక్కిన వారం దఱును మృత్యువువాతఁ బడిరి. ఈ వృద్ధాప్యమునం దే నాబిడ్డ యింటనే నివసించు చున్నాను. నాకు ముగ్గురు మనుమరాండ్రును, నొక మనుమడును గలరు. వారికి నాపైఁ బట్టరాని ప్రేమ. వారి ముచ్చటలు కూర్పు మాటలు వినుచుండిన నన్నపానాదులు సయితము నాకుఁ

గాఁబట్టును. నన్ను వారు 'ముద్దవ్వ, చిన్నవ్వ, మాయవ్వ' అని వివిధములుగ సంబోధింతురు.'' ఇట్లామె యానంద పరవశయై చెప్పుచుండ, మార్టిక్ ఆమెతో నిట్లనెను: “ఈ పసిబాలుఁడుకూడ వారి వలెనేగదా”. నిష్కల్మషమైన మనస్సుతో నా వృద్ధాంగన “అయ్యో పాపము, వానికేమి తెలియును? వాఁడును పసిబిడ్డడే! దేవుఁడు కాపాడుగాక” యని దీవించెను. అంత పండ్ల పుటికె నెత్తుకొని మాగ్రిని ముక్కల గంపనుకూడ కష్టసాధ్యముతో నెత్తుకొనుచుండెను. బాలుఁడది గాంచి, “అవ్వా, నేను నీకుఁ దోడ్పడెదను. ఈ గంపను నేను మోసుకొని వచ్చెద; నీవు సమ్మతించిన నేనాత్రోవనే పోవువాఁడను” అని నడువగా, నందులకామె తన యంగీకారమును సూచించుచు తలయూచెను. అంత నాకుఱ్ఱవాఁడు గంపను తన శిరముపై నుంచుకొని ముసలమ్మ జతలో నరిగెను. వారిద్దరును వైమనస్యము మాని సంతోషముగా సంభాషణ మొనరించుచు త్రోవనడచుచుండిరి. మార్టిక్ బాలుని కొసంగిన సేబుపండు విలువ నడుగుటకు నయితే మా వృద్ధ స్త్రీ మఱచి పోయెను. మార్టిక్ వారిరువురును కన్ను మఱుగగు వఱకు జూచుచునే యుండి యావల నింటికి మఱలెను. ఇంటి మెట్లపైఁ బడవేసికొని యుండిన ముక్కద్దములను పైకెత్తి చూడఁగా నవి యించుకైనను బగిలి యుండలేదు.

పిదప నా గొడగరవాడు మనుపటివలెనే పాదరక్షలను గుట్టుచు గవాక్షమున కెదురుగఁ గూర్చొనెను. ఇట్లు కొంతకాలము గడచెను.

అంత దినకరుండు జలధింగృంకెను. ఆకసమున సంధ్యారాగంబు క్రమక్రమముగ జారుచు, చీకటులకెడమిచ్చుచుండెను. పక్షులు కలకలా రావంబుతో గూండ్లను జేరుచుండెను. పసుల మందలు పగలంతయు విపినమున కసువును మెసవి సరగు సరగున నిజస్థానంబుల కరుగుదెంచుచు దమ పాదధూళిచే వీధుల నింపుచుండెను. గోపబాలకు లాహ్లాద సూచకంబులైన గీతంబులను సుశ్రావ్యముగఁ బాడుచు వానిని నెంబడించుచుండిరి. కార్మికులు తమ దినకృత్యంబులనుండి విముక్తులై నిజ నివాసంబుల కతిత్వరితగతినిఁ బోవుచుండిరి. వీధి దీపములను వెలిగించువాడు క్షిప్రముగ దీపములను వెలిగించుచు ముందుకు సాగుచుండెను. మార్టిక్ కూడ తన పనిని(జాలించి దీపమును వెలిగించెను. ఆ దినము తాఁజేసిన పాదరక్షలను నెరతనమున ద్రిప్పిత్రిప్పి చూచెను. అది నిర్దోషముగ నుండెను. తోలు ముక్కలను తదితర యుపకరణములను బోగుచేసి యొకచోట భద్రపఱచెను. ఆవల నతఁడు వాడుక చొప్పున భుజియించి 'సువార్తల'ను జదువుచుఁ గూరు చుండెను. వెనుకటిరాత్రి యేభాగమునందు జదువుట

నిలిపియుండెనో, యందు సంకేతార్థమై తోలుముక్క నొకటినియుంచి యుండెను. ఏమిచోద్యమో కాని, యా తోలుముక్క వేరొక భాగమునందుండెను. తన పూర్వానుభవముల నన్నియును మఱల నతని మనశ్చక్షువుల యెదుట వచ్చి నిలచెను. తటాలున నాయింటి యందుఁ గాలిచప్పుడు వినవచ్చెను. మార్టిన్ ఎవ్వరో యని తిరిగిచూచెను. ఎవ్వరును నగుపడరైరి. అయిన నాగృహమునందుఁ జీకటిగానుండిన నొక మూలలో నెవ్వరో నిలువఁబడియుండు నట్లుండెను. అవి యస్పష్టములైన యాకారములుగా నుండెను. అంత మార్టిన్ చెవిలో "మార్టిన్, మార్టిన్ నీవు నన్ను గుఱుతుపట్టలేదా ?" అను మాటలు వినఁబడెను. "ఎవ్వరది" అని మార్టిన్ అడిగెను. ఆ యాకార మించుక ముందునకు వచ్చి "నేను" అని బదులిడెను. ఆయాకారము స్టీఫన్నును బోలియుండెను. అంత నారూపము మందహాసమును మోమున నగుపఱచుచు నదృశ్యమాయెను. రెండవరూపమును నట్లే ముందునకరుగదెంచి "నేను" అని పకార్షించెను. అయ్యది శిశుసమేతమై వచ్చియుండిన స్త్రీని బోలియుండెను. ఆమెకూడ మందస్మితవదనయై కిలకిల నవ్వుచుండిన చంటిబిడ్డనెత్తుకొని యుండెను. ఉత్తర క్షణముననే యామె కనుల మరుగై పోయెను. ఆపిదప పండ్లనమ్ముచుండిన

వృద్ధస్త్రీయు బాలుఁడును ముందునకరుగదెంచి "నేను, నేను" అని వచించి చిఱునవ్వుతోఁ గూడిన ముఖము లతో మాయమైరి. మార్టినునకు బ్రహ్మానందము కలిగెను. దేవునికి దీనుఁడై మొ్రక్కెను. నేత్రదర్పణ ములను ధరియించి సువార్తలలో సంకేత ముంచఁబడి యుండిన భాగమును దీసి చదివెను. అందీమాట లుండుట గాంచెను. "నే నాఁకలి గొనియుంటిని; నీవు నాకన్న మిడితివి. నేను దప్పిగొనియుంటిని; నీవునాకు త్రాగను పానీయ మొసంగితివి. నే నపరిచితనైనను నన్నాహ్వా నించి నాకాతిథ్యము నొసంగితివి."

ఆవల నాపుటలోనే తుదిభాగంబున నీమాట లతనిఁ గంటపడెను. "మానవులలోఁ జాలనికృష్టులని భావింపఁబడు నా సోదరులకు నీవు గౌరవముతో నాతి థ్యము నొసంగితివి గాన నయ్యవి నాకుఁజెందినవి."

ఆదినము నిక్కువముగా నేసుక్రీస్తు తనయొద్ద కరుగుదెంచి యుండెననియుఁ, దాఁగనిన కల కల్లకాద నియు మార్టిన్ గ్రహించెను.

---

శ్రీ సాధన ప్రెస్, అనంతపురం.